بِسْمِ اللّٰهِ الرَّحْمٰنِ الرَّحِيْمِ

అనంత కరుణామయుడు అపార కృపాశీలుడైన అల్లాహ్ పేరుతో

**అల్‌హమ్దు లిల్లాహి రబ్బిల్ ఆలమీన్ వస్సలాతు వస్సలాము అలా సయ్యిదిల్ ముర్సలీన్ వల్ ఆఖిబతు లిల్ ముత్తఖీన్- అమ్మాబాద్....**

వివాహం (నికాహ్) మానవ జీవితంలో ఓ కీలక మలుపు. మగపిల్లవాడు పుట్టినప్పుడు తల్లిదండ్రుల ఆనందానికి అవధులు ఉండవు. కన్నవారు తమ ముద్దుల కొడుకును ఎంతో గారాబంగా పెంచుతారు. ఎన్ని కష్టాలైనాసరే భరించి తమ బిడ్డను సుఖ సంతోషాలతో పెంచుతారు. అతన్ని సంతోషపెట్టడానికి ఎన్ని బాధలైనా భరిస్తారు. అతనికి ఉన్నత చదువులు చదివించి ప్రయోజకుణ్ణి చేయటానికి అహోరాత్రులు శ్రమిస్తారు. అతను యుక్త వయస్సుకు చేరుకున్నప్పుడు ఎన్నో ఆశలు పెంచుకుంటారు. అతని కోసం పెళ్ళి సంబంధాలు చూస్తారు. అందచందాలు గల కోడల్ని తేవాలని ఉబలాటపడతారు. కోడలు పిల్ల ఇంటికి వస్తుంది. కొంతకాలం అంతా సజావుగానే సాగుతుంది. కాలక్రమేణా పరిస్థితిలో మార్పు వస్తుంది. అప్పటి వరకూ అమ్మానాన్నల మాటే ముత్యాల మూటగా భావించిన కొడుకు వారి సలహాలను ఖాతరు చెయ్యడు. అప్పటివరకూ తల్లిదండ్రులకు కన్నులపండువగా ఉన్న కుమారుడు ఇప్పుడు 'భార్యావిధేయుడు'గా మారిపోయాడు. తమ ఇంట్లో కాలుమోపక ముందు కోట్లలో ఒకటిగా కానవచ్చిన కోడలు పిల్ల ఇప్పుడు కంటిలో దూలంగా కనిపిస్తుంది. ఫలితం మామూలే. పండంటి కాపురంలో కలతలు మొదలు. అత్తామామలు, భర్త, కోడలు- త్రిముఖ పోరాటం! వారంతా ఒకచోట ఉండలేని పరిస్థితి!

ఇదిలావుంటే ఆడపిల్ల పుట్టిన ఇంట్లో అజ్ఞాన కాలంలాగానే ఇప్పటికీ తల్లిదండ్రుల ముఖాలు వాడిపోతాయి. ఆడపిల్ల పోషణా బాధ్యత, ఆమె చదువు సంధ్యలు, మానమర్యాదల రక్షణ, పెళ్ళి సంబంధాల వేట, స్థోమతకు తగ్గట్టుగా కట్నకానుకల ఏర్పాట్లు, వివాహానంతర సమస్యల పరిష్కారం- ఈ విధంగా తల్లిదండ్రుల కంటికి కునుకు లేకుండా పోతుంది.

మన సమాజంలోని సగటు మనుషుల్లో అత్యధికులకు ఈ సమస్యలు మామూలే. అతి కొద్దిమంది మాత్రమే ఈ బాదర బందీలకు దూరంగా ఉన్నారు. మచ్చుకు కొన్ని వార్తల్ని గమనించండి:

1) కూతురి పెండ్లి విషయంలో భార్యాభర్తల గొడవ. భార్య కాళ్ళు చేతుల్ని నరికి ఉరి తీసిన భర్త. (నవాయె వక్త్- లాహోర్: 22-8-1997)

2) కోరిన చోట పెండ్లి చేయనందుకు ఆగ్రహించి తండ్రిని రివాల్వర్‌తో కాల్చిచంపిన తనయుడు. (ఉర్దూ న్యూస్, జెద్దా : 16-11-1997)

teluguislam.net



3) రెండో పెండ్లికి అంగీకరించనందుకు భార్యను కాల్చిచంపిన భర్త. (జంగ్: 11-11-1997)

4) ప్రియునితో కలిసి మొగుణ్ణి కడతేర్చిన ఇల్లాలు. (నవాయె వఖ్త్ : 18-8-1997)

5) పునర్వివాహం చేసుకున్నందుకు తల్లిని చంపిన తనయుడు. (నవాయె వఖ్త్:11-8-1997)

6) ప్రేమ వివాహం ఫలించనందుకు నిస్పృహకు గురై ఆత్మహత్యకు పాల్పడిన జంట. (నవాయె వఖ్త్: 11-8-1997)

7) కోర్టు ద్వారా విడాకులు కోరినందుకు భార్యపై ఆగ్రహించి యాసిడ్ పోసిన భర్త. పరిస్థితి విషమించగానే అక్రమ సంబంధాన్ని అంటగట్టాడు. (నవాయె వఖ్త్:లాహోర్: 13-7-1997)

8) చెల్లికి విడాకులిచ్చారన్న కోపంతో ఆమె మామను చంపిన అన్నలు. (నవాయె వఖ్త్: 29-7-1997)

9) ప్రేమ వివాహం చేసుకున్న యువతి కోర్టుకు వెళుతుండగా దారుణ హత్య- అంత్య క్రియలకు పుట్టింటివారు, మెట్టింటివారు గైర్హాజరు. జైల్లో ఉన్న భర్త. (జంగ్:30-7-1997)

10) సంతానం కలగనందుకు నరకయాతన పెడుతున్న భర్త. పోలీసులకు ఫిర్యాదు చేసిన ఇల్లాలు. (సహాఫత్, లాహోర్:25-8-1997)

ఈ వార్తలను బట్టి మన సామాజిక వ్యవస్థ ఎంత నికృష్టంగా తయారయిందో, ఆలు మగలు కట్టుకున్న అనురాగ గోపురానికి ఎటువంటి ప్రమాదం పొంచివుందో ఊహించటం కష్టమేమీ కాదు. పరిస్థితుల ఈ నికృష్ట స్వరూపాన్ని చూసిన మన మేధావులు, ఆలోచనా పరులు, సంఘశ్రేయోభిలాషులు మీనమీషాలు లెక్కించుకుంటూ, గోళ్లు గిల్లుకుంటూ కూర్చునే బదులు ఇస్లాం ప్రబోధనల వెలుగులో సమస్యకు పరిష్కారం సూచిస్తే బావుండేది. దాంపత్య జీవితంలో ఇస్లాం స్త్రీ పురుషులకు ఇచ్చిన హక్కులు- బాధ్యతలను విశ్లేషించి, వాటి రక్షణకు కృషి చేయవలసింది. కాని గత అర్ధశతాబ్దిగా దేశాన్ని (పాకిస్తాన్‌ని) పరిపాలించిన వారు పాశ్చాత్య భావజాలానికి ప్రభావితులైనవారే. వారు ఎంత సేపటికీ తమ దేశ సమస్యలకు పరిష్కారం పాశ్చాత్య తరహాలోనే ఆలోచిస్తారు. ఎవరు అవునన్నా కాదన్నా ఇది మాత్రం చేదు వాస్తవం. ఇటీవల సుప్రీంకోర్టు న్యాయమూర్తి సారథ్యంలో ఏర్పాటు చేయబడిన మహిళా హక్కుల కమీషన్ ప్రభుత్వానికి చేసిన సిఫార్సులు ఈ వాస్తవానికి ప్రబల తార్కాణం. ఆ కమీషన్ చేసిన సిఫార్సుల్లో కొన్నింటిని చూడండి:

1) భార్య ఇష్టాయిష్టాలతో నిమిత్తం లేకుండా లైంగిక సుఖం పొందిన భర్తను నేరస్తునిగా పరిగణించాలి. ఈ నేరానికిగాను యావజ్జీవ కారాగార శిక్ష విధించాలి.[1]

2) 120 రోజుల వరకూ గర్భవతికి అబార్షన్ చేయించుకునేందుకు చట్టపరమైన భద్రత కల్పించాలి.

3) భర్త ఇష్టాయిష్టాలతో నిమిత్తం లేకుండా ఫ్యామిలీ ప్లానింగ్ చేయించుకునే స్వేచ్ఛాధికారం భార్యకు కల్పించాలి.[2]

---

1. పాశ్చాత్య సామాజిక వ్యవస్థలో భర్త గనక భార్య ఇష్టానికి వ్యతిరేకంగా రతి క్రీడ జరిపితే నేరంగా భావించబడుతుంది. దానికి కారాగార శిక్ష కూడా ఉంటుంది. లండన్‌లో ఒక స్త్రీ ఈ నేపథ్యంలో కోర్టు కెక్కింది. నా భర్త నా ఇష్టాయిష్టాలతో నిమిత్తం లేకుండా నన్ను మరిగాడని నిస్సిగ్గుగా ఆరోపించింది. బ్రిటన్ న్యాయస్థానం ఈ కేసును యమ సీరియస్‌గా తీసుకుంది. వాదోపవాదాల తరువాత న్యాయమూర్తి తన తీర్పును వినిపిస్తూ; "స్త్రీ ఒక భార్య అవటంతోపాటు ఆమెకు బ్రిటన్ పౌరసత్వం కూడా ఉంది. సిటిజన్ అయిన కారణంగా ఆమెకు స్వాతంత్ర్య హక్కు కూడా వుంది. కాబట్టి ఆమె స్వేచ్ఛా స్వాతంత్ర్యాలకు విఘాతం కలిగించే హక్కు భర్తకు లేదు. అందుచేత ఇది బలాత్కారం క్రిందికి వస్తుంది" అంటూ నెల రోజుల కారాగార శిక్ష విధించారు. (అల్ ఇబ్లాగ్, బొంబాయి- అక్టోబర్ 1995)

2. రెండవ, మూడవ సిఫార్సు కూడా వాస్తవానికి ఐక్యరాజ్యసమితి ఆధ్వర్యంలో జరిగిన కైరో సదస్సు (1994)లో, బీజింగ్ సదస్సు (1995)లో ఆమోదించబడిన తీర్మానాలలో భాగాలేనన్న సంగతిని మరువరాదు. అంతర్జాతీయ శక్తుల ఈ ఎజెండా 'జనాభా- అభివృద్ధి' 'ఆశాజనకమైన జనాభా', 'మహిళా హక్కులు' వంటి మోసపూరిత నినాదాల ముసుగులో యావత్ప్రపంచంలో చాపక్రింద నీరులా పారుతోంది. ఈ ప్లానింగ్ క్రింద ముస్లిం రాజ్యాలలో అశ్లీలం, నీతి బాహ్యత, పాశ్చాత్య తరహా మితిమీరిన ఉదారవాదాన్ని బలవంతంగా రుద్దే ప్రణాళిక అమలు పరచబడుతోంది. ఈ రెండు అంతర్జాతీయ సదస్సుల తీర్మానాలను నిశిత దృష్టితో పరిశీలించిన వారికి అర్థమయ్యేదేమిటంటే; (1) అబార్షన్‌ను స్త్రీల హక్కుగా ఖరారు చేసి, దానికి చట్టస్థాయి కల్పించాలి. (2) వివాహం చేసుకోకుండా లైంగిక సుఖం పొందే మార్గాలను సులభతరం చేయాలి. (3) వివాహం కొరకు వయోపరిమితిని విధించాలి. నిర్ణీత వయోపరిమితికి ముందే పెండ్లి చేసుకున్నవారిని శిక్షించాలి. (4) స్వలింగ సంపర్కానికి అనుమతి ఇవ్వాలి. (5) గర్భ నిరోధక మాత్రలను, ఉపాయాలను సర్వసామాన్యం చేయాలి. (6) పాఠశాలలు, కళాశాలల్లో కో-ఎద్యుకేషన్‌ను సర్వసామాన్యం చేయాలి. (7) ప్రైమరీ పాఠశాలల నుంచే సెక్స్ ఎద్యుకేషన్‌ను ప్రవేశపెట్టాలి.

కైరో, బీజింగ్ సదస్సుల కంటే ముందు ఐక్యరాజ్యసమితి ఆధ్వర్యంలో మెక్సికో (1975)లో, కోపెన్ హెగెన్ (1985)లో కూడా ఇలాంటి అంతర్జాతీయ సదస్సులే నిర్వహించబడినాయి. కైరో, బీజింగ్ సదస్సులు చేసిన ప్రతిపాదనలకు క్రియారూపం ఇవ్వటానికి ఇస్లామీయ ప్రజాస్వామిక పాకిస్తాన్‌లో 43వేల మంది నవ యువతులు కండోమ్‌లతో సహా ఊరూరు తిరిగి కుటుంబ నియంత్రణా పద్ధతులను బోధిస్తున్నారు. ఈ లక్ష్య సిద్ధికై మరో లక్షమంది అమ్మాయిలకు సైనిక శిక్షణ ఇచ్చే ప్రణాళిక సిద్ధం చేయబడుతోంది (తక్బీర్: 4-12-1997). మరోవార్త: "పాకిస్తాన్ ప్రభుత్వం 'రోజ్‌గార్ స్కీం' క్రింద రుణాల కోసం దరఖాస్తులు పెట్టుకునే మహిళలకు ఒక షరతు విధించింది. దాని ప్రకారం వారు ఆయా ప్రాంతాలలోని మెజిస్ట్రేట్‌ల నుంచి 'మేము బురఖా ధరించేవారం కాము' అని ధృవపత్రం పొందవలసి ఉంటుంది.' (ఖబ్రే: 1-9-1994)

teluguislam.net



4) తక్కువ వయస్సు గల భార్యలతో వారి ఇష్టానికి వ్యతిరేకంగా లైంగిక సంబంధం ఏర్పరుచుకుంటే, దాన్ని వ్యభిచార నేరంగా పరిగణించాలి.

స్త్రీని ఇంటి నాలుగు గోడలకే పరిమితం చేసి, ఆమెను కేవలం వంటింటి కుందేలుగా భావించటం, ఆమె మనోభావాలను గౌరవించకపోవటం ముమ్మాటికీ ఆక్షేపణీయమే. ఇందులో సందేహానికి తావే లేదు. అయితే ఈ కమిటీ చేసిన సిఫారసుల్లో స్త్రీ మానమర్యాదలను, గౌరవాన్ని ఇనుమడింపజేసే అంశం ఏ ఒక్కటైనా వుందా? పరదా లోపల, పడక గదికే పరిమితం కావలసిన కొన్ని విషయాలను రచ్చకీడ్చినంత మాత్రాన ఆమెకు న్యాయం జరిగిపోతుందా? ఆలోచించాలి. ఇది వాస్తవానికి ఇస్లామీయ జీవనశైలిని పాశ్చాత్య జీవనశైలిగా మార్చే విఫలయత్నం తప్ప మరొకటి కాదు.

ఒకవైపు నుంచి పరిపాలకుల ఇస్లాం విరోధ వైఖరి ద్వారా తీరని నష్టం జరుగుతుంటే మరోవైపు నుంచి నేటి మన న్యాయస్థానాలు కూడా ప్రేమ జంటలకు బాసటగా నిలుస్తున్నాయి. ప్రియునితో లేచిపోయిన ప్రేయసి "వలీ (సంరక్షకుడు) లేకుండా నికాహ్ చేసుకున్నా సమ్మతమే"నంటూ ఫత్వాలు (ధార్మిక తీర్పులు) జారీ చేయిస్తోంది.[1] దీనివల్ల పాశ్చాత్య నాగరికతా ప్రియుల ఆత్మ విశ్వాసం పెరిగింది. ఇక పాశ్చాత్య సంస్కృతిపై మోజుపడిన మహిళామణుల సంగతి సరేసరి. 'మహిళా ఉద్యమం', 'మహిళా స్వాతంత్ర్య సంస్థ', 'వుమెన్స్ ఫోరమ్', 'హ్యూమన్ రైట్స్ ఫౌండేషన్', 'వుమెన్స్ యాక్షన్ ఫోరమ్' వంటి సంస్థలు పుట్టగొడుగుల్లా పుట్టుకొచ్చాయి.[2] శోచనీయమైన విషయమేమిటంటే మన విద్యాసంస్థలు గత 50 యేళ్ళుగా నిరంతరం ఆంగ్ల మూసలో పోయబడిన నవతరాన్ని ప్రొడక్ట్ చేస్తున్నాయి. ఆ వ్యక్తులే నేడు దేశంలోని కీలక శాఖలకు అధిపతులై పాశ్చాత్య సంస్కృతి తరఫున 'వకాల్తా' పుచ్చుకొంటున్నారు.

---

1. చూడండి: ఖబ్రే : 22-2-1997; నవాయె వక్త్: 11-3-1997.

2. ఈ రకమైన సంస్థలు మహిళలపై జరిగిన జులుంను, అత్యాచారాలను అరికట్టడానికి చేస్తున్న కృషి ఏమిటో క్రింది వార్తల ద్వారా తెలుసుకోవచ్చు.

1994లో 'ప్రపంచ మహిళా దినం' సందర్భంగా వివిధ మహిళాభ్యుదయ సంస్థలు ప్రభుత్వాన్ని కోరిన డిమాండ్లు ఈ విధంగా ఉన్నాయి:

(అ) ఒకటి కన్నా ఎక్కువ వివాహాలపై ఆంక్ష విధించాలి. ఆంక్షను ఉల్లంఘించిన వారిపై చట్టపరమైన చర్య తీసుకోవాలి. (2) దేశంలోని హద్దుల ఆర్డినెన్స్, విట్‌నెస్ ఆర్డినెన్స్, నష్టపరిహార ఆర్డినెన్స్, రక్తశుల్క ఆర్డినెన్స్‌లను రద్దు పరచాలి. (3) స్త్రీ-పురుషులకు సమాన హక్కులు కల్పించాలి. (జంగ్ : 9-3-1994)

(ఆ) 1997లో ప్రపంచ మహిళాదినాన్ని పురస్కరించుకుని పాకిస్తాన్ వుమెన్స్ ఫోరమ్ ఆధ్వర్యంలో వివిధ మహిళా సంఘాలకు చెందిన మహిళలు లాహోర్‌లోని ఒక ప్రాంతంలోని ఒక రహదారిపై గుమిగూడి నృత్య ప్రదర్శన జరిపారు. (ఉర్దూ న్యూస్:10-3-1997)

ఇక్కడొక ప్రశ్న- నారీమణికి గౌరవప్రదమైన స్థానం పాశ్చాత్య తరహా జీవన విధానంలో ఉందా? లేక ఇస్లామీయ జీవన విధానంలో ఉందా? స్త్రీలపై జరిగే అత్యాచారాలు పాశ్చాత్యుల మితిమీరిన ఉదారవాదం (Permissiveness) ద్వారా అరికట్టబడతాయా? లేక ఇస్లామీయ శాసనాల ద్వారానా? మగువల హక్కులకు రక్షణ పాశ్చాత్య సమాజంలో ఉందా? లేక ఇస్లామీయ సామాజిక వ్యవస్థలో ఉందా? ఈ ప్రశ్నలకు సమాధానాలు వెతికే ముందు మేము ఒకసారి పాశ్చాత్య సామాజిక వ్యవస్థపై స్థూలంగా దృష్టిని సారించదలిచాము. తద్వారానే ఈ అప్రాచ్య వ్యవస్థ నిజస్వరూపం ముందుకు వస్తుంది.

## పాశ్చాత్య తరహా సామాజిక వ్యవస్థ

18వ శతాబ్ది చివర్లో ఐరోపాలో వచ్చిన పారిశ్రామిక విప్లవం మూలంగా కర్మాగారాలు, కొత్తకొత్త పరిశ్రమలు శీఘ్రగతిన వెలిశాయి. కర్మాగారాలలో పనిచేసే పురుష కార్మికులు సరిపోలేదు. మరింత మంది శ్రామికుల కోసం పెట్టుబడిదారీ ఆసాములు తెరచాటున ఉన్న అబలను తెరపైకి తెచ్చారు. తమ ఎక్స్‌ప్లాయిటేషన్‌ను కప్పిపుచ్చుకోవటానికి 'స్త్రీ పురుష సమానతలు', 'మహిళా హక్కులు', 'స్త్రీ స్వేచ్ఛ' లాంటి అందమైన నినాదాలిచ్చి, కొంగ్రొత్త కాల్పనిక సిద్ధాంతాలను ఆవిష్కరించారు. సహజంగానే భావోద్వేగాలు గల మహిళామణి 'స్వేచ్ఛ', 'సమానత్వం' పేరిట ఇవ్వబడిన ఈ భావజాలంలో సునాయాసంగా కొట్టుకు పోయింది. పురుషునితోపాటు తానూ తలెత్తుకుని తిరగాలన్న అత్యుత్సాహంతో ఆర్థిక రంగంలోకి దూకింది. దీనివల్ల అసలు లాభపడిందెవరంటే పెట్టుబడిదారుడే. కొద్దోగొప్పో ఆర్థిక లాభం కార్మిక, మధ్యతరగతి కుటుంబాలకు కూడా కలగకపోలేదు. ఒక వ్యక్తి సంపాదనతో నలుగురైదుగురు బ్రతికేవారు. ఇప్పుడు ఇద్దరు ముగ్గురు వ్యక్తుల సంపాదన వచ్చేసరికి జీవనావసరాలు పెరిగాయి. జీవన ప్రమాణాలు కూడా పెరిగాయి. ఆశల ఆరాటంలో జీవన పోరాటం మరింత వేగం పుంజుకుంది. ఫ్యాక్టరీలలో స్త్రీలు-పురుషులు అహోరాత్రులు యాంత్రికంగా పనిచేసి సంపాదించటమే నవ జీవన సారంగా మారిపోయింది పరిస్థితి.

ఈ విధంగా స్త్రీ-పురుషుల కలయిక కార్ఖానాలకు, కార్యాలయాలకు మాత్రమే పరిమితం కాలేదు. ఈ పరిధి క్రమక్రమంగా విస్తరిస్తూ హోటళ్లు, రెస్టారెంట్లు, క్లబ్బులు, పబ్‌లు, షాపింగ్‌లు, లాడ్జింగులు, పార్టీలు, విందులు, వినోదాలు, విహార యాత్రలు, ఎన్నికల ప్రచారాల వరకు విస్తరించింది. ఈ రకంగా స్త్రీ పురుషుల సమ్మిళిత వాతావరణం సొసైటీని ఆక్టోపస్‌లా అల్లుకుపోయి లజ్జా వ్రీడలు, మానమర్యాదల్ని మంట గలిపేసింది. నీతికి విలువా, నాతికి వలువా లేకుండాపోయే దుస్థితి దాపురించింది. మగవాడితో చేయి చేయి కలిపి, హాయిహాయిగా నడవాలని ఉవ్విళ్ళూరిన ఆడది వయ్యారాలు ఒలకబోయ

teluguislam.net



సాగింది. శరీరానికి అతుక్కుపోయే దుస్తులు, అర్ధనగ్న వస్త్రాలు ధరించసాగింది. బికినీలు, కురచ చడ్డీలు వేసుకుని స్విమ్మింగ్ పూల్‌లో జలకన్యలా జలకాలాట మొదలెట్టింది. వ్యవహారం అక్కడితో ఆగలేదు. స్త్రీల అర్ధనగ్న, ముప్పాతిక నగ్న చిత్రాలు, ఆఖరికి నగ్న చిత్రాలు కూడా తీయబడ్డాయి. బెడ్‌రూంలోని రతి క్రీడలు సయితం బ్లూఫిలింల ద్వారా తెరకెక్కించబడ్డాయి. ఈ విశృంఖలత్వానికి పరాకాష్ట ఏమిటంటే నేడు పాశ్చాత్య దేశాలలో 'మహిళా హక్కులు', 'మహిళా స్వాతంత్ర్యం' పేరిట స్త్రీలు పబ్లిగ్గా నగ్న ప్రదర్శన లివ్వటం, పెళ్ళి కాకుండానే పిల్లల్ని కనటం పరిపాటి అయిపోయింది. ఇటీవల అమెరికాలోని ఓ హైస్కూల్లో ఎనిమిదో తరగతి విద్యార్థులకు పాఠాలు చెప్పే ఇద్దరు పంతులమ్మలు బట్టలు విప్పేసి అనాటమీ సబ్జెక్టను టీచ్ చేశారు. అదేమంటే డ్రై సబ్జెక్ట్‌లో విద్యార్థినీ విద్యార్థులకు ఇంటరెస్ట్ పుట్టించటానికి అలా చేయాల్సి వచ్చిందని లాజిక్ చెప్పుకొచ్చారు. (తక్బీర్: 19-12-1996). ఇటలీలో ప్రఖ్యాత నియంత అయిన ముస్సోలినీ మనుమరాలు శాసనసభలో సభ్యత్వం కొరకు నగ్నంగా పబ్లిక్ మీటింగ్‌లో ప్రసంగించి ఓట్లడిగింది. (అద్దావా మ్యాగజైన్: 1995 డిశంబర్)

ప్రపంచంలో మహిళాభ్యుదయానికి అతిపెద్ద ధ్వజం చేపట్టిన అమెరికా విషయానికి వస్తే, ఆ దేశంలో ఇండియానా రాష్ట్రంలో టెక్సెడ్ సిటీ పేరుతో ఒక పట్టణం నిర్మించబడింది. అక్కడి పౌరుల ఒంటిపై నూలుపోగే ఉండదంటారు. దేశదేశాలకు చెందిన నారీమణులు ఆ పట్టణానికి విచ్చేసి, పుట్టినప్పటి స్థితిని తలపిస్తూ బట్టలు విప్పేసి అందాల పోటీలకు ఫోజులిస్తారు.

1996లో సాక్షాత్తూ ఫ్రాన్స్ అధ్యక్షుడైన షేరాక్ కూతురు (క్లాడ్) అవివాహితగానే శిశువును కన్నది. ఆ శిశువు తండ్రి ఎవరో చెప్పటానికి అధ్యక్షుడు నిరాకరించాడు. ఆ సమయంలో అతని నొసటిపై లేశమైనా సిగ్గూ ఎగ్గూ వ్యక్తం కాలేదు. (తక్బీర్: 6-12-1997). అమెరికా మాజీ అధ్యక్షుడైన రోనాల్డ్ రీగన్ భార్య నాన్సీ రీగన్ సగర్వంగా చెప్పుకున్న విషయం కూడా గమనించదగినదే. ఆమె ఇలా అన్నది: 'నేను రీగన్‌ను వివాహమాడే సమయానికి గర్భవతిగా ఉన్నాను. వివాహమైన ఏడు నెలలకే మాకు అమ్మాయి పుట్టింది.' (ముసావాత్: 25-10-1989). 1997లో జరిగిన బ్రిటిష్ పార్లమెంట్ ఎన్నికలలో పోటీచేసిన ఒక అమ్మడు గత 18 ఏండ్లుగా ఒక బాయ్‌ఫ్రెండ్‌తో గడిపింది. ఆ బాయ్‌ఫ్రెండ్‌తో సహజీవనం వల్ల ఆమెకు ముగ్గురు పిల్లలు పుట్టారు. అంతకుముందు ఆమె ఒక స్కూల్ ఇన్స్‌పెక్టర్‌గా, మెజిస్ట్రేట్‌గా కూడా ఉద్యోగాలు వెలగబెట్టింది. (తక్బీర్: 29-3-1997). బ్రిటన్ యువరాణి డయానా టెలివిజన్ ఇంటర్వ్యూలో పర పురుషులతో తన లైంగిక సంబంధాలను గురించి నిస్సంకోచంగా చెప్పుకుంది, ఆ సమయంలో ఆమె భర్త కూడా అక్కడే ఉన్నాడు. అదీ విచిత్రం, విశేషం! (తక్బీర్: 16-1-1997). అమెరికా అధ్యక్షుడు బిల్ క్లింటన్ వైట్‌హౌస్‌లో మోనికా లెవిస్కీతో

సాగించిన రాసలీలల గురించి ప్రపంచ పత్రికలన్నీ కథలు కథలుగా ప్రచురించాయి. క్రైస్తవ మత ప్రచారకుడు, అమెరికాకు చెందిన అతి పెద్ద బిషప్ జిమ్మీ స్వాగర్ట్ తన భార్య సమక్షంలోనే తన లైంగిక అపరాధాలను ఒప్పుకున్నాడు. (తక్బీర్: 17-3-1988). ఈ రకంగా పాశ్చాత్య సమాజం నైతికంగా ఎంతగా దివాలా తీసిందంటే ప్రముఖులు, సంస్కర్తలనబడే వారు కూడా నిష్కళంకమైన చరిత్ర కలిగిలేరు.

అభివృద్ధి చెందిన దేశాలలో వ్యభిచారం, నీతిబాహ్యతకు సంబంధించిన స్వరూపాన్ని చూడదలచినవారు న్యూస్‌వీక్‌లో వచ్చిన ఈ గణాంక వివరాలను అధ్యయనం చేయాలి. అందులో అమెరికాతో సహా 18 దేశాలలో పెళ్ళి కాకుండానే తల్లులవుతున్నవారి సంఖ్య సూచించబడింది:

1. స్వీడన్ - 50 శాతం
2. డెన్మార్క్ - 47 శాతం
3. నార్వే - 46 శాతం
4. ఫ్రాన్స్ - 35 శాతం
5. బ్రిటన్ - 32 శాతం
6. ఫిన్‌లాండ్- 31 శాతం
7. అమెరికా- 30 శాతం
8. ఆస్ట్రియా- 27 శాతం
9. ఐర్లాండ్ - 20 శాతం
10. పోర్చుగల్- 17 శాతం
11. జర్మనీ - 15 శాతం
12. నెదర్లాండ్- 13 శాతం
13. లాసిమ్‌బర్గ్ - 13 శాతం
14. బెల్జియం- 13 శాతం
15. స్పెయిన్ - 11 శాతం
16. ఇటలీ - 7 శాతం
17. స్విట్జర్‌లాండ్ - 6 శాతం
18. గ్రీస్ - 3 శాతం

వ్యభిచారం, విశృంఖలత్వం, నీతిబాహ్యతతో కూడుకున్న ఈ పైశాచిక సునామీ ఐరోపాలోని అభివృద్ధి చెందిన దేశాలన్నింటినీ లైంగిక మృగాల వనంగా మార్చివేసింది. అమెరికా వార్తాపత్రిక 'టైమ్స్' కథనం ప్రకారం జర్మనీ, ఫ్రాన్స్, చెకోస్లోవేకియా, రుమేనియా, హంగరీ, బల్గారియాలోని పెద్దపెద్ద రహదారులపై వేశ్యలు 'క్యూ' కట్టి ఉంటారు. బెర్లిన్-పరాగ్‌లను కలిపే 1200 కిలోమీటర్ల సుదీర్ఘ రహదారి ప్రపంచంలోనే అతిపెద్ద వ్యభిచార అడ్డాగా రూపుదాల్చింది. ఆ రోడ్డుపై వెళ్ళేవారికి స్వల్ప ధరకే శరీరాన్ని అమ్ముకునే అందగత్తెలు దొరుకుతారు. (నవాయె వఖ్త్ : 26-6-1997). ఒక సర్వే ప్రకారం బ్రిటన్‌లోని ప్రఖ్యాత విశ్వ విద్యాలయమైన ఆక్స్‌ఫర్డ్‌లో చదువుకునే 76 శాతం విద్యార్థినీ విద్యార్థులు వివాహానికి ముందే లైంగిక రుచి మరగాలని కోరుకుంటున్నారు. యూనివర్శిటీ కేంపస్‌లో అడుగుపెట్టిన

teluguislam.net



తరువాత తాము కన్యలుగా మిగిలిలేమని 51 శాతం అమ్మాయిలు అంగీకరించారు. 25 శాతం విద్యార్థినులు గర్భ నిరోధక మాత్రలను మింగుతున్నట్లు తెలిపారు. 56 శాతం విద్యార్థులు లైంగిక సుఖం కోసం ఎయిడ్స్ లాంటి రోగాన్ని కూడా లక్ష్యపెట్టబోమని చెప్పారు. 48 శాతం విద్యార్థులు హెూమోసెక్సువాలిటీని భావప్రాప్తికి సంబంధించిన సహజమైన, సురక్షితమైన పద్ధతిగా పేర్కొన్నారు. (సిరాతె ముస్తఖీమ్: ఫిబ్రవరి-మార్చి, 1990). బ్రిటిష్ వార్తాపత్రిక 'ఎక్స్‌ప్రెస్' ప్రకారం ప్రతి ఏటా ఒక లక్షమంది విద్యార్థినులు గర్భవతులవుతారు. (ఉర్దూ న్యూస్, జెద్దా-16-10-1997). బ్రిటిష్ చట్టం ప్రకారం నాలుగేళ్లు నిండిన ప్రతి శిశువును స్కూలుకు పంపటం అనివార్యం. అక్కడ పాఠశాలలో చదివే బాలబాలికలకు పసితనం నుంచే ఒండొకరి ఎదుట నగ్నంగా స్నానం చేసే శిక్షణ యివ్వబడుతుంది. పై తరగతుల విద్యార్థినీ విద్యార్థులు కలిసి స్విమ్మింగ్‌పూల్‌లో స్నానం చేయాలి. దీంతో రాత్రి పొద్దుపోయే దాకా వాళ్లు బయట స్వేచ్ఛగా సంచరించేందుకు అనుమతి ఇవ్వబడుతుంది. ఒకవేళ తల్లిదండ్రులు మందలించినా, కొట్టినా వెంటనే పోలీస్ స్టేషన్‌కు ఫోన్ చేసి కంప్లయింట్ చేసే హక్కు పిల్లలకుంది.[1]

అమెరికా పరిస్థితి కూడా దీనికి భిన్నంగా లేదు. అక్కడి ఒక స్కూల్లో ఇద్దరు అబ్బాయిలు కలిసి 15 ఏండ్ల అమ్మాయిని రేప్ చేశారు. ఈ కేసు కోర్టు కొచ్చింది. న్యాయమూర్తి తన తీర్పును ఇలా వినిపించారు: "టీనేజీ అబ్బాయిలు చేసిన ఈ చిలిపి చేష్ట బలాత్కారం క్రిందికిగానీ, వ్యభిచారం క్రిందికిగానీ రాదు." (నవాయె వఖ్త్: 30-12-1991) . అమెరికాలోని ఒక మాసపత్రిక చేసిన సర్వే ప్రకారం 1980-1985 మధ్యకాలంలో పెళ్లి చేసుకున్న స్త్రీలలో కేవలం 14 శాతం స్త్రీలే తమ కన్యాత్వాన్ని కాపాడుకుని ఉన్నారు. మిగిలిన 86శాతం మంది వివాహానికి ముందే తమ శీలం కోల్పోయారు. 80 శాతం కంటే ఎక్కువ మంది యువతీ యువకులు 19 ఏండ్లకు ముందే లైంగిక సంబంధం ఏర్పరచుకున్నారు. (Al-Jumna Monthly Madison (U.S.A.) 20 Oct. 1997) . వేరొక సర్వే ప్రకారం అమెరికాలో గర్భస్రావం చేసుకునే మహిళల శాతం 33. (Just the Feet Dayton Right to Life of U.S.A.) వాయిస్ ఆఫ్ అమెరికా రిపోర్టు ప్రకారం అమెరికన్ కాంగ్రెస్ సబ్ కమిటీ ముందు సైనిక విభాగంలో పనిచేసే అనేకమంది మహిళా ఉద్యోగినులు సైనికాధికారుల చేతుల్లో తమ మానమర్యాదలు

1. ఈ రకమైన సమాజంలో ముస్లిమేతర పిల్లలపై పడిన ప్రభావం సంగతి అలావుంచితే, స్వయంగా ముస్లిం పిల్లలు కూడా సురక్షితంగా లేరు. పాశ్చాత్య దేశాలలో నివసిస్తున్న ముస్లింల పిల్లలపై దీని ప్రభావం ఎలా ఉందో తెలుసుకోగోరేవారు మచ్చుకు ఈ వార్తా విశేషాన్ని చూడాలి: లండన్‌లోని దినపత్రిక 'జంగ్' (25-10-1992)లో ఒక విజ్ఞప్తి వచ్చింది. అందులో ఇలా ఉంది:"గ్రేట్ బ్రిటన్‌లో నివసించే ముస్లింలకు చేయు విజ్ఞప్తి ఏమనగా, సెకండరీ స్కూల్‌లో చదివే అమ్మాయిలు సాధారణంగా తమపై జరిగే లైంగిక ప్రోద్బలానికి సులభంగా లొంగిపోతూ ఉంటారు. సమయానికి ముందే తల్లులైపోతుంటారు. దీనికి కారణం తమ బాయ్‌ఫ్రెండ్‌లు పిలిచినప్పుడు 'నో' అని చెప్పటానికి వారు సంకోచించటమే. కాబట్టి మేము వారి తల్లిదండ్రులకు ఈ సందర్భంగా సూచించ దలిచిందేమంటే, వారు తమ ఆడపిల్లలకు 'నో'అని చెప్పటం నేర్పాలి."

(సిరాతె ముస్తఖీమ్:Nov. 1992)

ఎలా మంటగలుస్తున్నదీ వివరించారు. కాని ఆ కమిటీ సైనికాధికారులపై ఎలాంటి చర్యలూ తీసుకోలేదు. "నా 'బాస్' నా శీలాన్ని దోచుకున్నాడ"ని ఒక మహిళ ఫిర్యాదు చేస్తే " ఆ సంగతి మరచిపో" అని ఆమెకు సమాధానమివ్వబడింది (నవాయె వఖ్త్ : 2-7-1992). రుచులు మరిగే పిచ్చి ఆ జాతుల్లో ఎంతగా ముదిరిపోయిందంటే మానవత్వం కాదు కదా, మమతానురాగాలను కూడా మంట గలిపేస్తున్నారు. ఒక స్కూలు విద్యార్థిని సంగీత విభావరి జరుగుతుండగా స్కూల్ రెస్ట్‌రూంలోనే శిశువును కని, ఆ శిశువును చెత్తకుండీలో పడవేసి ఆ సంగీత విభావరికి వెళ్ళిపోయింది (ఉర్దూన్యూస్, జెద్దా : 19-8-1997). యదార్థమేమిటంటే అమెరికా తదితర పాశ్చాత్య దేశాల్లో పెల్లుబికిన ఈ లైంగిక విచ్చలవిడితనం, కామవాంఛల లావా చల్లారే బదులు నానాటికీ వ్యాపిస్తూనే పోతోంది. నైతికతకు తిలోదకాలిచ్చిన ఐరోపాలో ఇప్పుడు వ్యభిచారంతోపాటు స్వలింగ సంపర్క జాడ్యం కూడా దావానలంలా ప్రబలింది. బ్రిటిష్ పోలీస్ సెంట్రల్ కంప్యూటర్‌పై 10వేల మంది గే ల పేర్లు ఫీడింగ్ అయి ఉన్నాయి. వాళ్లు చిన్న పిల్లల్ని సయితం వేధిస్తున్నారని ఆరోపణలున్నాయి. నిజానికి పోలీసుల కథనం ప్రకారం ఈ సంఖ్య చాలా తక్కువ. ఎందుకంటే వారు గత నాలుగేండ్ల నుంచే ఈ డాటాను సేవ్ చేస్తున్నారు (తక్బీర్: 29-3-1997). లండన్‌లో క్రైస్తవ మతాచారం ప్రకారం వేలాదిమంది అతిథుల సమక్షంలో టౌన్‌హాల్ ఫాదర్ ఇద్దరు మహిళలను దంపతులుగా పెండ్లి చేసి హోమో సెక్సువాలిటీకి సంబంధించిన లజ్జావిహీన దృష్టాంతం నెలకొల్పాడు. (ఖబ్రే:22-8-1996). అమెరికాలో మహిళా సంఘానికి చెందిన ఒక నాయకురాలు తాను తన భర్తతోనే గాక, వేరొక స్త్రీతో కూడా లైంగిక సంబంధం కలిగి ఉన్నానని నిస్సిగ్గుగా ప్రకటించింది. 'న్యూయార్క్ టైమ్స్' అంచనా ప్రకారం అమెరికాలో మహిళా సంఘాల వారిలో 30 నుంచి 40 శాతం వరకు మహిళలు స్వలింగ సంపర్కం కలిగి ఉన్నవారే. (తక్బీర్:13-4-1995). ఇదీ స్థూలంగా పాశ్చాత్య సామాజిక జీవనశైలి. అటువంటి సిగ్గుమాలిన సామాజిక జీవన విధానాన్ని మన నాట కూడా ప్రవేశపెట్టాలని పరిపాలకులు, అభ్యుదయ వాదులు తల పోస్తున్నారు.

పాశ్చాత్య సమాజంలో 'స్త్రీ పురుషుల సమానత్వ' నినాదం మన మహిళలను అమితంగా ఆకట్టుకున్నట్టుంది. నిజంగానే పాశ్చాత్య మహిళలకు పురుషులతోపాటు సమాన హక్కులు లభిస్తున్నాయా? లేక ఇది వట్టి ప్రాపగాండయేనా? అదెంతవరకు నిజమో మనం చూద్దాం.

teluguislam.net



# స్త్రీ - పురుష సమానత్వం

వాయిస్ ఆఫ్ జర్మనీ కథనం ప్రకారం ప్రపంచమంతటా ఎక్కడా స్త్రీలకు పురుషులతో సమానంగా వేతనాలు లభించటం లేదు. జర్మనీలో సామాజిక సహాయంపై ఆధారపడి జీవించే శ్రామికులలో 90 శాతం మంది వృద్ధ మహిళలే. వారికి వృద్ధాప్యపు ఫించన్ దొరకదు. అక్కడ పనిచేసే స్త్రీలలో నాల్గింట మూడింతల మందికి లభించే జీతాలు వారి జరుగు బాటుకు సరిపోవు. జర్మనీలో ఉన్నత పదవులలో పనిచేసే మహిళా ఉద్యోగుల శాతం చాలా తక్కువ. అక్కడ ప్రతి ఏటా 40 వేల మంది స్త్రీలు పురుషుల అన్యాయాన్ని భరించలేక ఇళ్ల నుంచి పారిపోయి ప్రభుత్వ శరణాలయాల్లో రక్షణ పొందుతున్నారు. (ఖబ్రే:4-9-1995). స్త్రీ -పురుషుల సమానత్వం గురించి బాకా ఊదే అమెరికా ఉన్నత న్యాయస్థానంలో ఇంత వరకు ఒక్క మహిళామణి కూడా న్యాయమూర్తి పదవిలోకి రాలేకపోయింది. అంతెందుకు, అక్కడి ఫెడరల్-1 ఎప్లట్ కోర్టులోని 97 మంది జడ్జీలలో ఒక్కగానొక్క మహిళ మాత్రమే జడ్జిగా ఉంది. అమెరికన్ బార్ అసోసియేషన్‌కు ఇంతవరకు ఒక్క మహిళ కూడా అధ్యక్షు రాలు కాలేకపోయింది. అమెరికాలో ఒక పనికి సగటున ఒక పురుషునికి 5డాలర్లు చొప్పున వేతనం ఇస్తే, అదే పని చేసిన స్త్రీకి 3 డాలర్లు మాత్రమే చెల్లిస్తున్నారు. (మౌలానా వహీదుద్దీన్ ఖాన్ గారిచే విరచితమైన 'ఖాతూనె ఇస్లాం'. పేజీ-73). జపాన్‌లో కోటిన్నర మంది మహిళలు వివిధ విభాగాలలో పనిచేస్తున్నప్పటికీ వారిలో అత్యధిక మంది పురుష ఉద్యోగులకు సహాయకులుగా మాత్రమే పనిచేస్తున్నారు. (ఖాతూనె ఇస్లాం: పేజీ-93).

1978లో అమెరికాలోని హ్యూస్టన్‌లో జరిగిన మహిళా స్వాతంత్ర్యోద్యమ సదస్సులో ఒకే పనికి స్త్రీ- పురుషులకు సమాన వేతనాలివ్వాలని మహిళలు ప్రభుత్వానికి డిమాండ్ చేశారు. (తక్బీర్: 13-4-1995). స్త్రీ పురుషుల సమానత్వ నినాదాలిచ్చే దేశాలవారు తమ తమ దేశాల సైనిక విభాగాలలో కమాండరన్ ఛీఫ్ హెూదాలో స్త్రీలను ఎందుకు నియ మించటం లేదు? కనీసం ఉప దళాధిపతిగానయినా ఎందుకు తీసుకోవటం లేదు? ఆలోచించాలి. ఏ పాశ్చాత్య దేశమైనా యుద్ధ మైదానంలో పోరాడే పురుష జవాను స్థానంలో ఒక స్త్రీని నియమించి సమాన స్థాయి కల్పించటానికి సిద్ధంగా ఉందా? ఇవేవీ చేయలేనప్పుడు నేతి బీరకాయ మాదిరి సమానత్వం గురించి అహోరాత్రులు గొప్పలు చెప్పుకోవలసిన అవసరమేముందీ? స్త్రీ - పురుష సమానత్వం లాగానే ఎంతో ఆకర్షణీయమైన మరో నినాదం 'మహిళా స్వాతంత్ర్యం'. వారి పాశ్చాత్య ప్రపంచంలో మగువకు అన్ని రకాల స్వేచ్ఛా స్వాతంత్ర్యా లున్నాయా? రాబోయే పంక్తుల్లో ఆ నిజానిజాలను కూడా వీక్షిద్దాం.

# స్త్రీ స్వాతంత్ర్యం

పాశ్చాత్య జగతిలో పడతికి లభించిన స్వాతంత్ర్యం ఎట్టిది? పనిచేయకుండా ఇంట్లోనే కూర్చొని జీతం పొందే స్వాతంత్ర్యం ఆమెకివ్వబడిందా? రోడ్డుపై ట్రాఫిక్ నిబంధనలను ఖాతరు చెయ్యకుండానే డ్రైవింగ్ చేసే స్వేచ్ఛ ఆమెకుందా? బ్యాంకులను లూటీ చేసే స్వాతంత్ర్యంగాని ఆమెకు ఇవ్వబడిందా? లేదు కదా! దేశ చట్టాలకు, నియమ నిబంధనలకు పురుషుడు ఎలా కట్టుబడి ఉంటాడో స్త్రీ కూడా అలాగే కట్టుబడక తప్పదు. పనివేళల్లో తనకు నచ్చిన దుస్తుల్ని ధరించే స్వేచ్ఛ కూడా పాశ్చాత్య పడతికి లేదు. నార్వే, స్వీడన్, డెన్మార్క్ లాంటి దేశాలలో ఎయిర్ లైన్స్‌లో పనిచేసే ఎయిర్ హోస్టెస్‌లు తీవ్రమైన చలికి తాళలేక మినీ స్కర్ట్‌కు బదులు శరీరమంతటినీ కవర్ చేసే వేడి దుస్తులు ధరించటానికి అనుమతి కోరారు. కాని ఎయిర్‌లైన్స్ అథారిటీ ఈ దరఖాస్తును త్రోసిపుచ్చింది. (నవాయె వఖ్త్:26-6-1996). మరి పాశ్చాత్య దేశాలలో స్త్రీకి ఇవ్వబడిన స్వేచ్ఛా స్వాతంత్ర్యాలేమిటి అంటే ఆమె పబ్లిగ్గా నడిబజారులో నగ్నంగా నిలబడగలదు. ఆమె తన నగ్న చిత్రాలను పత్రికలలో ప్రచురించదలచుకుంటే నిస్సంకోచంగా ప్రచురించుకోవచ్చు. సినిమాలలో ముప్పాతిక నగ్నంగా కనిపించదలిస్తే కనిపించవచ్చు. తాను కోరిన మగవానితో కులకాలను కుంటే కులకవచ్చు. అబార్షన్ చేయించుకోవాలనుకుంటే చేయించుకోవచ్చు. తనకెంత మంది బాయ్‌ఫ్రెండ్లు కావాలనుకుంటే అంతమందినీ మార్చుకోవచ్చు. హెూమో సెక్సువల్‌గా మారదలచుకుంటే మారవచ్చు. లింగ మార్పిడి చేసుకోదలిస్తే చేసుకోవచ్చు. మహిళా స్వాతంత్ర్యాన్ని ప్రోత్సహించే ఒక పత్రిక "నేషనల్ ఆర్గనైజేషన్ ఫర్ వుమెన్ టైమ్స్" 1988 జనవరి సంచికలో మహిళా స్వాతంత్ర్యంపై తన అభిప్రాయాలను వెలిబుచ్చుతూ ఇలా వ్రాసింది: "స్త్రీలు పరస్పరం లైంగిక సంబంధాలను ఏర్పరచుకోగలిగినప్పుడే స్త్రీకి నిజమైన స్వాతంత్ర్యం లభించిందనాలి" (అంటే వారు పురుషులతో లైంగిక సంబంధం ఏర్పరచుకో కూడదన్న మాట!). ఇంకా స్త్రీలు హెూటళ్ళు, క్లబ్బులు, మార్కెట్లు, కార్యాలయాలలో, సైనిక శిబిరాలలో పురుషులకు ఆహ్లాదాన్ని పంచి పెట్టడానికి 'ఉద్యోగం' చేయదలిస్తే చేయవచ్చు. ఈ విధంగా ఐరోపాలో మగువకు మగవారి కామ తాపాన్ని చల్లార్చే ప్రతి పనికీ స్వాతంత్ర్యముంది. ఇది మినహా అక్కడి మగ మారాజులు వనితలకు ఇచ్చిన స్వేచ్ఛా స్వాతంత్ర్యాలేమిటో మా దృష్టికి రాలేదు. ఒకవేళ ఉంటే దయచేసి తెలియజేయాల్సిందిగా మహిళాభ్యుదయ సంఘాలకు మేము విన్నవించుకుంటున్నాము. మహిళలకు లభించిన ఈ స్వాతంత్ర్యాన్ని 'మహిళా స్వాతంత్ర్యం' అనే బదులు 'పురుష స్వాతంత్ర్యం' అని అంటే బావుంటుందేమో! ఎందుకంటే మోసపూరితమైన ఈ నినాదం చాటున తనను ఎక్స్‌ప్లాయిట్ చేసే మగబుద్ధిని ఆమె పసి గట్టలేకపోతోంది. ఏ ముస్లిం మహిళ అయినా- తాను ధార్మికంగా ఎంత హీన స్థితిలో ఉన్నప్పటికీ- ఇటువంటి దోపిడీ పూరిత స్వాతంత్ర్యాన్ని ఎలా ఊహించగలుగుతుంది?

teluguislam.net



ఐరోపాలోని ఈ లైంగిక విశృంఖలత్వపు సామాజిక వ్యవస్థ అందించిన కానుకలను గురించి కూడా ఓసారి సింహావలోకనం చేసుకుంటే నిజస్వరూపం బయటపడుతుంది. ఆ కానుకలలో ముఖ్యమైనవి: 1)పతనమవుతున్న కుటుంబ వ్యవస్థ, 2) ముదిరిపోయిన మాయ రోగాలు, 3) క్షీణించిన జననాల రేటు, 4) పెచ్చరిల్లిన ఆత్మహత్యలు. కొన్ని వాస్తవాలను పరిశీలిద్దాము.

# పతనమవుతున్న కుటుంబ వ్యవస్థ

ఐరోపాలో వచ్చిన పారిశ్రామిక విప్లవం స్త్రీని ఆర్థికంగా నిలదొక్కుకునేందుకు దోహద పడిన సంగతి నిజమేగాని దానివల్ల కుటుంబ వ్యవస్థపై పడిన దుష్ప్రభావం మాత్రం భరించరానిది. ఆర్థికంగా పురుషునిపై ఆధారపడే పరిస్థితి లేనప్పుడు సహజంగానే ఒక ప్రశ్న ఉత్పన్నమవుతుంది- తాను స్వయంగా సంపాదించగలుగుతున్నప్పుడు భర్తకు ఎందుకు లోబడి ఉండాలి? భర్త సేవలు ఎందుకు చేయాలి? సంసార బాధ్యతలు ఎందుకు మోయాలి? బ్రిటిష్ నేషనల్ వుమెన్స్ కౌన్సిల్‌కు చెందిన ఒక మహిళా సభ్యురాలు ఏమంటుందో చూడండి:

" పెళ్లి చేసుకుని, భర్త సేవలు చేసే బాదరబందీలు ఎందుకు కొని తెచ్చుకోవాలి? అనే భావన నానాటికీ బలపడుతోంది. జీవితం అనేది అనుభవించటానికే ఉందిగాని, బరువులు మీద వేసుకోవటానికి కాదు. అందుకే చాలా మంది స్త్రీలు తమ మనుగడ కోసం మగవాళ్ళ అండదండలు అవసరం లేదన్న నిర్ణయానికి వచ్చారు." (తక్బీర్: 4-9-1997).

అమెరికాలో మహిళా ఉద్యమ ధ్వజవాహకురాలిగా భావించబడే షీలా క్రూయిన్ ఇలా అంటున్నారు:

"స్త్రీకి వివాహమంటే బానిసత్వాన్ని కొని తెచ్చుకోవటమే. అందుకే మహిళా ఉద్యమాలు వైవాహిక వ్యవస్థపై తిరగబడాలి. వివాహ సంప్రదాయాన్ని నిర్మూలించనంతవరకూ స్త్రీ జాతికి సిసలయిన స్వాతంత్ర్యం సిద్ధించదు." ఇంకా మహిళా ఉద్యమ సభ్యులు ఏమంటున్నారంటే, ఆడది గనక మగవాణ్ణి కోరుకుంది అంటే, అతని అవసరాన్ని గుర్తించిందంటే ఆమె తనను అవమానపరచుకున్నట్లే. స్త్రీ ఇంట్లో పిల్లల ఆలనాపాలనా చూడటం వల్ల కూడా ఆమె అందరికీ లోకువ అయిపోయింది. (తక్బీర్ : 13-4-1995). అమెరికాలోనే నివసించే ఒక పాకిస్తానీ అమెరికా సామాజిక వ్యవస్థను సమీక్షిస్తూ ఇలా వ్రాశారు: "నవతరంలో వైవాహిక వ్యవస్థపై నమ్మకం సడలిపోతోంది. పెళ్లి చేసుకోకుండానే అబ్బాయి-అమ్మాయి లేదా స్త్రీ-పురుషుడు సహజీవనం సాగిస్తున్నారు. పిల్లల్ని కంటున్నారు. ప్రతి రెండు మూడేళ్లకోసారి తమ జీవిత భాగస్వామిని కర్చీఫ్ మాదిరిగా మార్చేస్తున్నారు. ముసలి తల్లి దండ్రులు సోషల్ సెక్యూరిటీ (అంటే పెన్షన్)పై బ్రతుకుబండి లాగుతూ చచ్చిపోతున్నారు. దయాదాక్షిణ్యాలు లేని సంతానం కనీసం వారి అంత్యక్రియలకు కూడా రాదు."

(ఉర్దూ డైజెస్ట్: జూన్, 1996).

స్త్రీకి లభించిన ఆర్థిక తోడ్పాటు అక్కడి వైవాహిక వ్యవస్థ పునాదులను కుదిపివేసింది. విడాకుల రేటు విపరీతంగా పెరిగిపోయింది. అమెరికా జనగణన బ్యూరో నివేదిక ప్రకారం అక్కడ ప్రతి రోజూ 7 వేల మంది వివాహ బంధంలో ఇమిడితే వారిలో మూడువేల మూడు వందల మంది విడిపోతున్నారు. (ఉర్దూన్యూస్ (జెద్దా):19-12-1996). అంటే దాదాపు 50శాతం వివాహాలు విఫలమవుతున్నాయి. యదార్థమేమంటే ఐరోపాలో మహిళకు లభించిన స్వాతంత్ర్యంగానీ, ఆర్థిక వెసులుబాటుగానీ అక్కడి కుటుంబ వ్యవస్థను ఛిన్నాభిన్నం చేసేసింది. అక్కడి నవతరంలో చాలామందికి తమ తల్లి ఎవరో తెలిస్తే తండ్రి ఎవరో తెలీదు. తండ్రి ఎవరో తెలిసిన వారికి తల్లి ఎవరో తెలీదు. అన్నాచెల్లెళ్ల అనురాగబంధం అరుదుగా మాత్రమే కానవస్తుంది.

# పెరిగిన వినాశకర రోగాలు

వ్యభిచారం, నీతిబాహ్యత, స్వలింగ సంపర్కం కారణంగా గనేరియా, సిఫ్లిస్, ఎయిడ్స్ లాంటి భయంకరమైన రోగాలు ఐరోపాను, అమెరికాను చుట్టుముట్టాయి. 1997లో డెన్మార్క్‌లో జరిగిన మెడికల్ కాన్ఫరెన్సులో, ప్రపంచంలో ప్రతి సంవత్సరం 16కోట్ల 30లక్షల మంది సుఖరోగాల వాతన పడుతున్నారని నిర్ధారించబడింది. అభివృద్ధి చెందిన దేశాలలో స్త్రీల మరణానికి ప్రధాన కారణం లైంగిక వ్యాధులే. (నవాయె వఖ్త్ : 7-8-1997)

1975లో బ్రిటన్ ఆసుపత్రులలో లైంగిక వ్యాధుల సంఖ్య 4లక్షల 30వేలని తేల్చబడింది. వారిలో ఒక లక్షా 60 వేలమంది స్త్రీలు కాగా, 2 లక్షల 70 వేల మంది పురుషులు. (అల్ అమ్‌రాజుల్ జిన్సీయ, రచన : డా॥ సైఫుద్దీన్ షాహీన్). 1978 వరకూ ఎయిడ్స్ అంటే ఏమిటో ప్రపంచానికి తెలీదు. ఆంగ్లంలో ఎయిడ్స్ (యక్వ్యూర్డ్ ఇమ్యూన్ డిఫిసియాన్సీ సిండ్రోమ్ (AIDS) Acquired Immune Deficiency Syndrom. దీనిభావం శరీరంలోని రోగ నిరోధక శక్తి క్షీణించిపోవటం. లైంగిక విశృంఖలత్వం మూలంగా పెచ్చరిల్లిన ఈ వినాశకర వ్యాధి అభివృద్ధి చెందిన దేశాలలో ప్రబలి, వారిని కంటికి కునుకు లేకుండా చేసింది. అమెరికాలో ప్రస్తుతం ఎయిడ్స్ రోగిష్టుల సంఖ్య ఒక కోటి యాభై లక్షలు. ఆఫ్రికా దేశాలలో ఒక అంచనా ప్రకారం ఈ రోగులు ఏడుకోట్ల యాభై లక్షలమంది. (తక్బీర్ : 10-10-1992).

ప్రపంచ ఆరోగ్య సంస్థ (WHO) నివేదిక ప్రకారం అభివృద్ధి చెందిన దేశాలలో ఎయిడ్స్ రోగ నివారణ కోసం ఏటేటా 150 కోట్ల డాలర్లు (7,500 కోట్ల రూపాయలు) ఖర్చు పెట్టబడుతున్నాయి. (అకాజ్ అరబీ దినపత్రిక, జెద్దా: 8-6-1993). అమెరికా శాస్త్రవేత్త డా॥స్టీకర్ ఎయిడ్స్ వ్యాధిపై ఒక పరిశోధనాత్మక వ్యాసం వ్రాశాడు. ఆ వ్యాసంలో అతనిలా వ్యాఖ్యానించాడు: "ప్రపంచ రాజ్యాలన్నీ ఎయిడ్స్ మహమ్మారి గురించి సీరియస్‌గా ఆలోచించాలి. అన్యథా 21 వ శతాబ్దిలో ఎయిడ్స్ మూలంగా పరిపాలనా దక్షత కలిగి ఉండేవారు అతికొద్ది మంది మాత్రమే మిగిలి ఉంటారు." (తక్బీర్: 10-10-1992).

teluguislam.net



# తగ్గుముఖం పట్టిన జననాల రేటు

ఐరోపాలో పెచ్చరిల్లిన లైంగిక విశృంఖలత్వం అంతర్జాతీయ స్థాయిలో జనాభా నిష్పత్తిపై ఎటువంటి నకారాత్మక ప్రభావం చూపిందో తెలుసుకోగోరే వారికి ఈ వార్త ఒక మచ్చుతునక.

"బ్రిటన్‌లోని ముస్లింల జనసంఖ్య అక్కడి క్రైస్తవుల్లోని మ్యాథ్యూ డెస్ట్ వర్గం కన్నా పెరిగిపోయింది. బ్రిటన్ పత్రిక డైలీ ఎక్స్‌ప్రెస్ ప్రకారం ఈ పెరుగుదలకు ప్రధాన కారణం ముస్లింలలోని కుటుంబ వ్యవస్థ పటిష్టంగా ఉండటమే. కాగా; ఆంగ్లేయులు పెళ్ళి చేసుకోకుండా గర్ల్‌ఫ్రెండ్‌తోనే కాలయాపన చేస్తున్నారు. స్త్రీలు గర్భ నిరోధక మాత్రలు వాడుతున్నారు. ఒకవేళ పెళ్ళి చేసుకున్నా విడాకులు పుచ్చుకుంటున్నారు. ఈ విధంగా వీళ్ల జనసంఖ్య దేశంలోని ముస్లిం జనాభా కన్నా తగ్గిపోయింది." (నవాయె వఖ్త్ : 2-4-1996). 1991లో అమెరికాకు చెందిన ఒక కాలమిస్టు బీన్‌వాయిన్ బర్గ్ తన పుస్తకం 'ప్రప్రథమ ప్రపంచ జాతి"లో ఇలా వ్రాశాడు: "రాబోయే కాలంలో ముస్లింల పలుకుబడి, ప్రభావం పెరగనున్నది. దీనికి గల కారణాలలో ఒకటి ముస్లిం జననాల రేటు విశేషంగా పెరుగుతుండటమే." (తక్బీర్ : 30-5-1996). జననాల రేటు తగ్గుముఖం పట్టడం పట్ల ఐరోపా దేశాలు ఇప్పటికే ఆందోళన చెందుతున్నాయి. రుమేనియా ఒక ఆర్డినెన్స్‌ను జారీ చేస్తూ అయిదుగురు పిల్లల్ని కనేవరకూ ఏ స్త్రీ అబార్షన్ చేసుకోజాలదని శాసించింది. ఏ దంపతులకైనా సంతానం కలగకపోతే వారిపై టాక్స్ విధిస్తామని హెచ్చరించింది. ఎక్కువ మంది పిల్లల్ని కన్న కుటుంబాలకు ప్రభుత్వం తరఫున ప్రత్యేక రాయితీలు ఉంటాయని కూడా ఇప్పుడు పాశ్చాత్య ప్రభుత్వాలు ఎరవేస్తున్నాయి. (జంగ్ : 25-6-1986). ఇస్రాయీల్ ప్రధాని అక్కడి యూద దంపతులకు ప్రత్యేక సూచనలిస్తూ; ఇస్రాయీలీయుల (యూదుల) సంఖ్య ప్రపంచంలో తక్కువగా ఉన్నందున ఎక్కువ మంది పిల్లల్ని కనాలని, లేకుంటే భవిష్యత్తులో ప్రమాదం పొంచి ఉందని హెచ్చరించాడు. (జంగ్: 25-5-1986). 1991లో అమెరికా సైనిక విభాగం ఆధ్వర్యంలో జరిగిన ఒక సదస్సులో సమర్పించబడిన ఒక నివేదికలో రోజురోజుకూ పెరుగుతున్న ముస్లిం జనాభాపై ఆందోళన వెలిబుచ్చబడింది. ప్రపంచంలోని జనసాంద్రత అధికంగా వున్న ప్రాంతాలలో- ముఖ్యంగా ముస్లిం దేశాలలో యుద్ధాల ద్వారానో, రాజకీయ వర్గ పోరాటాల ద్వారానో, కుటుంబ నియంత్రణా పథకాల ద్వారానో జనాభా పెరుగుదలకు ఆనకట్ట వేయాలి అని తీర్మానించటం జరిగింది. (తక్బీర్ : 30-5-1996)

అయ్యో! ఇదీ అప్రాచ్య ఆలోచనా ధోరణి! ఇప్పటికైనా ముస్లింలు కళ్లు తెరచి నిజం గ్రహిస్తే ఎంత బావుండు! ప్రాచ్య దేశాలలో, ముఖ్యంగా ముస్లిం రాజ్యాలలో ఫ్యామిలీ ప్లానింగ్‌ను అమలు పరచటానికి పాశ్చాత్య దేశాల వారు విరివిగా ఇస్తున్న ఆర్థిక సాయం వెనుక దాగివున్న పరమ రహస్యం ముస్లింల బాగోగులు కానేకావు. ముస్లిం రాజ్యాలలో ఎలాగైనా జనాభా రేటును తగ్గించాలి. ప్రపంచంలో ముస్లింల జనసంఖ్య పెరగకుండా ఏ విధంగానయినా సరే కట్టడి చేయాలి- ఇదీ వారి దీర్ఘకాలిక ప్రణాళిక. ప్రాపంచికంగానూ,

ధార్మికంగానూ ముస్లింల బాగోగులు ప్రవక్త (సఅసం) గారి ఈ ప్రవచనంతోనే ముడిపడి ఉన్నాయని ముస్లింలు ఎంత త్వరగా గ్రహిస్తే అంతమంచిది. ఆయన(స)ఇలా అన్నారు: "ఎక్కువ మంది పిల్లల్ని కనే స్త్రీలను మనువాడండి. ప్రళయ దినాన ఇతర ప్రవక్తల సముదాయాల సమక్షంలో మీ అధిక జనసంఖ్యను చూసి నేను గర్వపడతాను."(అహ్మద్, తిబ్రానీ)

# పెరిగిన ఆత్మహత్యలు

విశ్వ రహస్యాలను ఛేదించే యావలో విశ్వప్రభువు పైనే తిరుగుబాటు చేసిన జాతులకు ఆ ప్రభువు జీవితంలో 'సుఖము శాంతి' లేకుండా చేశాడు. విషయ లోలత్వానికి గుర్రై తప్ప తాగి, వ్యభిచారం చేసి, వంశపరంపరను కాలరాసిన పాశ్చాత్యుల పిల్లలు ప్రస్తుతం నేరప్రవృత్తికి అలవడ్డారు. నిరాశతో మానసిక ఒత్తిడికి లోనయ్యారు. ఆత్మహత్యే తమ మోక్షానికి సాధనమని భావించే దయనీయ స్థితికి దిగజారారు.[1]

బిబిసి నివేదిక ప్రకారం ప్రస్తుతం అమెరికాలో 20 లక్షలమంది యువకులు తమ శరీరాలను గాయపరచుకుని శాంతి (ఉపశమనం) పొందుతున్నారు. వారిలో 99 శాతం అమ్మాయిలేనన్నది గమనార్హం. మనస్తత్వవేత్తల ప్రకారం ఈ రకమయిన సంఘటనలకు ప్రధాన కారణం : యువతలో ఆవరించిన నిరాశా నిస్పృహలు, మానసిక ఒత్తిడులే.

(నవాయె వక్త్ : 19-8-1997)

1963లో అభివృద్ధికి మారు పేరైన అమెరికాలో 10 లక్షల మంది ఆత్మహత్యలు చేసుకున్నారు. (నవాయె వక్త్ : 19-8-1997). 1997 మార్చిలో అమెరికాలో Heavens gate గా పిలువబడే ఒక మత వర్గానికి చెందిన 39 మంది స్వర్గానికి వెళ్ళేందుకు ఆత్మహత్యలకు పాల్పడ్డారు. 1978లో గయానా, దక్షిణాఫ్రికాలోని జోన్సెస్ పట్టణంలో 900 మంది మోక్షాన్వేషణలో విషపూరిత మద్యం త్రాగి ప్రాణాలు పోగొట్టుకున్నారు. 1975లో కెనడా, స్విట్జర్లాండ్, ఫ్రాన్స్‌లలో కూడా ఇలాంటి మూకుమ్మడి ఆత్మహత్యల సంఘటనలు జరిగాయి. 1972లో ఐరోపాలోని 'ది సోలార్ టెంపుల్' అనే ప్రసిద్ధ మతవర్గ అనుయాయులలో కూడా ఈ ఆత్మహత్యల పరంపర కొనసాగింది. (ఉర్దూ న్యూస్ : 1997 జూన్)

---

1. అమెరికా పత్రిక లాస్ ఏంజిలిస్ టైమ్స్ కథనం ప్రకారం అమెరికాలో ప్రతి 23 సెకన్లకు ఒక స్త్రీపై దాడి జరుగుతోంది. ప్రతి 4 సెకన్లకు ఒక దొంగతనం కేసు నమోదవుతుంది. ప్రతి 12 సెకన్లకు ఒక దోపిడీ జరుగుతోంది. ప్రతి 20 సెకన్లకు ఒక వాహనం దొంగిలించబడుతుంది. 1995లో అమెరికాలో 23 వేల, 305 హత్యలు జరిగాయి. ఒక లక్షా రెండు వేల తొంభై ఆరుమంది మహిళలు లైంగిక వేధింపులకు గురయ్యారు. ఇంటి నుంచి బయలుదేరిన ప్రతి అమెరికన్ ఏ క్షణంలోనయినా తాను దారి దోపిడీకి గురికావచ్చునని మానసికంగా సిద్ధంగా ఉంటాడు. ప్రతిఘటిస్తే ప్రాణాలకే ముప్పు ఉంటుందని అతనికి తెలుసు. (నవాయె వక్త్ : 3-6-1996). ప్రముఖ న్యూస్ ఏజెన్సీ అసోసియేటెడ్ ప్రెస్ కథనం ప్రకారం అమెరికాలో 1985తో పోల్చితే ఇప్పుడు నేరాలు 131 శాతం పెరిగాయి. (నవాయ్ వక్త్ : 19-9-1997). 1990లో అమెరికాలో 6 లక్షల మంది మహిళలు మానభంగానికి గురయ్యారు. హత్యలు, దారి దోపిడీలు ఇంతకన్నా ఎక్కువే. (నవాయె వక్త్ : 30-12-1991).

teluguislam.net



ఇదండీ పాశ్చాత్య జీవనశైలి! దూరపు కొండలు నునుపు అన్నట్టు మనవాళ్ళు ఆ మేడిపండు సంస్కృతిని పైపైనే - స్థూల దృష్టితో చూసి అమితంగా ప్రభావితులవుతున్నారు. సామాన్యుల సంగతి అలావుంచండి, స్వయంగా మన ఏలినవారు, మేధావి వర్గానికి చెందిన వారు కూడా ఆ మేడిపండు సంస్కృతిని ప్రాచ్య సమాజంలో ప్రవేశపెట్టి మహిళోద్ధరణ చేయాలని కలలు గంటున్నారు.

రండి, ఇప్పుడు మనం ఇస్లామీయ సామాజిక వ్యవస్థను కూడా ఓసారి పరికించి, పరిశీలించి, మహిళా జగతికి, వారి హక్కుల పరిరక్షణకు, మానమర్యాదల రక్షణకు ఏ వ్యవస్థ హామీ ఇస్తుందో, ఏ వ్యవస్థ దోపిడీ మనస్తత్వం కలిగి ఉందో ధర్మ కాటాలో వేసి చూద్దాం.

## ఇస్లాం కోరేదేమిటి?

ఇస్లాం, సృష్టికర్త తరపున పంపబడిన జీవన ధర్మం. మనిషిని సృష్టించిన సృష్టికర్త అతని నైజాన్ని, స్వభావాన్ని చూసి తదనుగుణంగానే ఈ జీవన ధర్మాన్ని నిర్ధారించాడు. ఇందులో హెచ్చుతగ్గులు లేవు. ఇస్లాం రెండు అతివాదాలకు నడుమ సమత్వం, సమతూకంతో కూడుకున్న ధర్మం. మనిషిలో దాగివున్న దానవత్వాన్ని, మానవత్వాన్ని గురించి కూడా అది చర్చిస్తుంది. ఎందుకు? ఎందుకంటే మానవుడు మానవుని లాగానే ఉండాలి - దానవుడుగా, పశువుగా మారకూడదు. ఇస్లామీయ సామాజిక జీవనాన్ని తెలుసుకునే ముందు వివాహానికి (నికాహ్‌కు) సంబంధించిన చర్చను మొదలెడుతున్నాము. ఆ తరువాత వ్యక్తి సంస్కరణ నిమిత్తం ఇస్లామీయ శిక్షణా వ్యవస్థను గురించి చర్చించటం జరిగింది. చివర్లో ఇస్లామీయ సామాజిక జీవనాన్ని పాశ్చాత్య జీవన శైలితో పోలుస్తూ విషయాన్ని విశ్లేషించాము. ఈ చర్చ వల్ల ఇన్‌షా అల్లాహ్ పాఠకులు ఒక అవగాహనకు రాగలరన్న నమ్మకం మాకుంది.

# నికాహ్‌కు సంబంధించిన ముఖ్యమైన చర్చ

## 1. సాంప్రదాయకమైన నికాహ్ ప్రసంగం

తొలి రాత్రి నూతన వధూవరులు పరస్పరం మమేకమయ్యే ముందు వారు చిత్రవిచిత్రమైన అనుభూతులకు, అనిర్వచనీయమైన భావాలకు లోనవుతూ ఉంటారు. ఆ క్షణాల్లో వారి అంతరంగంలో భావాలు , భావనల పెనుతుఫాను వీస్తూ ఉంటుంది. కోర్కెలు కదం తొక్కుతూ, శరీరంలోని అణువణువూ పులకిస్తూ ప్రకంపనలు పుట్టిస్తూ ఉంటుంది. ఆనంద డోలికల్లో తేలిపోయే ఆ మధుర క్షణాలలో వారు మానవత్వపు అవధులు మీరి పోకుండా ఉండాలని ఇస్లాం అభిలషిస్తోంది. అందుకే నికాహ్ సందర్భంగా ఎంతో సమగ్రమైన, అర్థవంతమైన ఒక ప్రసంగాన్ని ఇస్లాం ప్రతిపాదించింది. ఆ ప్రసంగంలో మొదట దైవస్తోత్రం చేయబడింది. జీవన వ్యవహారాలలో, కష్టాలలో అల్లాహ్ తోడ్పాటును కోరే శిక్షణ యివ్వ బడింది. గతంలో వారివల్ల జరిగిన తప్పులపై సిగ్గుతో కుమిలిపోతూ, క్షమాభిక్ష వేడుకునే తీరుతెన్నులు నేర్పబడ్డాయి. రాబోయే జీవిత కాలంలో ఆంతర్యంలో జనించే దుష్ప్రేరణల నుంచి, కర్మల దుష్పరిణామం నుంచి అల్లాహ్ శరణు ఏ విధంగా వేడుకోవాలో కూడా తెలియపరచబడింది. ఆ తరువాత ప్రసంగంలో దివ్యఖుర్ఆన్‌లోని మూడు వచనాలు చేర్చబడ్డాయి. ఆ మూడు దివ్యవచనాలలో కనీసం నాలుగుసార్లు 'తఖ్వా' గురించి గట్టిగా తాకీదు చేయబడింది. (వివరాలకు 91వ అంశాన్ని చూడండి).

షరీయతు పరిభాషలో 'తఖ్వా' అనేది ఎంత లోతైన, మరెంత విస్తారమైన పదమంటే అందులో భావార్థంతో కూడిన ఓ ప్రపంచమే ఇమిడి ఉంది. 'తఖ్వా' గురించి క్లుప్తంగా చెప్పుకోవాలంటే మనిషి ఏకాంతంలోవున్నా- జనసందోహంలో వున్నా, నాలుగు గోడల మధ్య నివసిస్తున్నా-నలుగురితో వ్యవహారం చేస్తున్నా, పగటి వెలుగులోవున్నా- రాత్రి చీకటిలో వున్నా, అనునిత్యం, అనుక్షణం అల్లాహ్‌కు, ఆయన ప్రవక్తకు భయపడుతూ జీవించాలి. దైవాజ్ఞలకు కట్టుబడి జీవించాలి. దైవప్రవక్త (స) విధానానికి అనుగుణంగా బ్రతకాలి. ఇదే 'తఖ్వా'. ఒక చిన్న ప్రసంగంలో ఇన్నిసార్లు తఖ్వా గురించి నొక్కి వక్కాణించటంలోని ప్రధాన ఉద్దేశమేమిటంటే సంతోష సమయంలో కూడా మనిషి మనో మస్తిష్కాలలో దైవభీతి ఉండాలి. అతను ఏ పని చేసినా అది దైవాజ్ఞల, దైవప్రవక్త (స) విధాన పరిధిలోనే ఉండాలి. ఆనంద ఘడియల్లో అవధులు మీరిపోయి షైతాన్ అడుగులకు మడుగులొత్త కూడదు. పైశాచిక ప్రేరణలకు తావీయకూడదు. పైగా వరుడు తాను చేయబోయే కొత్త కాపురంలో కలతలు రాకుండా జాగ్రత్తపడాలి. అలుమగలు ఒండొకరి హక్కులు నెరవేర్చే విషయంలో అల్లాహ్‌కు భయపడుతూ ఉండాలి. హద్దులు మీరకూడదు. ఈ రకంగా 'నికాహ్

teluguislam.net

ప్రసంగం' దాంపత్య జీవితానికి సంబంధించిన ఒక 'నిబంధనావళి' వంటిది. కొత్త కాపురానికి సిద్ధమవు తున్న వధూవరులకు కుటుంబ సభ్యులు, బంధుమిత్రుల సమక్షంలో అల్లాహ్ మరియు ఆయన ప్రవక్త (స) తరపున ఇది ప్రసాదించబడుతుంది. నికాహ్ ప్రసంగం కేవలం వధూవరు లను ఉద్దేశించినది మాత్రమే కాదు, ఆ సమయంలో అక్కడ హాజరైవున్న వారందరికీ అందులో గొప్ప ఉపదేశం వుంది. నికాహ్ సంతోషాన్ని, ఆహ్లాదాన్ని పంచిపెట్టే మహోత్సవమే కాదు, అది ఒక ఆరాధన కూడా. కాని శోచనీయమైన విషయమేమంటే ఈ కాలంలో వధూవరులతో సహా నికాహ్ సారాంశాన్ని అర్థం చేసుకునే సభికులు బహు తక్కువ. వివాహ మహోత్సవం జరిపే పెద్దలు కూడా ఆ ఆనంద ఘడియల్లో మైమరచి, భావోద్వేగానికి లోనై వధూవరులకు నికాహ్ ప్రసంగం ద్వారా అందించాల్సిన గొప్ప సందేశాన్ని, దుఆలను విస్మరిస్తూ ఉంటారు. ఇలాంటి శుభవేళల్లో నికాహ్ చేయించే పెద్దలుగానీ, అక్కడ కూర్చుని ఉన్న విద్వాంసుల్లోగానీ ఎవరయినా ముందుకు వచ్చి అరబీ నికాహ్ ప్రసంగాన్ని కనీసం స్థానిక భాషలో అనువదించాలి. వీలైతే భావాన్ని విడమరచి చెప్పాలి. తద్వారా అక్కడ కూర్చుని ఉన్న ఆలోచనాపరులకు, శుభాత్ములకు మేలు కలుగుతుంది. కొత్త జీవితంలో అడుగుపెడు తున్న ఆలుమగలకు బోధించే ఆ మంచి మాటలు "ముత్యాల మూట"గా ఉపయోగ పడవచ్చు!

## 2. నికాహ్‌లో 'వలీ' (సంరక్షకుని) అనుమతి అవసరం

నికాహ్ (వివాహం లేక శుభ లగ్నం) కొరకు వధువు తండ్రిగానీ లేక ఆమె తరపు పెద్ద మనిషిగానీ సంరక్షకుడు (వలీ)గా ఉండి తన సమ్మతిని తెలియజేస్తాడు. వధూవరుల తరపు బంధుమిత్రులు శుభాశీస్సులు, శుభాకాంక్షలు తెలిపి గౌరవ ప్రదమైన రీతిలో వధువును తీసుకుని వెళతారు. ఇప్పటి వరకూ ముస్లిం సమాజంలోనూ, ప్రాచ్య దేశాల ఇతర మతవర్గాల వారిలోనూ ఇదే పద్ధతి నడుస్తూ వస్తోంది. కాని లజ్జావిహీనమైన పాశ్చాత్య సంస్కృతి మూలంగా మన సంప్రదాయానికి విఘాతం ఏర్పడింది. పాశ్చాత్య సంస్కృతి మోజులోపడిన అబ్బాయిలు-అమ్మాయిలు దొంగచాటుగా ప్రేమ వ్యవహారం నడిపి ఇద్దరూ కలిసి జీవిస్తా మని, కలిసి మరణిస్తామని ఊసులాడుకుంటారు. పెద్దలకు చెప్పాపెట్టకుండా ఇంటి నుండి పారిపోయి నాలుగైదు రోజులు మాయమైపోతారు. ఆ తరువాత నేరుగా కోర్టుకు వచ్చి పెళ్లి చేసుకుంటారు. "వలీ లేకుండా కూడా నికాహ్ అయిపోతుంది" అన్న ఫత్వా ఆసరాగా కోర్టు నికాహ్ ధృవపత్రం జారీ చేస్తుంది. కన్నవారు అవమానభారంతో కృంగిపోతారు. ఈ రకమయిన నికాహ్‌ను 'కోర్టు మ్యారేజ్'గా వ్యవహరిస్తున్నారు. ఈ రకమయిన చేష్ట ఒక ఇస్లామీయ ప్రబోధనల పైనేకాదు, యావత్ ప్రాచ్య సంస్కృతిపైనే తిరుగుబాటుకు ప్రతీక. దీని ఉద్దేశం; వివాహాది శుభకార్యాలలో ఇస్లామీయ సంప్రదాయానికి తిలోదకాలిచ్చి దేశంలో పాశ్చాత్య తరహా సంస్కృతిని ప్రవేశ పెట్టడమే.

నికాహ్ సమయంలో 'వలీ' (సంరక్షకుడు) ఉండటం, అతని సమ్మతి లభించటం గురించి ఖుర్‌ఆన్ హదీసులలో స్పష్టమైన ఆదేశాలున్నాయి. స్త్రీల వివాహ ప్రస్తావన వచ్చినప్పుడల్లా ప్రత్యక్షంగా స్త్రీలను సంబోధించకుండా వారి 'వలీ'లను సంబోధించటం జరిగింది. ఉదాహరణకు: "షిర్క్‌కు ఒడిగట్టే పురుషులు విశ్వసించి మోమిన్లు కానంతవరకూ మీ స్త్రీలను వారి వివాహ బంధంలోకి ఇవ్వకండి." (అల్ బఖర: 221)

దీన్నిబట్టి స్పష్టంగా అవగతమయ్యేదేమిటంటే స్త్రీ తనంతట తానుగా నికాహ్ చేసుకోజాలదు. అందుకే ఆమె సంరక్షకులనుద్దేశించి 'ఆదేశం' ఇవ్వబడింది - ఆమెను ముష్రిక్కు పురుషునికిచ్చి వివాహం చెయ్యకూడదని. వలీ (సంరక్షకుని) అంగీకారం గురించి దైవప్రవక్త (స) వారి కొన్ని ప్రవచనాలను కూడా గమనిద్దాం: ఆయన (స) ఇలా అన్నారు: "వలీ (అనతి) లేకుండా వివాహమే అవదు" (అబూదావూద్, తిర్మిజీ, ఇబ్నుమాజా).

మరొక హదీసులో ఇలా ఉంది:

"ఏ స్త్రీ అయితే వలీ అనుమతి లేకుండానే నికాహ్ చేసుకుందో ఆమె నికాహ్ మిథ్య. ఆమె నికాహ్ మిథ్య. ఆమె నికాహ్ మిథ్య." (అహ్మద్, అబూదావూద్, తిర్మిజీ, ఇబ్నుమాజా). ఇమామ్ ఇబ్ను మాజా (రహ్మలై) పొందుపరచిన ఒక హదీసులోని పదజాలం మరింత తీవ్రంగా వుంది. అల్లాహ్‌ను, ఆయన ప్రవక్త (స)ను విశ్వసించే ఏ విశ్వాసురాలు కూడా 'వలీ' లేకుండా నికాహ్ చేసుకోవటం గురించి ఊహించనైనా లేదు. ఇంతకీ హదీసులో ఏమనబడిందంటే- "తన నికాహ్‌ను స్వయంగా చేసుకునే స్త్రీ వ్యభిచారిణి మాత్రమే."

ఇక్కడ గమనార్హమైన రెండు విషయాలు ఉన్నాయి - ఒకటి; ఒకవేళ ఏ స్త్రీ సంరక్షకుడైనా నిజంగానే దుర్మార్గుడు, స్వార్థపరుడై ఉండి ఆ స్త్రీ ప్రయోజనాలకు వ్యతిరేకంగా వ్యవహరిస్తున్న పక్షంలో షరీయత్ ప్రకారం అటువంటి వ్యక్తి గార్డియన్‌గా అనర్హుడైపోతాడు. అతని స్థానంలో ఆమె సమీప బంధువుల్లోని వేరొక వ్యక్తి 'వలీ'గా ఖరారవుతాడు. ఒకవేళ ఆమె కుటుంబీకుల్లో ఏ ఒక్కరూ ఆమెకు శ్రేయోభిలాషులు కారని తేలినప్పుడు ఆ ఊరి పెద్దగానీ, రాజ్యాధికారిగానీ ఆమె తరపున 'వలీ'గా ఉంటాడు. ఈ నేపథ్యంలో మహనీయ ముహమ్మద్ (స) ఇలా అన్నారు: "వలీ అన్నవాడే లేని స్త్రీకి రాజ్యాధికారి వలీగా ఉంటాడు." (తిర్మిజీ)

రెండు; సంరక్షకుని అనుమతి లేకుండా వివాహమాడరాదని తాకీదు చేసిన ఇస్లాం, స్త్రీ అంగీకారంతో నిమిత్తం లేకుండా ఆమె వివాహం తన ఇష్టానుసారం జరిపించరాదని సంరక్షకునికి కూడా ఆంక్ష విధించింది. కన్య అయిన ఒక స్త్రీ దైవప్రవక్త(స) సన్నిధికి వచ్చి తన తండ్రి తనకు ఇష్టంలేని వ్యక్తితో తన వివాహం జరిపించాడని ఫిర్యాదు చేసింది. అప్పుడు దైవప్రవక్త (స); ఆమె కోరుకుంటే ఆ నికాహ్‌కు కట్టుబడి ఉండవచ్చునీ, లేదంటే రద్దు పరచుకోవచ్చుని.ఆమెకు అధికారం ఇచ్చారు. (అబూదావూద్, నసాయి, ఇబ్నుమాజా).

teluguislam.net



అలాగే ఒక వ్యక్తి వితంతువు అయిన తన కుమార్తె వివాహం తన ఇష్టంతో జరిపించగా, ఆ వివాహాన్ని దైవప్రవక్త (స) రద్దు పరిచారు. (బుఖారి)

దీని భావమేమిటంటే నికాహ్ సందర్భంగా వలీ అనుమతితో పాటు వధువు అంగీకారం అనివార్యం. ఒకవేళ ఏ కారణంగానయినా వారిద్దరి మధ్య అభిప్రాయ భేదం పొడసూపితే జీవితంలోని మెట్టపల్లాల గురించి వలీ ఆమెకు నచ్చజెప్పి ఆమె తన అభిప్రాయాన్ని మార్చుకునేలా యత్నించాలి. ఒకవేళ ఈ ప్రయత్నం ఫలించకపోతే అమ్మాయి ఇష్టపడే మరో సంబంధం చూసి పెళ్ళి జరిపించాలి.

నికాహ్‌లో అటు గార్డియన్, ఇటు వధువు - ఇరువురి అంగీకారాన్ని పరస్పరం అనివార్య అంశంగా ఖరారు చేసి ఇస్లామీయ షరీయత్ ఒక మధ్యేమార్గాన్ని తెరచింది. తద్వారా వారిరువురి భావావేశాలను, ఇష్టాయిష్టాలను పరిగణనలోకి తీసుకుని ఏ ఒక్కరికీ తలవంపు జరగకుండా చూడటం జరిగింది.

ఖుర్‌ఆన్ హదీసులు ఇంత స్పష్టంగా ఆదేశాలిచ్చిన తరువాత కూడా అబ్బాయిలు-అమ్మాయిలు తమ తల్లిదండ్రుల మాటను ఖాతరు చెయ్యకపోవలసిన ఖర్మ ఏం పట్టింది? చెప్పాపెట్టకుండా ఇంట్లోనుంచి పారిపోవటమెందుకు? వివాహానికి ముందే చాటుమాటు సరసాలెందుకు? వివాహం (నికాహ్) పేరుతో కోర్టులో నాటకమెందుకు? సంరక్షకుడు (వలీ) లేకుండా నికాహ్ చేసుకోవటం ధర్మసమ్మతమే అనుకుంటే పాశ్చాత్య తరహా పెళ్లిళ్లకు-ఇస్లామీయ పెళ్లిళ్లకు మధ్య వ్యత్యాసం ఏం మిగిలిందీ? పాశ్చాత్య సమాజంలో స్త్రీకి ఇవ్వబడిన ఈ 'స్వాతంత్ర్యమే' అక్కడి కొంపల్ని కూల్చేస్తున్నది. చిందరవందర అవుతున్న తమ బ్రతుకుల్ని చూసి పాశ్చాత్య వివేచనాపరులు సయితం ఆవేదనకు లోనవుతున్నారు. 1995లో అమెరికా ప్రధమ మహిళ అయిన హిల్లరీ క్లింటన్ పాకిస్తాన్‌లో పర్యటించినప్పుడు ఆమె ఇస్లామాబాద్ లోని కాలేజ్ ఫర్ వుమెన్ విద్యార్థినులతో మాట్లాడుతూ ఉద్వేగపూరితంగా ఇలా అన్నారు: "అమెరికాలో ప్రస్తుతం అతి పెద్ద సమస్య ఏమిటంటే అవివాహిత విద్యార్థినులు గర్భవతులై పోతున్నారు. ఈ సమస్యకు ఏకైక పరిష్కారం ఏమిటంటే యువతీయువకులు తమ మతపరమైన, సామాజికమైన విలువలపై తిరుగుబాటు చేయకూడదు. వారు ముస్లిములైనా సరే, క్రైస్తవులయినాసరే తమ ధార్మిక సామాజిక నియమ నిబంధనలకు కట్టుబడి వివాహాలు చేసుకోవాలి. వారు తమ తల్లిదండ్రుల గౌరవ మర్యాదలను మంటగలప కూడదు. వారి సుఖశాంతులను హరించకూడదు." ('జంగ్' దినపత్రిక: 28-3-1995)

## 3. స్త్రీ పురుష సమానతలు

పాశ్చాత్య జగతిలో స్త్రీ - పురుష సమానతలంటే ఏమిటి? ప్రతిచోటా మగువ మగవాడి ప్రక్కన నిలబడాలి. కార్యాలయమైనా- కర్మాగారమైనా, హొటల్ అయినా-క్లబ్బు అయినా, వినోదాలైనా- విహార యాత్రలైనా, ఇల్లయినా- ప్లే గ్రౌండు అయినా ఎల్లెడలా ఆమె మగవాణ్ణి మెప్పిస్తూ, ఉల్లాసపరుస్తూ ఉండాలి. స్త్రీ - పురుష సమానతల్ని గురించిగానీ, స్త్రీ స్వాతంత్ర్యం

గురించి గానీ ఫిలాసఫీల రూపకల్పన చేయాల్సిన అవసరం అసలు మగవాడికే ఏర్పడింది. ఎందుకంటే అతనికి రెండే రెండు ఉద్దేశాలు లేదా లక్ష్యాలున్నాయి. ఒకటి: పారిశ్రామిక విప్లవ ఫలితంగా నెలకొల్పబడిన పరిశ్రమల, కర్మాగారాల ఉత్పత్తిని పెంచటం. రెండు: లైంగిక రుచిని మరగటం. వేరే మాటల్లో చెప్పాలంటే పాశ్చాత్య ప్రపంచంలో స్త్రీ స్వాతంత్ర్యోద్యమం వెనుక ఉన్న ఉద్దేశ్యాలు రెండే రెండు- (1) కడుపు నింపుకోవటం, (2) కామతాపం చల్లార్చు కోవటం. వాస్తవానికి పాశ్చాత్యుని జీవితమంతా ఈ రెండు వస్తువుల చుట్టూ పరిభ్రమిస్తూ ఉంది.[1] ఈ జీవన సూత్రం మానవ జాతికి ప్రసాదించిన దేమిటో ఇప్పటికే మనం చాలా చెప్పుకున్నాం.

ఇక్కడ మనం "స్త్రీ-పురుషుల సమానత్వం" గురించి ఇస్లామీయ జీవన దృక్పథం ఏమిటో చర్చించుకుందాం. ఇస్లాం స్త్రీ - పురుషుల శారీరక, మానసిక స్వభావ స్వరూపాలను దృష్టియందుంచుకుని వారి కార్యపరిధులను, హక్కులు- బాధ్యతలను నిర్ధారించింది. కొన్ని విషయాలలో ఇరువురికీ సమానస్థాయి కల్పించబడింది. మరి కొన్నింటిలో హెచ్చుతగ్గులున్నాయి. ఏ వ్యవహారాలలోనయితే ఇరువురికీ సమానస్థాయి ఇవ్వబడిందో వాటి వివరాలు ఇవి:

## 1) మాన మర్యాదల పరిరక్షణ

మానమర్యాదల పరిరక్షణ విషయంలో ఇస్లాంలో పురుషులకు ఏ ఆదేశాలున్నాయో అవే ఆదేశాలు స్త్రీలకు కూడా ఉన్నాయి. ఒండొకరిని ఎగతాళి చేయరాదని దివ్యఖుర్ఆన్ పురుషులకు ఆజ్ఞాపించినట్లే స్త్రీలకు కూడా ఆజ్ఞాపించింది. ఒండొకరిని ఎత్తిపొడుచుకోరాదని, ఒకరి నొకరు చెడ్డపేర్లతో పిలుచుకోరాదని, ఒండొకరి గురించి చాడీలు చెప్పుకోరాదని, పరోక్ష నిందకు పాల్పడరాదని స్త్రీ - పురుషులిరువురినీ సంయుక్తంగా ఆదేశించటం జరిగింది. (అల్ హుజ్రాత్ సూరా - 11, 12 ఆయతుల వెలుగులో). "ప్రతి ముస్లిం (స్త్రీ అయినా, పురుషుడైనా) రక్తం, ధనం, మర్యాద ఒండొకరి కొరకు పవిత్రం (నిషిద్ధం) గావించబడింది" అని మహనీయ ముహమ్మద్ (స) వారు వక్కాణించారు (ముస్లిం). మానమర్యాదల విషయానికి వస్తే స్త్రీ వ్యవహారం పురుషునికన్నా మరింత సున్నితమైనది. అందుకే ఇస్లాం మహిళామణి మానమర్యాదల పరిరక్షణకు సంబంధించి వేరుగా మరికొన్ని ఆదేశాలను జారీ చేసింది. పరమ ప్రభువు ఇలా సెలవిచ్చాడు: "శీలవతులు, ఏ పాపం ఎరుగని విశ్వసించిన మహిళలపై అపనింద మోపేవారు ఇహపరాలలో శపించబడ్డారు. వారికోసం

1. పొద్దస్తమానం కడుపు గురించి, కామం గురించి ఆలోచిస్తూ ఉండే మనిషిని దివ్యఖుర్ఆన్ కుక్కతో పోల్చింది. దాని నైజంలో ఈ రెండు వస్తువులే ఉన్నాయి. అది కూర్చున్నా, నిలుచుని వున్నా, తిరుగుతున్నా, తింటున్నా- ఎల్లప్పుడూ తిండి పదార్థాల వాసన చూస్తూ ఉంటుంది. తీరిక దొరికినప్పుడు తన మలమూత్ర స్థానాలను నాకుతూ, వాసన చూస్తూ ఉంటుంది. ఇవి మినహా దానికి ఈ ప్రపంచంతో మరో పనిలేదు. (వివరాలకు దివ్యఖుర్ఆన్‌లోని అల్ ఆరాఫ్ సూరా 176 ఆయత్‌ను చూడండి).

teluguislam.net



చాలా పెద్ద శిక్ష వుంది." (అన్‌నూర్ సూరా - 23). వేరొక ఆయత్‌లో సౌశీల్యవతులైన స్త్రీలపై అభాండం మోపే వారికి ఎనభై కొరడా దెబ్బలు కొట్టమని ఆదేశించబడింది. (సూరె నూర్ 4వ అయత్ ఆధారంగా).

కాగా; స్త్రీ శీలాన్ని దోచుకున్న వారికి నూరు కొరడా దెబ్బలు కొట్టాలి. ఒకవేళ స్త్రీ శీలాన్ని హరించిన పురుషుడు వివాహితుడై ఉంటే నూరు కొరడా దెబ్బలు కొట్టడంతోపాటు అతనిపై రాళ్లు రువ్వి శిక్షించాలి (అబూదావూద్). దైవప్రవక్త (స) కాలంలో ఒక మహిళ రాత్రి చీకటిలో నమాజ్ కోసం మస్జిద్‌కు బయలుదేరింది. దారిలో ఒక వ్యక్తి ఆ మహిళను అటకాయించి మానభంగానికి పాల్పడ్డాడు. స్త్రీ అరుపులకు జనం ప్రోగై ఆ వ్యక్తిని పట్టుకున్నారు. దైవప్రవక్త (స) ఆ వ్యక్తికి శిలాశిక్ష విధించారు. అయితే ఆ స్త్రీని మాత్రం వదలి పెట్టారు (తిర్మిజీ, అబూదావూద్). స్త్రీ మానమర్యాదల విషయంలో గమనించవలసిన మరో ముఖ్య విషయమేమిటంటే ఇస్లామీయ షరీయతు ఈ నేపథ్యంలో ఎలాంటి నష్ట పరిహారాన్ని- వస్తురూపేణ గానీ, నగదు రూపేణ గానీ- తీసుకునేందుకు ఒప్పుకోలేదు. దైవప్రవక్త (స) హయాంలో ఒక కుర్రాడు ఒక దొరగారి ఇంట్లో పాలేరుగా పనిచేసేవాడు. ఆ కుర్రవాడికి- దొరసానికి మధ్య అక్రమ సంబంధం ఏర్పడింది. ఈ విషయం బయటికి పొక్కటంతో కుర్రవాడి తండ్రి ఆ ఇంటి యజమానికి నూరు మేకలతోపాటు, ఒక బానిసరాలిని కూడా నష్టపరిహారంగా యిచ్చి శిక్ష నుంచి బయటపడేందుకు రాజీ ఒప్పందం కుదుర్చుకున్నాడు. కాని ఈ కేసు దైవప్రవక్త(స) నోటీసుకు వచ్చినప్పుడు, "మేకలను, బానిసరాలిని వాపసు తీసుకో" అని చెప్పి వ్యభిచారానికి పాల్పడిన ఆ ఇద్దరికీ శిలాశిక్ష విధించారు దైవప్రవక్త(స) (బుఖారీ, ముస్లిం). స్త్రీ మానమర్యాదలకు సంబంధించిన ఇంతటి కట్టుదిట్టమైన వ్యవస్థ ఇస్లాంకు పూర్వంగానీ, ఇస్లాం తరువాతగానీ వేరొక సామాజిక వ్యవస్థలో ఎక్కడా లేదు. మహిళామణి మానమర్యాదల విషయంలో ఇస్లాం ధర్మం విశిష్టమైన ఆదేశాలను ఇచ్చి ఆమెకు పురుషుని కన్నా ఒకింత ఉన్నతస్థానం కల్పించిందని ఘంటాపథంగా చెప్పవచ్చు.

## 2) ప్రాణ రక్షణ

మానవత్వం రీత్యా ప్రాణం ఎవరిదయినా ప్రాణమే. ఈ విషయంలో స్త్రీ-పురుష వ్యత్యాసం లేదు. వారి ప్రాణం పవిత్రం (నిషేధం) గావించబడింది. "ఉద్దేశ్యపూర్వకంగా ఒక విశ్వాసిని (పురుషుడైనా, స్త్రీ అయినా) చంపేవానికి శిక్ష నరకమే." (అన్‌నిసా : 93)

అంతిమ హజ్ యాత్ర సందర్భంగా మహాప్రవక్త (స) ప్రసంగిస్తూ ఇలా అన్నారు: "అల్లాహ్ మీ అందరి (స్త్రీలు, పురుషుల) రక్తాన్ని, ధనాన్ని ఒండొకరికై హరామ్ (నిషిద్ధం) గావించాడు" (ముస్నద్ అహ్మద్). దైవప్రవక్త (స) హయాంలో ఒక యూదుడు ఒక అమ్మాయిని హత్య చేసినందుకు శిక్షగా ప్రవక్త (స) అతనికి మరణదండన విధించారు. (బుఖారీ: రక్తశుల్క ప్రకరణం). ఉద్దేశ్యపూర్వకంగా చేసిన హత్యానేరంలో ఇస్లాం స్త్రీ -

పురుష రక్తశుల్కం చెల్లించే విషయంలో ఎలాంటి విచక్షణ పాటించలేదన్న సంగతిని యిక్కడ మరువరాదు. ఇస్లామీయ వ్యవస్థలోని 'జిమ్మీల' హక్కులను ప్రస్తావిస్తూ దైవప్రవక్త (స) ఇలా ప్రవచించారు: "ఎవరయితే ఒక 'జిమ్మీ'ని (పురుషుణ్ణిగాని, స్త్రీనిగాని) హత్య చేశాడో అల్లాహ్ అతని కొరకు స్వర్గాన్ని నిషేధించాడు" (నసాయి). అజ్ఞానకాలంలో స్త్రీ ప్రాణానికి ఎలాంటి విలువ ఉండేది కాదు. పైగా ఆమె పుట్టుకను దరిద్ర చిహ్నంగా తలపోసేవారు. అందుచేత దివ్య ఖుర్ఆన్‌లో అల్లాహ్ స్త్రీ ప్రాణ రక్షణ నిమిత్తం చాలా తీవ్రమైన పదజాలంతో హెచ్చరిస్తూ ఈ వచనాలను అవతరింపజేశాడు: "సజీవంగా పాతిపెట్టబడిన బాలికను ఉద్దేశించి 'తను ఏ పాపం చేసిందని హత మార్చబడింది?' అని ప్రశ్నించబడినప్పుడు.." (తక్వీర్-8,9) దేవుని న్యాయస్థానంలో ఒల్లు గగుర్పొడిచే సన్నివేశమది!

## 3) సత్కార్యానికి ప్రతిఫలం

సత్కార్యాలకు లభించే పుణ్యఫలంలో స్త్రీ-పురుషుల మధ్య ఎలాంటి వివక్షా లేదు. వారిద్దరూ సమానులే. అల్లాహ్ ఇలా సెలవిచ్చాడు: "మరెవరయినా పుణ్యకార్యం చేస్తే - అతడు పురుషుడైనా, స్త్రీ అయినా- అతడు గనక విశ్వాసి అయివుంటే అలాంటి వారంతా స్వర్గంలో ప్రవేశిస్తారు. వారక్కడ లెక్కలేనంత ఉపాధిని పొందుతారు." (సూరె ఘాఫిర్ - 40). వేరొక వచనంలో ఇలా సెలవీయబడింది: "నిశ్చయంగా దానధర్మాలు చేసే పురుషులు, దానధర్మాలు చేసే స్త్రీలు, అల్లాహ్‌కు (చిత్తశుద్ధితో) మంచి రుణం ఇచ్చేవారు- వారు ఇచ్చినది వారి కొరకు పెంచబడుతుంది. మరి వారి కొరకు గౌరవప్రదమైన స్థానం ఉంది." (అల్ హదీద్ : 18). ఆలి ఇమ్రాన్ సూరాలో విశ్వప్రభువు ఇలా అభయమిచ్చాడు: "మీలో పనిచేసేవారిని - వారు పురుషులైనా సరే, స్త్రీలయినాసరే- నేను వృధా చేయను. మీరు పరస్పరం ఒకే కోవకు చెందినవారు." (3:195). ఇస్లాంలో ఏ పుణ్యఫలం కూడా కేవలం పురుషులైన కారణంగా ఎక్కువ ప్రసాదించి, స్త్రీలైనందువల్ల తగ్గించటం జరిగిందని చెప్పే ఏ ఒక్క పుణ్యకార్యమూ లేదు. పైగా ఇస్లాంలో ప్రాధాన్యతకు, శ్రేష్ఠతకు కొలబద్దగా 'తఖ్వా' (ధర్మనిష్ఠ, భక్తి)ని చేయటం జరిగింది. ఒకవేళ పురుషుని కన్నా స్త్రీ ఎక్కువ ధర్మనిష్ఠ గలదైతే స్త్రీయే అల్లాహ్ సన్నిధిలో ఆదరణీయ స్థానం సంపాదించుకుంటుంది. ఇన్న **అక్రమకుమ్ ఇందల్లాహి అత్ఖాకుమ్** (మీలో- స్త్రీ పురుషులలో- అల్లాహ్‌కు ఎక్కువగా భయపడేవాడే అల్లాహ్ సన్నిధిలో ఆదరణీయుడు) (అల్ హుజ్రాత్ : 13)

## 4) జ్ఞానార్జన

విద్యార్జన విషయంలో కూడా ఇస్లాం స్త్రీకి పురుషునితో పాటే సమాన స్థాయిని కల్పించింది. దైవప్రవక్త (స) మదీనాలో తన మహిళా సహచరిణుల శిక్షణ కోసం వారానికొక రోజు ప్రత్యేకంగా కేటాయించారు. ఆ రోజు ఆయన (స) మహిళలకు ధర్మోపదేశాలు చేసేవారు. షరీయతు ఆజ్ఞలను వివరించేవారు. (బుఖారీ- కితాబుల్ ఇల్మ్).

teluguislam.net



ధర్మ జ్ఞానాన్ని ఆర్జించి ముస్లిం సమాజానికి అందజేయటంలో హజ్రత్ అయిషా (రఅ), హజ్రత్ ఉమ్మె సలమా (రఅ) ఆదర్శప్రాయమైన పాత్ర పోషించారు. ధర్మజ్ఞానం ఆర్జించే మహిళలను అమ్మ ఆయిషా (రఅన్హా) గారు ప్రోత్సహించారు, ప్రశంసించారు. ఒక సందర్భంగా ఆమె ఇలా అన్నారు: "అన్సార్ మహిళలు ఎంత మంచివారు! ధర్మ సందేహాలను అడిగి తెలుసుకోవటానికి వారు ఏమాత్రం సంకోచించరు" (ముస్లిం). ఇస్లాం స్త్రీలను పురుషుల మాదిరిగానే విద్యనభ్యసించటానికి అనుమతించటమే గాకుండా విద్యార్జనను వారికోసం తప్పనిసరిగా కూడా ఖరారు చేసినట్లు దివ్యఖుర్ఆన్ సూక్తుల ద్వారా, ప్రవక్త (స)వారి ఉపదేశాల ద్వారా మనకు విదితమవుతోంది. దివ్యఖుర్ఆన్‌లో అల్లాహ్ ఇలా సెలవిచ్చాడు: "ఓ విశ్వాసులారా! మీరు మిమ్మల్ని, మీ కుటుంబీకుల్ని అగ్ని బారినుండి కాపాడుకోండి." (అత్ తహ్రీమ్: 6). నరకాగ్ని నుండి తమ స్వయాన్ని కాపాడు కోవటానికి, తమ ఆలుబిడ్డలను కూడా కాపాడుకోవటానికి తాము స్వయంగా ధర్మజ్ఞానాన్ని ఆర్జించటంతోపాటు భార్యాబిడ్డలకు కూడా విద్యాబుద్ధులు నేర్పాలి. ఇందులో స్త్రీలు కూడా అంతర్భాగమే. "విద్యార్జన ప్రతి ముస్లింపై విధిగా చేయబడింది" అని మహనీయ ముహమ్మద్ (స) వక్కాణించారు (తిబ్రానీ). ఈ హదీసులో 'ముస్లిం' అనే పదంలో ప్రతి ముస్లిం పురుషునితోపాటు ప్రతి ముస్లిం స్త్రీ కూడా చేరివుందని ఇస్లామీయ విద్వాంసులు చెబు తున్నారు. ఈ ఆదేశాల ద్వారా అవగతమయ్యేదేమిటంటే, ఇస్లాం ధర్మంలో విద్యార్జన హక్కు ఒక పురుషునికి ఎంతగా వుందో ఒక స్త్రీకి కూడా అంతేవుంది. ఇక ప్రాపంచిక విద్య అంటారా; షరీయతు సూచించిన పరిమితుల్లో ఉంటూ మహిళలు తమకు ప్రాపంచికంగా ప్రయోజన కరం అనుకున్న చదువులు చదువుకోవటంలో ఎటువంటి ఆక్షేపణా లేదు.

## 5) ఆస్తి హక్కు

పురుషుల ఆస్తిపాస్తులకు రక్షణ కల్పించినట్లే ఇస్లాం స్త్రీల సిరిసంపదలకు కూడా పూర్తి రక్షణ కల్పించింది. ఒకవేళ ఏ స్త్రీ అయినా నిర్ణీత ఆస్తికి యజమాని అయినప్పుడు అందులో జోక్యం చేసుకునే, లేక ఆమె ఇష్టాయిష్టాలతో నిమిత్తం లేకుండా ఖర్చుపెట్టే హక్కు అధికారం వేరితరులకు లేదు. ఉదాహరణకు : పెండ్లి సందర్భంగా వరుడు ఇచ్చే 'మహర్' సొమ్ము స్త్రీ (భార్య) హక్కు. అందులో ఆమె తండ్రికిగానీ, అన్నదమ్ములకు గాని, ఆఖరికి ఆమె భర్తకు కూడా ఎలాంటి ప్రమేయం ఉండదు. పురుషులకు వారసత్వ వాటాలు నిర్ధారించినట్లే ఇస్లాం స్త్రీల వాటాలను కూడా నిర్ధారించింది. స్త్రీల ఆస్తిహక్కుకు రక్షణ కల్పించే విషయంలో ఇస్లాం ఎంత ఖచ్చితంగా ఆదేశించిందంటే; భార్య ఒకవేళ ధనవంతురాలై ఉండి, అదే సమయంలో ఆమె భర్త పేదవాడై ఉన్నప్పటికీ మగవాడైన కారణంగా భార్య పోషణా బాధ్యత భర్తపైనే ఉంటుంది. భార్య తన ఆస్తిలోనుంచి ఒక చిల్లిగవ్వ కూడా అతనికి ఇవ్వకపోయినప్పటికీ షరీయతు పరంగా ఆమెను తప్పు పట్టడానికి

వీల్లేదు. (కాని ఆమె తన భర్త ఆర్థిక యిబ్బందిని దృష్టిలో పెట్టుకుని కానుక రూపేణగానీ, నదఖా రూపేణాగానీ ఆర్థిక సాయం చేస్తే అది ఆమె ఔదార్యానికి నిదర్శనం అనిపించుకుంటుంది. దాని పుణ్యఫలం కూడా ఆమెకు లభిస్తుంది. అది వేరే విషయం). అయితే భార్య తనంతట తానుగా మనస్ఫూర్తిగా భర్త మహర్ సొమ్మును మాఫీ చేయదలచుకుంటే ఆ మేరకు ఆమెకు అనుమతి ఉంది. అన్యథా వివాహ సందర్భంగా అప్పుగా ఖరారు చేయబడిన మహర్ సొమ్మును భర్త భార్యకు ఎట్టి పరిస్థితిలోనూ చెల్లించవలసి ఉంటుంది. ఒక రుణగ్రస్తుడు రుణదాత రుణాన్ని తీర్చటం ఏ విధంగా తప్పనిసరో అదే విధంగా ఇదీ తప్పనిసరే. కొంతమంది ప్రబుద్ధులు వివాహ సమయంలో భారీ మొత్తంలో 'మహర్'ను నిర్ధారించి, ఆనక ఆ సొమ్మును మాఫీ చేయమని భార్యను బ్రతిమాలుతుంటారు, బెదిరిస్తూ ఉంటారు- ఇది అన్యాయం, అధర్మం, పాపం కూడా.

## 6) భర్త ఎంపిక హక్కు

ఏ విధంగానయితే ఇస్లాం ఒక పురుషుడికి తనకు నచ్చిన స్త్రీని భార్యగా చేసుకునే హక్కు నిచ్చిందో అదేవిధంగా స్త్రీకి కూడా తనకు నచ్చిన పురుషుణ్ణి భర్తగా స్వీకరించే హక్కు ప్రదానం చేసింది. అయితే చిన్న వయస్సు, అనుభవలేమి వల్ల ఆమె నిర్ణయం గైకొనటంలో పొరబడవచ్చన్న ఉద్దేశంతో ఆమె సంరక్షకుని అంగీకారం కూడా అవసరమని చెప్పబడింది. దీని గురించి వివరాలు వెనుకటి పుటల్లో వచ్చాయి.

## 7) ఖులా హక్కు

తనకు నచ్చని భార్యనుండి వేరుపడటానికి ఇస్లాం భర్తకు 'తలాఖ్' హక్కును ఇచ్చినట్లే, తనకు నచ్చని భర్తనుండి వేరవటానికి భార్యకు 'ఖులా' హక్కును ఇచ్చింది. దీనిని ఆమె తన భర్తతో సంప్రదింపులు జరిపిగానీ, పెద్దలను సంప్రతించిగానీ పొందగలదు. లేదంటే న్యాయస్థానాన్ని ఆశ్రయించి కూడా 'ఖులా' పొందగలదు.[1] ఒక మహిళామణి దైవప్రవక్త (స) సన్నిధికి వచ్చి తన భర్త గురించి ఫిర్యాదు చేసుకుంది. అప్పుడు దైవప్రవక్త (స), "నీ భర్త నీకు మహర్ రూపంలో ఇచ్చిన తోటను వాపసు చేయటానికి సిద్ధంగా ఉన్నావా?" అని ఆమెను అడిగారు. దానికామె 'అవున'ంది. ఆయన (స) ఆమె భర్తను పిలిపించి "ఆమె నుండి నీ మహర్‌ను వాపసు తీసుకుని, ఆమె దరఖాస్తును ఆమోదించు" అని ఆదేశించారు. (బుఖారీ)

పైన పేర్కొనబడిన ఏడు విషయాలలో ఇస్లాం స్త్రీలకు పురుషులతో సమానంగా హక్కుల్ని ప్రసాదించింది. మరే విషయాలలో స్త్రీ-పురుషులకు మధ్య హెచ్చుతగ్గులు పాటించిందో వాటిని కూడా అవలోకన చేద్దాం.

---

1. 'ఖులా'కు సంబంధించిన నియమ నిబంధనలు వివరంగా రాబోతున్నాయి.

teluguislam.net



# 1) కుటుంబ నిర్వహణ

ఇస్లాం స్త్రీ పురుషుల శారీరక స్వరూప స్వభావాలను, సహజ శక్తులను దృష్టిలో పెట్టుకుని ఇద్దరి కార్యపరిధులను నిర్ధారిస్తుంది. స్త్రీ పురుషులిద్దరూ తమ శారీరక స్వభావం రీత్యా, లక్షణాల దృష్ట్యా వేర్వేరు లక్ష్యాల కోసం సృష్టించబడ్డారన్నది ఇస్లాం దృక్పథం. శారీరక స్వభావం దృష్ట్యా చూస్తే యుక్తవయస్సుకు చేరుకున్న మగవారిలో పెద్దగా మార్పులుండవు. కాకపోతే గడ్డం మీసాలు మొలుస్తాయి. కామవాంఛలు పెంపొందుతాయి.

కాని ఆడవారి విషయం చాలా వరకు భిన్నంగా ఉంటుంది. రజస్వల అయినప్పటి నుంచీ ఆడవారిలో చాలా మార్పులు వస్తాయి. కామవాంఛ జనించటంతోపాటు వారికి ప్రతినెలా బహిష్టు అవుతుంది. దానివల్ల వారిలో శారీరకంగా మార్పువస్తుంది. నాడీమండలం, జీర్ణశక్తి, విసర్జితాలు, రక్తప్రసారం, మానసిక పరివర్తన- ఇలా రకరకాలుగా స్త్రీలో మార్పు ఉంటుంది. ముఖ్యంగా బహిష్టు సందర్భంగా ఆమె చికాకు చెందుతుంది. శారీరకంగా నీరసంగా ఉంటుంది. ప్రతి నెలా కొన్ని రోజులపాటు ప్రకృతి ఆమెను ఈ 'అవస్థ'కు గురి చేయటంలోని ఉద్దేశం ఏమిటో ప్రాజ్ఞులైన స్త్రీ పురుషులందరికీ తెలుసు. మానవ మనుగడకు- ఈ అశుద్ధావస్థకు మధ్య అవినాభావ సంబంధముంది. ఈ విధంగా స్త్రీ నెలనెలా వారం పదిరోజుల పాటు ఈ స్థితికి లోనవటం, గర్భవతిగా ఉన్నప్పుడు బాధలపై బాధలను భరిస్తూ కడుపులోని బిడ్డను మోయటం, ప్రసవ వేదనను అనుభవించటం, ప్రసవానంతరం పురిటి రక్తస్రావంతో సహా అనేక కష్టాలను సహించటం, ఆ తరువాత దాదాపు రెండేళ్లపాటు తన శరీరంలోని రక్తాన్ని కలబోసి మరీ చంటి పిల్లాడికి పాలు త్రాపటం, ఒక సుదీర్ఘ కాలంపాటు రాత్రి నిద్రను కూడా త్యాగం చేసి బిడ్డను సాకటం- ఇన్ని బరువు బాధ్యతలు మోస్తున్న స్త్రీపై బయటికెళ్ళి సంపాదించే బాధ్యత కూడా మోపటం సహేతుకమేనా? ఇంటి పనులతోనే తీరికలేని పడతిని బజారుకీడ్చి పరాయి మగవాడితో చెట్టాపట్టాలేసుకుంటూ, అందరికీ అహ్లాదాన్ని పంచిపెడుతూ పని చేయమని అనటం న్యాయమేనా?[1] శారీరక స్వభావ స్వరూపాల దృష్ట్యా ఇస్లాం పురుషునికి పరిపాలనా బాధ్యతల్ని, సారధ్య బాధ్యతల్ని అప్పగించింది. సంపాదనా బాధ్యత, పోషణాబాధ్యత, ప్రతిఘటనా బాధ్యత, ప్రమాదాలను ఎదుర్కొనే బాధ్యతను కూడా పురుషునిపైనే వేసింది. కాగా; అల్లాహ్ స్త్రీకి త్యాగం, మమత, జాలి, ఓర్పు, మృదుత్వం, సౌందర్యం, లావణ్యం, లాలిత్యం, మనోరంజన వంటి గుణాలను విరివిగా ప్రసాదించాడు.

1. మానవ మనుగడలో భాగంగా ఆమె అందజేస్తున్న ఈ అద్భుతమైన కాంట్రిబ్యూషన్ దృష్ట్యా ఇస్లాం స్త్రీని జిహాద్ బాధ్యత నుండి తప్పించింది. ఆమె కేవలం హజ్జ్ చేసుకున్నా అది ఆమె పాలిట జిహాద్‌కు సమానమవుతుందని చెప్పింది.

స్త్రీ పురుషులలో స్వాభావికంగా ఉన్న వ్యత్యాసాల కారణంగానే వారి కార్యపరిధులు కూడా వేర్వేరుగా ఉంచబడ్డాయి. ఇంటిలోని పూలవనమై వెల్లి విరిసే వసంత రుతువు స్త్రీ. మానవ జాతి మనుగడకు ఉద్దేశించిన కీలక స్థానం ఆమెది. మాతృ ఒడిలో ఉన్న పసివారికి మమతానురాగాలు పంచిపెట్టడం, సుశిక్షణ ఇవ్వటం, గృహశాఖను పరిరక్షించటం, ఇంటి పరువును కాపాడటం లాంటి ఇంటీరియల్ మినిస్ట్రీకి ఆమె అధిపతి. కాగా; తన ఆలుబిడ్డల పోషణ కోసం కష్టపడి సంపాదించటం, తన కుటుంబీకులను అన్ని రకాల విపత్తుల నుండి కాపాడటం, వారికి సర్వ విధాలా రక్షణ కల్పించటం, దేశ వ్యవహారాలలో తన వంతు పాత్రను పోషించటం పురుషుని బాధ్యత.

స్త్రీ - పురుషుల కార్య పరిధులను నిర్ధారించిన తర్వాత ఇస్లాం వారిరువురి హక్కులను కూడా నిర్దేశించింది. కుటుంబ నిర్వహణకు సంబంధించినంత వరకు పురుషుణ్ణి 'అధికారి'గా ఖరారు చేసింది. దివ్యఖుర్ఆన్‌లో అల్లాహ్ ఈ విధంగా సెలవిచ్చాడు: "పురుషులు స్త్రీలపై అధికారులు. ఎందుకంటే అల్లాహ్ ఒకరికి ఇంకొకరిపై విశిష్ఠతను వొసగాడు. అదీగాక పురుషులు తమ సంపదను (వారిపై) ఖర్చుపెట్టారు." (4:34). దీని భావమేమిటంటే అల్లాహ్ మగవాడిని అతని స్వాభావిక లక్షణాల దృష్ట్యా ఇంటి పెద్దగా, పర్యవేక్షకునిగా చేశాడు. అదే సమయంలో స్త్రీని ఆమె సహజ గుణగణాల మూలంగా పురుషుని రక్షణలో వుండి గృహ శాఖను చూసుకునే బాధ్యతలు ఇచ్చాడు.

మగవాడిని కుటుంబ రక్షకునిగా నియమించిన మీదట, ఆలుబిడ్డల పోషణా భారాన్ని పురుషునిపై మోపటం జరిగింది. వారి సమంజసమైన అవసరాలన్నీ తీరుస్తూ, వారిపట్ల ఉత్తమంగా వ్యవహరించాలని కూడా అతనికి తాకీదు చేయబడింది. అదే సమయంలో తన ఇల్లూ వాకిలిని కంటికి రెప్పలా కాపాడుకోవాలని, పతి ఆదరణలో ఏ లోటూ రానివ్వ కూడదని, అతని సంపాదనను కనిపెట్టుకుని ఉంటూ, ఇంటి పరువును కాపాడుతూ ఉండాలని సతికి తాకీదు చేయడం జరిగింది.

## 2) పొరపాటున జరిగిన హత్యకు సగం రక్తశుల్కం

దైనందిన జీవితంలో ఇస్లాం పురుషుని బరువు బాధ్యతలను స్త్రీ బాధ్యతల కన్నా ఎక్కువ ముఖ్యమైనవిగా భావిస్తుంది. కుటుంబ ఆర్థిక బరువు బాధ్యతలను మోయటం, ఆలుబిడ్డలను అన్ని రకాల కీడు నుండి కాపాడటం, సమాజంలో మంచిని పెంపొందిస్తూ చెడులను అరికట్టే విద్యుక్త ధర్మాన్ని నిర్వర్తించటం, ఈ లక్ష్యం కోసం సర్వదా పరీక్షలను ఎదుర్కోవటం, బాధలు భరించటం, అవసరమైతే ప్రాణాలను పణంగా పెట్టి శత్రువుల నుండి దేశాన్ని రక్షించటం- వీటన్నింటినీ షరీయత్ పురుషులపైనే మోపింది. బరువు బాధ్యత

teluguislam.net



ల్లోని ఈ వ్యత్యాసం దృష్ట్యా ఇస్లామీయ షరీయతు స్త్రీ- పురుషుల విలువ (Value)లో కూడా వ్యత్యాసముంచింది. అందుకే పొరపాటున జరిగిన హత్యకు గాను స్త్రీ రక్తశుల్కాన్ని (దియత్) పురుషుని రక్తశుల్కంలో సగభాగంగా నిర్ధారించింది. అయితే ఉద్దేశ్యపూర్వకంగా చేసిన హత్యలో మాత్రం వీరిరువురి రక్తశుల్కం సమానమేనన్నది మరువరాదు. రక్తశుల్కంలో ఉన్న ఈ వ్యత్యాసం మూలంగా వారిరువురినీ ఒకే మానవ ప్రాణంగా చూడలేదని దీని భావం ఎంతమాత్రం కాదు. రక్తశుల్కంలోని ఈ తేడాను మేము ఒక ఉపమానం ద్వారా విశదీకరించదలిచాము. యుద్ధానంతరం ఇరుదేశాల వారు యుద్ధ ఖైదీల మార్పిడీకి సిద్ధమైనప్పుడు ఒక సిపాయికి బదులుగా సిపాయి మాత్రమే ఇచ్చి పుచ్చుకోవటం జరుగుతుంది. అంతేగాని సిపాయికి బదులుగా కల్నల్‌నో, జనరల్‌నో ఇవ్వటం జరుగదు. ఒక్కోసారి ఒక సైనికాధికారికి బదులుగా వందలాది మంది సాధారణ యుద్ధ ఖైదీలను ఇచ్చి మార్పిడీ చేసుకోవటం జరుగుతుంది. సరిగ్గా ఇలాగే ఇస్లామీయ షరీయతు కూడా స్త్రీ - పురుషుల కార్యపరిధి దృష్ట్యా రక్తశుల్కంలో వ్యత్యాసం పాటించింది. ఇక్కడ ఈ రకమైన వ్యత్యాసం న్యాయసమ్మతమే.

## 3) వారసత్వం

ఇస్లామీయ షరీయతు స్త్రీకి ఎట్టి పరిస్థితిలోనూ ధనపరమైన రక్షణను ఇచ్చింది. ఒకవేళ ఆమె భార్యగా ఉంటే ఆమె ఖర్చులన్నీ భర్త భరించాలి. ఆమె తల్లిగా ఉంటే పోషణా బాధ్యత కొడుకుపై ఉంటుంది. చెల్లిగా ఉంటే అన్నపై పోషణా బాధ్యత ఉంటుంది. కూతురిగా ఉంటే తండ్రిపై ఆమె పోషణా బాధ్యత ఉంటుంది. భార్యగా ఉన్నప్పుడు ఆమె తన మహర్ సొమ్ముకు హక్కుదారు అవటంతోపాటు తన ఇతరత్రా ఆస్తిపాస్తులకు కూడా యజమానురాలై ఉంటుంది. తన వద్ద ఎన్ని ధనరాసులున్నప్పటికీ సంసారం కోసం ఖర్చు పెట్టవలసిన బాధ్యత ఆమెపై లేదు. ఆమె పేరున ఉన్న ఆస్తిని బలవంతంగా తీసుకునే హక్కు భర్తకు లేదు. ఒకవేళ ఆమె తన ఇష్టపూర్వకంగా ఏదన్నా ఇస్తే అది వేరే విషయం. ఒక వైపు స్త్రీకి ఉన్న ఈ హక్కుల్ని - మరో వైపు పురుషునిపై ఉన్న బాధ్యతల్ని దృష్టిలో పెట్టుకుని ఇస్లాం వారసత్వ ఆస్తిలో పురుషునికి లభించే దానిలో సగభాగాన్ని స్త్రీకి ఇచ్చింది. ఉదాహరణకు అల్లాహ్ ఇలా సెలవిచ్చాడు:"పురుషుని వాటా ఇద్దరు స్త్రీల వాటాకు సమానం." (అన్ నిసా: 11)

## 4) జ్ఞాపకశక్తి, నమాజులలో తగ్గింపు

ఒకసారి దైవప్రవక్త (స) మహిళామణులను ఉద్దేశించి ప్రసంగిస్తూ ఇలా అన్నారు: "మహిళల్లారా! దానధర్మాలు చేయండి. క్షమాభిక్ష కోసం ప్రార్థిస్తూ ఉండండి. ఎందుకంటే నరకంలో (పురుషులకన్నా) స్త్రీలు అధికంగా ఉండటం నేను చూశాను. దీనిపై ఒక మహిళ 'ఓ దైవప్రవక్తా (స)! ఎందుచేత?'అని ప్రశ్నించగా, "మీ ఆడవాళ్లు శాపనార్థాలు ఎక్కువగా

పెడుతుంటారు. భర్తల పట్ల కృతఘ్నులై ఉంటారు. మంద బుద్ధిగలవారై, ధార్మికతలో అధములై ఉండి కూడా మగవాళ్ళ మతి పోగొడతారు"అని చెప్పారు. 'ఓ దైవప్రవక్తా(స)! స్త్రీలు మందబుద్ధిగల వారంటే అర్థం ఏమిటి? వారు ధార్మికంగా ఏ విధంగా అధమస్థానం గలవారు?' అని అడిగితే, "ఆమెకు జ్ఞాపకశక్తి తక్కువగా ఉంటుంది. ఈ కారణంగానే ఇద్దరు స్త్రీల సాక్ష్యం ఒక పురుషుని సాక్ష్యానికి సమానంగా తీసుకోబడింది. ధార్మికతలో అధమస్థానం అంటే మీ స్త్రీలు (నెలలో) కొన్ని రోజులు నమాజ్ చేయరు. రమజాన్ (మాసం)లో కొన్ని రోజులు ఉపవాసాలు కూడా ఉండరు కదా!" అని ఆయన (స) విడమరచి చెప్పారు. (సహీహ్ ముస్లిం: జకాత్ ప్రకరణం- దానధర్మాలకై పురికొల్పే అధ్యాయం). హదీసులో పేర్కొనబడిన ఈ లాజిక్‌ను ఎవరు కాదనగలరు?

ఇక్కడ విషయాన్ని మరో కోణం నుంచి కూడా చూడాలి. సృష్టికర్త దివ్యఖుర్ఆన్‌లో మానవుని సహజ దౌర్బల్యాలను పదే పదే ఎత్తి చూపాడు. ఉదాహరణకు:

"నిశ్చయంగా మానవుడు మహా అన్యాయపరుడు, మేలును మరిచేవాడు." (ఇబ్రాహీమ్-34)

"మానవుడు మహా తొందరపాటు స్వభావి." (బనీ ఇస్రాయీల్-11)

"నిశ్చయంగా మానవుడు మహా దూకుడు స్వభావిగా పుట్టించబడ్డాడు." (అల్ మఆరిజ్-19)

"అవును, వాడు నిజంగానే ఆత్మ ద్రోహి, పరమ మూర్ఖుడు." (అల్ అహ్‌జాబ్-72)

ఇలా చెప్పటంలోని ఉద్దేశం మానవుణ్ణి కించపరచటం ఎంతమాత్రం కాదు, అతని సహజ బలహీనతను తెలియజేయటం అసలు ఉద్దేశం. అలాగే స్త్రీ జ్ఞాపకశక్తిని యిక్కడ ప్రస్తావించటంలోని ఉద్దేశం కూడా ఆమెను పరిహసించటం ఎంతమాత్రం కాదు. సృష్టికర్త ఆమె ప్రాకృతిక బలహీనతను వ్యక్తపరిచాడంతే.

కాబట్టి ఈ హదీసు ఆధారంగా స్త్రీ అన్ని విధాలా అసమర్థురాలు అని పొరబడవలసిన అవసరం లేదు. మందబుద్ధి అనేది కేవలం జ్ఞాపక శక్తికే వర్తిస్తుందని, ధార్మికంగా అధమం అంటే నమాజులలో తగ్గింపు అని ప్రవక్త ప్రవచనం (స) ద్వారా విషయం తేటతెల్లమయింది కూడా. ప్రకృతిపరంగా ఉన్న విషయాన్ని లోపంగా భావించవలసిన అవసరం లేదు. ఇకపోతే మనం చూస్తూ ఉంటాం; షరీయత్ ఆదేశాలను గ్రహించటంలో ఎంతోమంది మహిళలు పురుషులకన్నా ముందంజలో ఉన్నారు. విశ్వాసం (ఈమాన్), సదాచరణ (అమలె సాలెహ్), భయభక్తుల (తఖ్వా) విషయంలో పురుషులకన్నా ఎన్నో రెట్లు నయం అనిపించుకున్న

teluguislam.net


మహిళామణులను కూడా మనం చూస్తూ ఉన్నాం. దైవప్రవక్త (స) కాలంలో ఆయన ధర్మపత్నులు, సహాబియాత్‌లు ధార్మికంగా ఎలాంటి ఆదర్శాలు నెలకొల్పారో కూడా చరిత్ర చెబుతూనే ఉంది.

## 5) అఖీఖా

అఖీఖా విషయంలో కూడా ఇస్లాం స్త్రీ - పురుషుల మధ్య వ్యత్యాసం వుంచింది. దైవప్రవక్త (స) ఇలా ప్రవచించారు: "అబ్బాయి తరఫున (అఖీఖాలో) రెండు మేకలను జిబహ్ చేయాలి, అమ్మాయి తరఫున ఒక మేక." (తిర్మిజీ)

## 6) నికాహ్‌లో విలాయత్ హక్కు

స్త్రీ ఒక సంరక్షకుడు లేకుండా తనంతట తానుగా తన వివాహం చేసుకోవటం గానీ, వేరొక స్త్రీ వివాహానికి గార్డియన్‌గా ఉండటం గానీ చేయజాలదు. ఈ నేపథ్యంలో మహనీయ ముహమ్మద్ (స) వారేమన్నారో చూడండి: "ఏ స్త్రీ కూడా మరో స్త్రీ యొక్క నికాహ్ జరిపించరాదు. ఏ స్త్రీ కూడా తన నికాహ్ కూడా స్వయంగా చేసుకోరాదు. ఏ స్త్రీ తన నికాహ్ స్వయంగా చేసుకుంటుందో ఆమె వ్యభిచారిణి అవుతుంది." (ఇబ్నుమాజా).

## 7) విడాకుల హక్కు

ఇస్లాం విడాకుల హక్కును పురుషులకు మాత్రమే ఇచ్చిందిగాని స్త్రీలకు ఇవ్వలేదు. (వివరాలకు చూడండి: అల్ అహ్‌జాబ్ సూరా 49వ ఆయతు). షరీయతులోని ప్రతి ఆదేశం యుక్తితో కూడుకున్నది. ఈ విషయాన్ని అర్థం చేసుకోవాలంటే మళ్లీ ఒకసారి పాశ్చాత్య కుటుంబ జీవితంపై దృష్టిని సారించాలి. అక్కడి సామాజిక వ్యవస్థలో పురుషునితోపాటు స్త్రీకి కూడా తలాఖ్ (విడాకుల) హక్కు ఉంది. తత్కారణంగా అక్కడ విడాకుల సంఖ్య విపరీతంగా పెరిగిపోయి, కుటుంబ జీవనం అతలాకుతలంగా తయారయింది. కుటుంబ వ్యవస్థను బలోపేతం చేయాలంటే ఈ విడాకుల హక్కును దంపతుల్లో ఎవరో ఒకరికే ఇవ్వాలి. కుటుంబ బాధ్యతల దృష్ట్యా, స్వాభావిక లక్షణాల దృష్ట్యా పురుషుడే ఈ హక్కుకు తగినవాడని ఇస్లామీయ షరీయతు భావించింది. అయితే ఇస్లాం స్త్రీకి 'ఖులా' హక్కు ఇచ్చింది. దీని ప్రకారం ఆమె తన భర్తలోని లోపాన్ని ఎత్తిచూపుతూ విడిపోవటానికి విజ్ఞాపన చేయగలదు.

## 8) దైవదౌత్యం, ధర్మయుద్ధం, నాయకత్వ బాధ్యతలు మొదలగునవి

దైవదౌత్యం (ప్రవక్త పదవి), ధర్మయుద్ధం, దేశ పరిపాలన- ఇవి మూడూ చాలా కీలకమైన పనులు. కష్ట సాధ్యమైనవి, కఠిన పరీక్ష వంటివి కూడా. దీనికోసం మనిషికి అసామాన్యమైన శక్తి సామర్థ్యాలు, సాహసం, సహన స్థయిర్యాలు, వజ్ర సంకల్పం అవసరం.

అందుకే ఇస్లాం ఈ మూడు కీలకమైన బాధ్యతలను కేవలం పురుషులకే అప్పగించింది. స్త్రీలను ఈ బరువు బాధ్యతల నుండి మినహాయించింది. చివరికి సామూహిక నమాజులో పురుషులకు సారథ్యం (ఇమామత్) వహించే బాధ్యత కూడా ఆమెపై మోపబడలేదు.

పైన పేర్కొనబడిన 8 అంశాలలో ఇస్లాం పురుషునికి స్త్రీపై ఒకింత ఆధిక్యతను ప్రసాదించింది. (సదాచారం, దైవభీతి దృష్ట్యా కాదు, సహజమైన శక్తియుక్తుల దృష్ట్యా మాత్రమే ఈ ఆధిక్యత ఇవ్వబడింది).

అయితే పురుషునిపై స్త్రీకి ప్రసాదించబడిన ఆధిక్యాన్ని, ఔన్నత్యాన్ని కూడా ఇక్కడ ప్రస్తావించటం అవసరమే.

## 4. తల్లిగా స్త్రీ

ప్రవక్త సహచరుల్లో ఒక వ్యక్తి దైవప్రవక్త (స) సన్నిధికి వచ్చి 'దైవప్రవక్తా (స)! నేను చూపే గౌరవ మర్యాదలకు, నా సద్వ్యవహారానికి అందరికన్నా ఎక్కువ హక్కు దారులెవరు?' అని అడిగితే, "నీ తల్లి" అని దైవప్రవక్త (స) చెప్పారు. 'ఆ తర్వాత ఎవరు?'అని అతను అడిగితే "నీ తల్లి"అని ఆయన (స) బదులిచ్చారు. 'ఆ తర్వాత ఎవరు?'అని అతను మూడోసారి ప్రశ్నిస్తే "నీ తల్లి"అనే ఆయన (స) సమాధానమిచ్చారు. 'ఆ తర్వాత ఎవరు?' అని అతను నాల్గోసారి అడిగినప్పుడు "నీ తండ్రి" అని ఆయన (స) బదులిచ్చారు. (బుఖారీ)

కుటుంబ వ్యవస్థలో పురుషునిపై స్త్రీకి లభించిన ఈ మూడంతస్తుల ఆధిక్యత, ఇస్లాం ఆమెకు ప్రసాదించిన ఈ గౌరవ స్థానం ప్రపంచంలోని మహిళాభ్యుదయ సంఘాలన్నీ కలిసి శతాబ్దాల తరబడి ఉద్యమించినా సాధించలేవు. ప్రపంచంలోని ఏ దేశమూ, మరే శాసనమూ ఆమెకు ఇటువంటి ఔన్నత్యాన్ని ఇవ్వటానికి సిద్ధంగా లేదు. ముస్లిం కుటుంబాలలో స్త్రీ వివాహమనే బంధంలో ఇమిడి దాంపత్య జీవితంలోకి అడుగిడినప్పుడు ఆమెకు భర్త రూపంలో దృఢమైన ఆశ్రయం లభిస్తుంది. ఆమెకు సంతానం కలిగిన మీదట ఆమె గౌరవోన్నతులు మరింతగా ఇనుమడిస్తాయి. ఇక మనవళ్లు, మనవరాళ్లు వచ్చిన తరువాత ఆమె సంతాన సామ్రాజ్యం మరింతగా విస్తరించి నిజభావంలో ఆమె ఒక 'మహా సామ్రాజ్ఞి' అవుతుంది. ఒకవైపు భర్త దృష్టిలో ఆమె గౌరవం పెరగగా, మరోవైపు నలభై యేళ్ల ఆమె కుమారుడు కూడా అమ్మ ముందు నిలబడి మాట్లాడలేక నీళ్లు నమలుతుంటాడు. కుటుంబంలోని కీలక వ్యవహారాలు సయితం ఈ 'ముసలమ్మ' ముసల్లాపై కూర్చొని చిటికెలో పరిష్కరిస్తూ ఉంటుంది. మరో వంక మనవళ్లు, మనవరాళ్లు తమ నాయనమ్మ కనుసైగలపై వచ్చి ఆమె సేవలు చేయటానికి సిద్ధంగా ఉంటారు. తమ 'దాదిమా'కు ఎక్కడ కోపం వస్తుందోనని వారంతా భయపడుతూ, అణకువతో ఆమె ముందు నిలబడుతుంటారు. ఈ 'దాదిమా' కూడా పైకి కోపాన్ని అభినయిస్తూనే, తన పూవనంలో తిరుగాడే ఈ జాజులు,

సంపెంగలు, మల్లె మొగ్గలను చూసుకుని లోలోనే ముసిముసిగా నవ్వుకుంటూ ఉంటుంది. కుటుంబ జీవితంలో తాను చేసిన సేవలు వృధా పోలేదని, తన కలల పంట పండిందని తృప్తిగా నిట్టూరుస్తుంది. ఆ విధంగా ప్రకృతి ప్రసాదించిన ఆమె గుణాలకు సార్థకత చేకూరుతుంది. మహిళా హక్కుల కోసం అహోరాత్రులు శ్రమించే సంఘాలవారికి ఇస్లాం తరఫున స్త్రీ జాతికి ప్రసాదించబడిన ఈ విశిష్ఠ స్థానం గురించి నిజాయితీగా ఆలోచించే తీరిక దొరికితే ఎంత బావుండు![1]

ఇస్లాం తల్లి స్థాయిలో స్త్రీకి పురుషునిపై మూడింతల ఔన్నత్యాన్ని ప్రసాదించిందని ఒప్పుకోవటానికి మేము ఏమాత్రం సిగ్గుపడము. అలాగే ఇస్లాం ఎనిమిది విషయాలలో పురుషునికి స్త్రీపై ఆధిక్యతను వొసగిందని వ్రాయటానికి కూడా మేము ఏమాత్రం సంకోచించటం లేదు. ఇక ఇస్లాం ఆధారంగా ఎట్టి పరిస్థితిలోనూ స్త్రీలు పురుషులకు సమానులని నిరూపించటానికి అనవసరంగా ప్రయాసపడేవారు కూడా లేకపోలేదు. అలాంటి వారికి మేమొక విషయం అడగదలిచాము- ప్రపంచంలో ఏ మతం లేదా ఏ చట్టం క్రియాత్మకంగా స్త్రీలకు పురుషులతోపాటు సమాన హక్కులు కల్పించిందో చెప్పండి? 'లేదు' అన్నదే (నిజంగానే లేదు) వారి సమాధానమైతే మేము వారికి విన్నవించుకునేదేమిటంటే; ప్రపంచంలో వేరితర మతాల మాదిరిగానే ఇస్లాం కూడా స్త్రీలకు పురుషులతో సమాన స్థాయి కల్పించని పక్షంలో అందులో నామోషీగా భావించవలసిన అవసరమేముంది? స్త్రీ - పురుషుల హక్కుల్ని నిర్ధారించటంలో ఇస్లాం అనుసరించిన పద్ధతి వేరితర మతాలకన్నా ఎంతో న్యాయ సమ్మతంగానూ, సమతూకంతోనూ కూడుకొని వుంది. నేటికి 14 వందల సంవత్సరాల క్రితం ఇస్లాం స్త్రీ జాతికి ఇచ్చిన ఈ వరప్రసాదాలను ఇతరత్రా మతాలు, న్యాయ శాసనాలు శత విధాలా ప్రయత్నించిన మీదట కూడా నేటికీ- స్త్రీజాతికి ఇవ్వలేక పోయాయి. ఇది నగ్న సత్యం.

## 5. అత్తామామల హక్కులు

మన దేశంలోని 90శాతం మంది పెండ్లికాగానే కొడుకు-కోడళ్ళకు వేరే ఇల్లు కొని, వేరు పొమ్మని చెప్పే స్థితిలో లేరు. ఎంతో కొంతకాలం కొడుకు కోడలు తమ అత్తవారింట్లో

1. పాశ్చాత్య జిలుగు వెలుగులతో, తళుకు బెళుకులతో కూడిన సామాజిక జీవనశైలిలో ఊపిరి పీలుస్తూ వివాహబంధాన్ని భర్త బానిసత్వంగా ఊహించే మహిళామణి గురించి కాస్త ఆలోచించండి! వివాహం చేసుకోకుండా యవ్వనంలో 'ఉమ్మడి సంపద' (Common Wealth)గా వెలుగొందుతుంది. ఇవాళ ఇక్కడ, రేపు అక్కడ! యవ్వనం తరిగిన కొద్దీ అందం, ఆకర్షణ కూడా తగ్గుతుంది. తనను ఎవరూ చూడరు. ఒకప్పటి తన అందం, ఆకర్షణ ఆమెకు గతించిన 'కల' గా మిగిలిపోతుంది. ముందు, వెనకా, కుడివైపున, ఎడమ వైపున ఆమెకు ఏ దిక్కూ ఉండదు. సువిశాలమైన జీవన ఎడారిలో ఇప్పుడు తను ఆకులు రాలిపోయిన మోడు వృక్షం! పరిస్థితి అగమ్యగోచరం. భరించశక్యం కాని ఏకాంతం. ఏ కుక్కనో, పిల్లినో పెంచుకుని కాలక్షేపం చేయాల్సిన దుస్థితి! ఇదీ ఒక బ్రతుకేనా?

(తల్లిదండ్రుల ఇంట్లో)నే ఉండి కాపురం చేయవలసి ఉంటుంది. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాలలో ఈ ఆనవాయితీ బలోపేతంగా ఉంది. కొన్ని చోట్లయితే తల్లిదండ్రులు ముసలి వారైన కారణంగా కొడుకు పెళ్లి చేయటానికి హడావిడి చేస్తారు. ఎందుకంటే గృహ వ్యవహారాలు చూడటానికి ఎవరూ ఉండరు. ఇంట్లో పని మనిషిని పెట్టుకోవటం కన్నా కొడుకు పెళ్ళి చేసి, కోడల్ని తెచ్చుకోవటం మిన్న అని వారు భావిస్తారు. కొన్ని దశాబ్దాల క్రితం వరకైతే మన పెద్దలు తమ పిల్లల పెండ్లి విషయంలో బంధు జనులకు చాలా ప్రాముఖ్యం ఇచ్చేవారు. సాధారణంగా మామయ్య కూతురినో, మేనత్త కూతురినో, పిన్ని కూతురినో వధువుగా తెచ్చుకునే వారు. పెళ్ళి కూతురి తల్లిదండ్రులు తమ అమ్మాయిని అత్తవారింటికి పంపిస్తూ, "ఈ రోజు ఏ ఇంటికి నీ పల్లకి (డోలీ) మోయబడుతుందో అదే ఇంటి నుంచి నీ శవపేటిక (డోలా) మోయబడాలి" అని ఉపదేశించేవారు. అంటే ఇక నీ సుఖదుఃఖాలు, నీ జీవన్మరణాలు ఆ ఇంటితోనే పెనవేసుకుని ఉన్నాయనే భావనను తమ గారాలపట్టీకి నూరిపోసేవారు. తత్కారణంగా కోడలు పిల్ల మనసులో పతి ఆదరణతోపాటు అత్తామామల ఆదరణాభావం కూడా గూడుకట్టుకుని ఉండేది. అత్తామామల సేవలు చేయటం తలవంపుగా భావించేది కాదు. అత్తాకోడళ్ల మధ్య అప్పుడప్పుడూ అరమరికలు వచ్చినా మొత్తం మీద జీవితం సుఖసంతోషాలతో సాగిపోయేది. కాని పాశ్చాత్య సంస్కృతిని అనుకరించే అంటు తగిలినప్పటి నుంచి ఓ కొత్త ఆలోచన పుట్టుకు వచ్చింది. ఉదాహరణకు- కొంతమంది ఏమంటారంటే; "షరీయతు ప్రకారం అత్తామామల సేవ చేయాలని ఎక్కడుంది? భర్త కోసం అన్నం వండటం, బట్టలు ఉతకటం, ఇంటి చాకిరీ చేయటం భార్య డ్యూటీ కానేకాదు. ఆ మేరకు డిమాండు చేసే హక్కు భర్తకు లేనేలేదు". ఇది నిజమేనా? రండి, ఈ 'ఫత్వా' ఎంతవరకు సహేతుకమో, ఎంతవరకు క్రియాత్మకమో పరిశీలిద్దాం. ఈ 'తీర్పు' నిజంగానే ఇస్లామీయ ప్రబోధన ప్రకారముందా? లేక ఇది పాశ్చాత్య అంధానుసరణలో భాగమా?

పతి ఆదరణ, పతి సేవకు సంబంధించినంతవరకు దైవప్రవక్త (స) వారి ప్రవచనాలు, ఉపదేశాలు ఎన్నో ఉన్నాయి. ఎంతో స్పష్టంగా కూడా ఉన్నాయి. వివరాల్లోకి వెళ్ళేందుకు అవకాశం లేదు గనక మచ్చుకు మూడు హదీసులను మాత్రమే ఇక్కడ పొందుపరుస్తున్నాము- అదీ క్లుప్తంగా!

1. భర్తయే భార్యకు స్వర్గం, నరకం. (అహ్మద్, తిబ్రానీ, హాకిమ్, బైహఖీ)

2. ఒకవేళ నేను సాష్టాంగ ప్రణామం చేయమని ఎవరికైనా ఆజ్ఞాపించవలసి ఉంటే తన భర్తకు సాష్టాంగ ప్రణామం చేయమని భార్యకు ఆజ్ఞాపించేవాడిని. (తిర్మిజీ)

3. స్త్రీలు నరకంలో అధికంగా ఎందుకుంటారంటే వారు తమ భర్తలపట్ల కృతఘ్నులై ఉంటారు. (బుఖారీ)

teluguislam.net



దైవప్రవక్త (స) కోసం ఆయన సతీమణులు భోజనం వండేవారు, ఆయన (స)కోసం పక్క సర్దేవారు. ఆయన బట్టల్ని ఉతికేవారు. చివరకు ఆయన తల దువ్వేవారని కూడా మనకు తెలుసు. దైవప్రవక్త (స) వారి ప్రవచనాలు, ఆయన సతీమణుల క్రియాత్మక దృష్టాంతాల తర్వాత కూడా వంట చేయటం, బట్టలు ఉతకటం భార్యల పని కాదని చెప్పే షరీయతు ఎక్కడుంటుంది? ఈ ఉదాహరణ తర్వాత కూడా వారికి ఇంకేం కావాలట?

ఇక అత్తామామల సేవ విషయానికి వస్తే, దీని గురించి ఏదన్నా చెప్పుకునే ముందు ఇస్లాం ఆసాంతం సౌభ్రాతృత్వం, దయ, జాలి, కరుణ, ప్రేమ, వాత్సల్యం, గౌరవ మర్యాదలతో కూడుకున్న ధర్మం అన్న సంగతిని దృష్టి యందుంచుకోవాలి. ఒకసారి ఒక వృద్ధుడు దైవప్రవక్త (స)ను కలుసుకోవటానికి వచ్చాడు. ఆ సమావేశంలో కూర్చునివున్న వారు అతనికి దారి ఇవ్వటానికి ఆలస్యం చేయటంతో కారుణ్యమూర్తి(స) ఇలా పలికారు: "ఎవరయితే మాలోని చిన్నలపై వాత్సల్యం కనబరచడో, మరెవరయితే మాలోని పెద్దల హక్కును గుర్తించి గౌర వించడో వాడు మావాడు కాడు" (అబూదావూద్). ఇమామ్ తిర్మిజీ (రహ్మలై) తన సునన్‌లో పొందుపరచిన ఒక హదీసు ఇలావుంది- కాబ్ బిన్ మాలిక్ కుమార్తె అయిన కబ్శా (ర.అన్హా) తన మామగారైన హజ్రత్ అబూ ఖతాదా (రజి)ను వుజూ చేయించటానికి నీళ్లు తెచ్చారు. హజ్రత్ కబ్శా (ర.అన్హా) ఆయనకు వుజూ చేయించసాగారు. అప్పుడు ఒక పిల్లి వచ్చి ఆ పాత్రలోని నీరు త్రాగసాగింది. అది గమనించిన అబూ ఖతాదా (రజి) ఆ నీళ్ల పాత్రను పిల్లి వైపుకు జరుపుతూ, "పిల్లి అశుద్ధ జంతువు కాదు" అని దైవప్రవక్త(స) చెప్పారన్నారు(తిర్మిజీ). ఈ హదీసు ద్వారా మనకు అవగతమయ్యే ఒక ముఖ్య విషయమేమిటంటే దైవప్రవక్త (స) సహాబియాత్‌లలో అత్తవారి సేవాభావన ఉండేది.

అత్తవారి సేవకు సంబంధించిన ఒక ముఖ్య కోణం ఏమంటే దైవప్రవక్త (స)- తమ పిల్లలకై తల్లిదండ్రులు స్వర్గం లేదా నరకమని అన్నారు(ఇబ్నుమాజా). దీని భావమేమంటే పిల్లలు తమ తల్లిదండ్రుల సేవ చేయాలి. వారికి విధేయులై ఉండాలి. ఎట్టి పరిస్థితిలోనూ వారిని సంతుష్టపరచాలి. ఇది తప్పనిసరి. దాంతోపాటు భార్య కొరకు భర్తను స్వర్గం లేదా నరకంగా ఖరారు చేయటం జరిగింది. అంటే మొత్తం కుటుంబం- తల్లిదండ్రులు (అత్తా మామలు), కొడుకు (భర్త), భార్య (కోడలు)- వీళ్ళందరినీ పరస్పరం ఒండొకరితో జోడించటం జరిగింది. అంటే వారి ప్రాపంచిక, పారలౌకిక వ్యవహారాలను పరస్పరం వేరుపరచటం సాధ్యం కాదు. కొడుకు తన తల్లిదండ్రుల సేవకు బద్ధుడు. భార్య తన భర్త సేవకు బద్ధురాలు. మరి అలాంటప్పుడు కొడుకు రేయింబవళ్ళు తన తల్లిదండ్రుల సేవలో నిమగ్నుడై ఉండగా భార్య "షరీయత్ ప్రకారం నేను నా అత్తామామల సేవ చేయనవసరం లేద"న్న ఫత్వాను ఆసరాగా పెట్టుకుని హాయిగా నిద్రపోతుంటే ఆ కాపురంలో ప్రేమానురాగాలు

నిలుస్తాయా? కోడలు ఈ రకమయిన ఫిలాసఫీని ఆశ్రయించటం మొదలెడితే కలతలు మొదలవుతాయి. అన్నిటికన్నా ముందు ఆమె భర్త తన అత్తవారిని విస్మరించటం మొదలెడ తాడు. ఫలితంగా ఆ రెండు కుటుంబాల మధ్య ప్రేమానుబంధాలు చెరిగిపోయి, దూరాలు పెరుగుతాయి. కాలక్రమేణా అవి విద్వేషాన్ని చిమ్ముతాయి. ఆఖరికి అవి గొడవల్ని సృష్టించి ఆలుమగలు కట్టుకున్న అనురాగ గోపురాన్ని కూల్చివేసేదాకా పోతాయి. ఈ రకమైన ఫిలాసఫీ పాశ్చాత్య తరహా సామాజిక వ్యవస్థకు సరిపోతుందేమోగాని ఇస్లామీయ వ్యవస్థకు ఎంతమాత్రం అతకదు.

## ఇస్లాం శిక్షణా వ్యవస్థ

వ్యక్తుల సమాహారమే సమాజం. సమాజంలో వ్యక్తి అవిభాజ్యమైన అంగం. సజ్జనులు, సచ్ఛీలురైన వ్యక్తులు తయారై ఒక సత్సమాజాన్ని నిర్మించే నిమిత్తం ఇస్లాం సమాజ సంస్కరణా కార్యాన్ని వ్యక్తులతోనే మొదలెడుతుంది. వ్యక్తి సంస్కరణ కోసం, ఇస్లాం శిక్షణా విధానాన్ని ఆకళింపు చేసుకునే నిమిత్తం మానవ జీవితాన్ని నాలుగు దశలుగా విభజించవచ్చు.

1. మొదటి దశ - గర్భధారణ మొదలుకుని పుట్టుక వరకు
2. రెండవ దశ - పుట్టుక మొదలుకుని యుక్త వయస్సుకు చేరేవరకు
3. మూడవ దశ - యుక్త వయస్సు నుండి వివాహం వరకు
4. నాల్గవ దశ - వివాహ సమయం నుండి జీవితాంతం వరకు

teluguislam.net



# మొదటి దశ :

## గర్భధారణ మొదలుకుని పుట్టుక వరకు

పిల్లలు భాగ్యవంతులా లేక దౌర్భాగ్యులా అనేది చాలావరకు తల్లిదండ్రుల ధార్మికత, భయభక్తులు, మంచితనం, మంచి నడవడిక, మంచి అలవాట్లపై ఆధారపడి ఉంటుందనేది తిరుగులేని వాస్తవం. తల్లిదండ్రుల్లోనూ తల్లి భావాలు, ఆలోచనలు, తెలివితేటలు, గుణగణాలను పిల్లలు ఎక్కువగా పుణికి పుచ్చుకుంటారు. ఈ వాస్తవాన్ని దృష్టిలో పెట్టుకుని ఇస్లాం వివాహం విషయంలో స్త్రీ ధార్మికతకు ఎక్కువ ప్రాధాన్యత ఇచ్చింది. ఈ నేపథ్యంలో మహనీయ ముహమ్మద్ (స) వారి ఉపదేశాన్ని ఓసారి నెమరు వేసుకోండి: "స్త్రీని నాలుగు అంశాల ఆధారంగా వివాహమాడటం జరుగుతుంది. 1. అందం, 2. ఐశ్వర్యం, 3. వంశం, 4. ధార్మికత. మీ చేతులకు మన్ను తగల! మీరు ధార్మికురాలైన స్త్రీని వివాహమాడండి, మేలు జరుగుతుంది." (బుఖారీ)

ఈ పూర్వ రంగంలో మేము హజ్రత్ ఉమర్ (రజి)గారి సంఘటనను ఉదాహరించ దలిచాము. దైవప్రవక్త (స) ప్రవచనానికి ఈ సంఘటన క్రియాత్మక దృష్టాంతంగా ఉంది. హజ్రత్ ఉమర్ (రజి) తాను ఖలీఫాగా ఉన్నప్పుడు రాత్రిపూట వీధులలో గస్తీ చేసి ప్రజల సుఖదుఃఖాలను తెలుసుకోవటం మామూలుగా ఉండేది. ఒక రోజు రాత్రి ఆయన గస్తీ చేస్తూ అలసిపోయి, ఒక గోడకు ఆనుకుని కూర్చున్నారు. అంతలోనే ఆ ఇంట్లోని ఇద్దరు మహిళల సంభాషణ వినవచ్చింది. "అమ్మాయి! పాలలో నీళ్లు కలుపు" అంటోంది ఒక తల్లి. "అమ్మా! పాలలో నీళ్లు కలపకూడదని అమీరుల్ మోమినీన్ శాసించారు కదమ్మా!" అంటోంది కూతురు. "పిచ్చిదానా! ఇక్కడ అమీరుల్ మోమినీన్ మనల్ని చూడవచ్చాడా ఏమిటి?" అన్నది తల్లి. "అమ్మా! అమీరుల్ మోమినీన్ చూడకపోయినా అల్లాహ్ చూస్తున్నాడు కదా!" అన్నది కూతురు. తెల్లవారగానే ఖలీఫా హజ్రత్ ఉమర్ (రజి) తన భార్యతో, "తక్షణం ఫలానా ఇంటికి వెళ్ళి ఆ అమ్మాయికి పెళ్ళయిందో లేదో కనుక్కో"మన్నారు. తీరా అక్కడికి వెళ్ళి ఆరాతీస్తే ఆ అమ్మాయి ఒక వితంతువు అని తేలింది. హజ్రత్ ఉమర్(రజి) ఏమాత్రం తాత్సారం చేయకుండా ఆ అమ్మాయిని తన కోడలిగా ఎంపిక చేశారు. తన కుమారుడైన ఆసిమ్‌తో ఆమె పెళ్లి జరిపించారు. ఈ దంపతుల ద్వారా కలిగిన సంతానమే అయిదవ ధర్మ ఖలీఫా హజ్రత్ ఉమర్ బిన్ అబ్దుల్ అజీజ్ (రహ్మ.లై).

గర్భవతిగా ఉన్నప్పుడు తల్లి ఆలోచనలు, అలవాట్లు, ఆచార వ్యవహారాలు ఎలా ఉన్నాయి? రోజువారీ ఆమె జరిపే సంభాషణ ఎలాంటిది, ఆమె చదివే పుస్తకాలు, పత్రికలు ఎలా ఉన్నాయి? వాటి ప్రభావం ఆమె మనోమస్తిష్కాలపై ఎలా పడుతోంది? ఆమె ఆడియో విజన్, వీడియో విజన్ ఎటువంటిది? ఆమె దర్శించే రూపచిత్రాలు ఎలా ఉన్నాయి? వీట న్నింటి ప్రభావం గర్భస్థ శిశువుపై పడుతుంది. అందుకే ఇస్లాం తొలినాటి నుంచే దంపతులను

శుభప్రదమైన వాతావరణంలో ఉంచగోరుతుంది. లైంగిక భావోద్రేకాలు పరాకాష్ఠకు చేరిన క్షణాలలో కూడా వారు పైశాచిక ప్రాబల్యం నుండి సురక్షితంగా ఉండాలన్నది ఇస్లాం అభిమతం. ఆనంద ఘడియల్లో కూడా దంపతులు కరుణామయుడైన అల్లాహ్‌ను మరువ కూడదు. అందుకే తొలి రేయి వరుడు వధువును చూసినప్పుడు ఈ విధంగా దుఆ చేయాలని దైవప్రవక్త (స) ఉపదేశించారు: "ఓ అల్లాహ్! ఈమెలోని మేలును ప్రసాదించమని నిన్ను అర్థిస్తున్నాను. ఏ నైజంపై నీవు ఈమెను పుట్టించావో దాని మేలును అర్థిస్తున్నాను. ఈమె కీడు నుండి నీ శరణు వేడుతున్నాను. ఏ స్వభావంపై నీవు ఈమెను సృష్టించావో దాని కీడు నుండి శరణు కోరుతున్నాను" (అబూదావూద్). రతి క్రీడ సమయంలో భార్యాభర్తలు మైమరచి పోతారు. ఆ క్షణాల్లో వారికి మిగతా ప్రపంచం గురించి ఏమీ పట్టదు. అందుకే ఇస్లాం కోర్కెలు అదుపు తప్పుతున్న ఘడియల్లో కూడా జీవిత పరమార్థాన్ని గుర్తు చేస్తుంది. కేవలం కామతాపం చల్లార్చుకోవటమే మీ ఉద్దేశ్యం కారాదనీ, సజ్జన సంతానోత్పత్తి కూడా దీని ముఖ్యోద్దేశాల్లో ఒకటని జ్ఞాపకం చేస్తుంది. అందుకే తన భార్యతో సమాగమం జరపదలిచిన వ్యక్తి ఈ విధంగా వేడుకోవాలని మహనీయ ముహమ్మద్ (స) ఉపదేశించారు: "అల్లాహ్ పేరుతో, ఓ అల్లాహ్! మమ్మల్ని షైతాన్‌కు దూరంగా ఉంచు. నీవు మాకు ప్రసాదించబోయే దాన్ని కూడా షైతాన్ నుంచి సురక్షితంగా ఉంచు" (బుఖారీ, ముస్లిం). గర్భధారణకు ముందే ఆలుమగలు అల్లాహ్ వైపుకు మరలే, అల్లాహ్ నుండి మేలును కోరే, కీడు నుండి శరణు వేడే శిక్షణ ఇచ్చింది ఇస్లాం. ఆ విధంగా భార్యాభర్తలిరువురినీ కోర్కెలు, భావోద్రేకాల కీడు నుంచి శుభం వైపుకు, పాపం నుంచి పుణ్యం వైపుకు, చెడు నుంచి మంచి వైపుకు మళ్ళిస్తుంది- పుట్టబోయే శిశువుపై ఈ సవ్యమైన భావాల ప్రభావం పడి ఆ సంతానం సజ్జన సంతానంగా అలరారాలన్నదే ఇస్లాం అభిలాష.

## రెండవ దశ :

## పుట్టుక మొదలుకుని యవ్వనం వరకు

శిశువు పుట్టగానే అన్నిటికన్నా ముందు ఆ శిశువు కుడి చెవిలో 'అజాన్', ఎడమ చెవిలో 'ఇఖామత్' పలుకులు వినిపించాలి. ఆ తర్వాత ఏ పుణ్యాత్ముని లేక విద్వాంసుని చేతనయినా 'తహ్నీక్'[1] చేయించాలి. శుభం కొరకు 'దుఆ' చేయించాలి. శిశువు జన్మించిన ఏడవ రోజున ఆ శిశువు తరపున అల్లాహ్ పేర మేకను జిబహ్ చేసి అఖీఖా చేయటం, నామకరణం చేయటం మస్నూన్ (ప్రవక్త సంప్రదాయం).[2]

---

1. ఏదైనా తీపి వస్తువును, ఉదాహరణకు : ఖర్జూరంలాంటి వస్తువును నమలి పిల్లవాని నోట్లో వేయటాన్ని 'తహ్నీక్' అంటారు.

2. పిల్లవాడికి పెట్టే మంచి పేరు కూడా అతని వ్యక్తిత్వాన్ని ఇనుమడింపజేస్తుందని, అతని నడవడికపై ప్రభావం చూపుతుందని మనస్తత్వవేత్తలంటున్నారు. 'అల్లాహ్‌కు 'అబ్దుల్లాహ్', 'అబ్దుర్రహ్మాన్' అనే పేర్లు అన్నింటికన్నా ఇష్టమైనవని' మహాప్రవక్త (స) చెప్పారు. (ముస్లిం)

teluguislam.net



ఈ పనులన్నీ పిల్లవాడికి ఉజ్వల భవిష్యత్తును ప్రసాదించటంలో, పవిత్ర జీవితం గడపటంలో ముఖ్య పాత్ర పోషిస్తాయి.

మహనీయ ముహమ్మద్(స) ఇలా బోధించారు: పిల్లవాడు ఏడేళ్ల ప్రాయానికి చేరుకోగానే నమాజు గురించి పురికొల్పండి. పదేళ్ల వయసులో నమాజు చేయకపోతే దండించి మరీ నమాజు చేయించండి. వారు నిద్రించే స్థలాన్ని (పడక గదిని లేదా పడకను) వేరు చేయండి'' (బుఖారీ). కాస్త ఆలోచించండి! ప్రవక్త (స) వారి ఈ చిన్న ప్రబోధనంలో ఎన్ని ముఖ్యాంశాలు అంతర్లీనమై ఉన్నాయో! నమాజు చేయక ముందు పిల్లవానికి శుచీశుభ్రతల గురించి క్షుణ్ణంగా చెబుతారు. కాలకృత్యాలు తీర్చుకోవటం, స్నానం చేయటం, వుజూ చేయటంలోని సూక్ష్మాతిసూక్ష్మ విషయాలన్నీ పూసగుచ్చినట్లు వివరిస్తారు. బట్టల పరిశుభ్రత, నమాజ్ చేసే స్థలం పరిశుభ్రత గురించి కూడా తాకీదు చేయటం జరుగుతుంది. అతని మనసులో మస్జిద్ పట్ల ఔన్నత్యం నూరిపోయబడుతుంది. సామూహిక నమాజు ప్రాముఖ్యం గురించి తెలియపరచటం జరుగుతుంది. తత్కారణంగా సహజంగానే పిల్లవానిలో ధార్మిక భావాలు జనించటంతోపాటు, పరిశుభ్రత, పరిశుద్ధతల పట్ల శ్రద్ధ కలుగుతుంది. క్రమశిక్షణ అలవడుతుంది.

పై హదీసులోని చివరి వాక్యంలో పదేళ్ళ వయసు గల పిల్లల పడకను వేరు చేయమని చెప్పబడింది. నిద్ర (సమయం)లో మనిషి ఎలాంటి భావాలు, భావనలకు లోనవుతాడో ప్రతి ఒక్కరికీ తెలిసిందే. పడక (లేక పడక గది)ని వేరు చేయమని చెప్పటంలోని ఉద్దేశమేమంటే అల్లాహ్ పిల్లల్లో ప్రోదిచేసివున్న లజ్జ, బిడియం, వ్రీడ వంటి భావాలు వారిలో మరింతగా వికసించాలి. ప్రాజ్ఞ వయస్సుకు చేరని పిల్లలు సయితం కొన్ని వేళల్లో తమ తల్లిదండ్రుల వద్దకు అనుమతి లేకుండా వెళ్ళరాదని తాకీదు చేసి సౌశీల్యం, మానమర్యాదలకు సంబంధించిన ఓ అత్యుత్తమ ప్రమాణాన్ని ఇస్లాం నెలకొల్పింది. ఇటువంటి ఉపమానం వేరితర మతాలలో ఎక్కడా కానరాదు. అల్లాహ్ ఇలా సెలవిచ్చాడు: "ఓ విశ్వాసులారా! మీ అధీనంలోవున్న మీ బానిసలుగానీ, ఇంకా ప్రాజ్ఞ వయస్సుకు చేరని మీ పిల్లలు గానీ మూడు వేళల్లో మీ అనుమతి పొందిన మీదటే మీ వద్దకు రావాలి- 1. ఫజ్ర్ నమాజుకు పూర్వం, 2. మధ్యాహ్నం (జుహ్ర్) వేళ మీరు మీ బట్టలు విడిచి ఉన్నప్పుడు, 3. ఇషా నమాజు తర్వాత (మీరు నిద్రకు ఉపక్రమించినప్పుడు)."

# మూడవ దశ :

## యుక్త వయస్సు నుండి వివాహం వరకు

అంతకు ముందు వరకూ చిన్న పిల్లలైనందువల్ల విధించబడని ఆంక్షలన్నీ యుక్త వయస్సుకు చేరిన మీదట విధించబడతాయి.[1] యుక్త వయస్సుకు చేరుకున్నప్పటి నుంచీ యువతీయువకులలో లైంగిక భావాలు జాగృతమవుతాయి. ఆపోజిట్ సెక్స్ పట్ల సహజంగానే ఆకర్షణ కలుగుతుంది. ఈ భావోద్రేకాలను ఇస్లాం దశలవారీగా వివిధ ఆజ్ఞలతో అదుపులో ఉంచుతూ, నేర్పుగా వాటిని పరిపక్వతకు చేర్చుతుంది. ఈ సందర్భంగా ఇవ్వబడిన ఆదేశాలు ఇవి:

### 1) బంధుత్వాల వర్గీకరణ

ముస్లిం కుటుంబీకుల్లో కళ్లు తెరచిన పిల్లవాడు ప్రాజ్ఞ వయస్సుకు చేరుకునేసరికి అతనిలో వావివరుసల విచక్షణా జ్ఞానం వచ్చేస్తుంది. అంటే ఇంట్లో తనతోపాటు ఉండే తాతయ్య తాతమ్మ, తల్లిదండ్రులు, అన్నదమ్ములు, అక్కాచెల్లెళ్లు పవిత్ర బంధువులని, వీరి గురించి లైంగికంగా చెడుగా ఆలోచించటం కూడా మహాపాపం అని పిల్లవాడికి అర్థమవుతుంది. తల్లిదండ్రులు, అన్నాచెల్లెళ్లు తరువాత అతను మరికొంత మంది సమీప బంధువులతో కూడా కలిసిమెలిసి ఉంటాడు. ఉదాహరణకు- బాబాయి, పెత్తండ్రి, మామయ్య, పిన్నమ్మ, మేనత్త మొదలగువారు. వీరు కూడా పవిత్ర బంధువులే. అంటే ఇలాంటి వారి ముందు పరదా పాటించనవసరం లేదు. అలాంటి వారితో వివాహ సంబంధాలు కూడా హరామ్ (నిషిద్ధం) గావించబడ్డాయి.[2] ప్రతి పురుషుని- ప్రతి స్త్రీ చుట్టూ షరీయతు ఏర్పరచిన బంధుత్వ పరిధి ఎటువంటిదంటే వాటి లోపల ఉన్న మనిషిలో లైంగిక భావోద్రేకాలకు ఆస్కారమే ఉండదు. ఈ నిషిద్ధ సంబంధాల పరిధి వెలుపల ఏ స్త్రీ పురుషుల మధ్య లైంగిక భావోద్రేకాలకు ఆస్కారముంటుందో అక్కడ ఇస్లాం వేరితర తరుణోపాయాలను అవలంబించింది.

### 2) సంస్కారవంతమైన వస్త్రధారణ

సాధారణంగా కుటుంబ జీవనంలో స్త్రీ-పురుషులు సంస్కారవంతమైన దుస్తుల్ని ధరించాలి. వస్త్ర ధారణలోని అసలు ఉద్దేశం ఏమిటి? మనిషి 'సతర్' భాగం బహిర్గతం కాకుండా జాగ్రత్తపడటం. పురుషుని 'సతర్' నాభి క్రింది భాగం మొదలుకొని మోకాళ్ల

1. మగ పిల్లలకు వీర్య స్ఖలనం జరగటం మొదలయిందంటే వారు యవ్వనం దశకు చేరినట్లు లెక్క. ఆడపిల్లలకు రుతుస్రావం మొదలైనప్పటి నుండి వారు యుక్త వయస్సుకు చేరుకున్నట్లు భావించాలి.

2. హరామ్ (నిషిద్ధ) సంబంధాల గురించి ఇన్షా అల్లాహ్ ఈ పుస్తకంలోనే 'నిషిద్ధ సంబంధాలు' అనే ప్రత్యేక అధ్యాయం రానున్నది.

teluguislam.net


క్రింది వరకూ ఉంటుంది. ఈ శరీర భాగంపై ఆచ్ఛాదన అనివార్యం. మహనీయ ముహమ్మద్ (స) ఇలా అన్నారు: "పురుషుడు నాభి క్రింది భాగం నుండి మోకాళ్ల వరకూ గల శరీర భాగమంతటినీ కప్పి ఉంచాలి" (దారె ఖుత్నీ). కాగా; స్త్రీలు ముఖం, అరచేతులు, పాదాలు తప్ప మిగిలిన శరీర భాగమంతా కప్పి ఉంచాలి. స్త్రీలనుద్దేశించి దైవప్రవక్త (స) ఇలా ఆదేశించారు: "స్త్రీ యుక్తవయస్సుకు చేరిన తరువాత ఆమె శరీరంలోని ఏ భాగం కూడా కనిపించకూడదు- ముఖం, అరచేతులు మణికట్టు వరకు తప్ప!" (అబూదావూద్). నిరాడంబర మైన, సంస్కారవంతమైన దుస్తులంటే భావం ఏమిటి అంటే దుస్తుల్ని ధరించిన మీదట కూడా శరీరంలోని ఒంపు సొంపులు బహిర్గతం కాకూడదు. అంటే మరీ పలచని దుస్తులుగానీ, శరీరానికి అతుక్కుపోయి ఉండే దుస్తుల్ని గానీ తొడగకూడదు. ఈ నేపథ్యంలో ప్రవక్త (స) వారేమన్నారో చూడండి: "దుస్తుల్ని ధరించిన తరువాత కూడా నగ్నంగా కనిపించే స్త్రీలు స్వర్గంలో ప్రవేశించరు. కనీసం స్వర్గ సువాసనను కూడా ఆఘ్రాణించలేరు." (ముస్లిం)

## 3) అనుమతి లేనిదే ఇంట్లో ప్రవేశించరాదు

ప్రాజ్ఞ వయస్సుకు చేరాక ఇంటి పురుషులు (తండ్రి, అన్న, కొడుకులు) అయినాసరే తమ ఇంటిలోపలికి వస్తున్నప్పుడు అనుమతి తీసుకుని మరీ రావాలని ఆజ్ఞాపించబడింది.[1] నిశ్శబ్దంగా ఇంట్లోకి జొరబడకూడదు. ఇంట్లో ఆడవాళ్లు (భార్య మినహా) మీరు చూడకూడని పరిస్థితిలో ఉండవచ్చు. ఈ పూర్వరంగంలో ప్రభువాజ్ఞను గమనించండి:

"మరి మీ పిల్లలు (కూడా) ప్రాజ్ఞతకు చేరుకున్న తరువాత, తమ పూర్వీకులు అనుమతి పొందినట్లే వారు కూడా అనుమతి పొంది మరీ రావాలి" (నూర్ - 59). తమ ఇంటి ఆడవాళ్ల విషయంలోనే ఇంతటి 'జాగ్రత్త' అవసరమని చెప్పి ఇస్లామీయ షరీయత్ స్త్రీ-పురుషుల సిగ్గు, బిడియం వంటి భావాలను సచేతనంగా ఉంచుతుంది. ఇంటి నాలుగు గోడల మధ్య వారికి ఈ సుశిక్షణ లభిస్తే బయట పరాయి స్త్రీ- పురుషుల పట్ల వారు జాగ్రత్తపడటానికి వీలుంటుంది.

## 4) పరదా ఆజ్ఞ

ఇంట్లో ఉన్న మహిళలకు తమ 'సతర్' భాగాన్ని వస్త్రంతో కప్పి ఉంచాలని ఆదేశించ బడింది. (అంటే అరచేతులు, పాదాలు, ముఖం తప్ప మిగతా శరీర భాగాలపై ఆచ్ఛాదన అవసరమని చెప్పబడింది). కాని ఇంటి బయటకు వస్తే....? అప్పుడైతే ఆమె తన ముఖాన్ని సయితం కప్పి ఉంచాలని ఆజ్ఞాపించబడింది. దైవప్రవక్త (స) కాలంలో సహాబియాత్ ఈ ఆదేశాన్ని ఖచ్చితంగా పాటించేవారు. అమ్మ హజ్రత్ ఆయిషా (ర.అన్హా) గారు తన హజ్

---

1. ఇంట్లో ప్రవేశించేందుకు అనుమతి పొందే పద్ధతి ఏమిటంటే, ఇంటి గుమ్మం దగ్గర నిలబడి 'అస్సలాము అలైకుమ్' అనాలి. లోపలి నుంచి 'వఅలైకుముస్సలాం' అనే సమాధానం వస్తే లోపలికి వెళ్లవచ్చు. లేకపోతే నిరీక్షించాలి.

యాత్ర గురించి చెబుతూ, 'హజ్జ్ సందర్భంగా వివిధ పయన బృందాలు మా ముందు నుంచి సాగిపోతున్నప్పుడు మేము మా ముఖాలపై దుప్పటిని వ్రేలాడదీసేవారం. వారు వెళ్ళిపోయిన తరువాత దుప్పటి తొలగించేవారం.'' (అహ్మద్, అబూదావూద్, ఇబ్నెమాజా). ఇహ్రామ్ స్థితిలో స్త్రీలు ముఖంపై పరదా వేసుకోరాదన్న సంగతిని మనం యిక్కడ గుర్తుంచుకోవాలి. హజ్రత్ ఆయిషా (ర.అన్హా) గారి హదీసులో 'మేము (సహాబియాత్)' అనే పదం వచ్చింది. దీన్నిబట్టి అవగతమయ్యేదేమిటంటే దైవప్రవక్త (స) హయాంలో ముఖంపై దుప్పటి కప్పుకునే ఆచారం ఒక్క ప్రవక్త సతీమణులకే పరిమితం కాలేదు. ఆయన సహచరిణులంతా దీనిని సంపూర్ణంగా పాటించేవారు.

పాశ్చాత్య నాగరికతా ప్రియులైన ప్రబుద్ధులు కొందరు ముఖంపైని పరదా నుంచి బయట పడేందుకు ఖుర్ఆన్ వాక్యాల ఆధారంగా, ప్రవక్త(స) ప్రవచనాల ఆధారంగా సుదీర్ఘమైన చర్చకు తెర ఎత్తారు. మేము ఈ విషయాన్ని ఆధారాలు నిదర్శనాల వెలుగులో కాదు, విశ్వాసం (ఈమాన్) దృష్టితో చూస్తున్నాము. కాబట్టి మేము శాస్త్రీయమైన తర్కానికి పోకుండా జపాన్ న్యూముస్లిం అయిన 'ఖౌలా లుకాత' అభిప్రాయాలను పొందుపరుస్తున్నాము. జపాన్‌లో పుట్టి పెరిగి, ఫ్రాన్స్‌లో విద్య నభ్యసించి అక్కడే ఇస్లాం స్వీకరించిన ఈ సత్యప్రేమికురాలు ధర్మావగాహన నిమిత్తం సవూదీ అరేబియా, ఈజిప్టు దేశాలను కూడా సందర్శించింది. హిజాబ్ (పరదా)పై ఆమె వెలిబుచ్చిన అభిప్రాయాలలోని కొన్ని భాగాలను[1] యథాతథంగా ఇస్తున్నాము.

"ముస్లిం కాక ముందు నేను బిగుతైన పాంటు, మినీ స్కర్టు ధరించేదాన్ని. అయితే ఇప్పుడు ధరించే పొడవాటి వదులు దుస్తులు నాకొక నిండుదనాన్ని ప్రసాదించాయి. నన్ను నేను ఒక యువరాణిగా భావించుకుంటున్నాను. మొదటిసారిగా నేను హిజాబ్ (బురఖా) ధరించినప్పుడు నా సౌశీల్యానికి, సురక్షకు సార్థకత చేకూరినట్లుగా అనుభూతి నొందాను. నేను అల్లాహ్ సామీప్యం పొందాననిపించింది. నా హిజాబ్ కేవలం దైవవిధేయతే కాదు, అది నా విశ్వాస (ఈమాన్) అభివ్యక్తి కూడాను. హిజాబ్ (బురఖా) ధరించే మహిళ పెద్ద జన సమూహంలో కూడా తన వస్త్రధారణ దృష్ట్యా మర్యాదస్తురాలిగా (ముస్లింగా) గుర్తింపు పొందుతుంది. కాగా; ముస్లిమేతర నమ్మకం కేవలం మాటల ద్వారానే తెలుస్తుంది."

"మినీస్కర్టు చెప్పకనే చెబుతుంటుంది- మీకు నా అవసరముంటే తీసుకెళ్ళవచ్చు అని. కాని హిజాబ్ (పరదా) స్పష్టంగా సంకేతమిస్తుంది- నేను పవిత్రురాలిని అని."

"వేసవి కాలంలో ప్రతి వ్యక్తీ వేడికి తట్టుకోలేక పోతున్నట్టు ఉంటాడు. కాని నేను మాత్రం హిజాబ్ తొడిగి నా శిరోభాగాన్ని, మెడ భాగాన్ని తీక్షణమైన సూర్యకిరణాల నుంచి రక్షించుకున్నాను."

---

1. పూర్తి వివరాల కోసం తర్జుమానుల్ ఖుర్ఆన్ మాసపత్రిక (1997, మార్చి)ను చూడగలరు.

teluguislam.net


"బురఖా ధరించిన ముస్లిం సోదరీమణులు ఎలా ఊపిరి పీల్చుకుంటున్నారా! అని నేను ఒకప్పుడు ఆశ్చర్యపోయేదాన్ని. కాని ఇదంతా అలవాటుపై ఆధారపడి ఉంది. దీనికి అలవాటు పడిన వారికి ఏ యిబ్బందీ ఉండదు. మొదటిసారి నేను నా ముఖంపై నఖాబ్ (ముసుగు) వేసుకున్నప్పుడు నేను వింత అనుభూతిని చెందాను. నేనొక విశిష్ఠ వ్యక్తిత్వమున్న దానిని. ఎవరంటే వారు చూడరాని విలువైన నిక్షేపాలను నాలో దాచుకుని ఉన్న మహారాణిని నేను అన్న భావన నాలో కలిగింది."

"నేను చలికాలపు బురఖాను కుట్టించుకున్నప్పుడు కళ్లపై పలుచని గుడ్డ ఉండే విధంగా నిఖాబ్ కుట్టించాను. ఇప్పుడు నా హిజాబ్‌కు పూర్ణపరిణతి వచ్చినట్లనిపించింది. కళ్లపై జల్లి మాదిరి వస్త్రం లేకుండా ఉన్నప్పుడు కాస్తో కూస్తో బెరకు ఉండేది. నన్నెవరూ చూడకపోయినా, నేను ఇతరులను స్పష్టంగా చూడగలుగుతున్నానే! అనే బాధ లోలోనే కెలుకుతూ ఉండేది. కాని ఇప్పుడు ఆ వ్యాకులత కూడా తొలగిపోయింది. ఈ కొత్త నఖాబ్ ఓ నల్ల కళ్ళద్దాల మాదిరిగా ఉండి, ఇతరుల తీక్షణ వీక్షణాల నుంచి నాకు పూర్తిగా రక్షణ కల్పించింది."

గౌరవనీయురాలైన ఈ జపనీ న్యూముస్లిం మహిళ అభిప్రాయాల్లో పాశ్చాత్యుల అంధానుసరణ చేసేవారి ఆక్షేపణలకు దీటైన జవాబుంది- దుప్పటి బరువును కూడా ప్రాణాంతకంగా భావిస్తున్న ముస్లిం మహిళా మణులకు కూడా ఇందులో గుణపాఠం ఉంది.[1]

యదార్థమేమిటంటే సమాజంలో నీతిబాహ్యతను పెంచి పోషించటంలో, ఆపోజిట్ సెక్స్‌లో కామవాంఛలను రెచ్చగొట్టడంలో ముఖ్య భూమిక పోషించేది పరదా రాహిత్య వాతావరణమే. కాగా; పరదా (హిజాబ్) ముస్లిం సమాజ సంస్కృతిలోని అవిభాజ్య అంశం. ప్రేమికుల చాటుమాటు సరసాలు మొదలుకుని బాహాటంగా జరిగే సరస సల్లాపాల వరకూ- అన్నింటినీ అరికట్టే కీలక సాధనం.కాని శోచనీయమయిన విషయమేమిటంటే నేడు దేశాభిమానుల్లో సామాన్యులు మొదలుకుని ప్రముఖుల వరకూ పరదా రాహిత్య జాడ్యం ఎంతగా ప్రబలిపోయిందంటే అరుదుగా మాత్రమే మహిళలు ఈ హిజాబ్‌కి కట్టుబడి ఉన్నారు.

---

1. ఇక్కడ మేము షహనాజ్ గాజీ అనే ఓ పాకిస్తానీ వనితను గురించి ప్రస్తావించదలిచాం. ఈమె గత 9 ఏళ్లుగా పాకిస్తాన్‌లో బురఖా ధరించి కెప్టెన్‌గా, పైలట్‌గా బాధ్యతలు నిర్వహిస్తోంది. "పాకిస్తాన్ ఉమెన్స్ పైలట్ అసోసియేషన్"కి ఆమె ఛైర్‌పర్సన్ కూడా. 'ఇంటర్నేషనల్ హిజాబ్ తహ్రీక్'కి ఆమె సారధ్యం కూడా వహిస్తోంది. ఆమె ఒక దినపత్రికకు ఇంటర్వ్యూ ఇస్తూ ఇలా అన్నది: "నేను ఐదవ తరగతిలో వుండగానే మా తల్లిదండ్రులు నన్ను బురఖా ధరించేలా చేశారు. తోటి బాలికలంతా నన్ను ఎగతాళి చేశారు. కాని నేను మాత్రం బురఖా తీయలేదు. అయితే ఈనాడు యావత్ప్రపంచ అమ్మాయిలంతా సగర్వంగా చెప్పుకుంటున్నారు- 'షహనాజ్ బురఖా ధరించి విమానం నడుపుతున్నప్పుడు మేము బురఖా వేసుకుని ఇతరత్రా పనులు ఎందుకు

## 5) చూపుల రక్షణ

పరదా సమాజాన్ని లైంగిక విశృంఖలత్వం, విచ్చలవిడితనం నుండి రక్షించే ఒక బాహ్య సాధనమైతే, "చూపుల పరిరక్షణా" ఆదేశం ఒక అంతర్గత ఉపాయం. సమాజంలోని స్త్రీ పురుషులు తమతమ విశ్వాసం,తఖ్వా (ధర్మనిష్ఠ)ను బట్టి ఈ ఉపాయానికి కట్టుబడి ఉంటారు. చూపులను రక్షించుకోవటం అంటే ఏమిటి? పురుషులు పరాయి స్త్రీల, స్త్రీలు పరాయి పురుషుల కళ్లల్లో కళ్లు పెట్టి చూడకూడదు. దొంగచూపులు కూడా చూడకూడదు. దోబూచులాట సాగించకూడదు. పర స్త్రీలను (పర పురుషులను) మాటేసి మరీ చూడకూడదు. ఈ చూపుల చౌర్యం పట్ల అందరూ జాగ్రత్తపడాలి. కళ్లు షైతాన్ బాణాలలో ఒక విషపూరిత బాణమని అనబడుతుంది. ప్రేమ కావ్యాలలో చూపుల కలయికకు ఉన్న కథా కమామీషు అంతా యింతా కాదు. చంచలంగా చూపు కలిపే విద్య ద్వారా ఎన్నో ప్రేమ సందేశాలు పంపబడతాయి. చూపుల చౌర్యంతో రసాస్వాదన మొదలవుతుంది. చూపుల కలయిక ద్వారా పొందే ఈ భావప్రాప్తినే దైవప్రవక్త (స) 'కంటి వ్యభిచారం'గా ఖరారు చేశారు. ఈ కంటి వ్యభిచారం నుండి రక్షించుకునేందుకు దివ్యఖుర్‌ఆన్‌లో ఈ విధంగా సెలవీయబడింది: "(ఓ ప్రవక్తా!) ముస్లిం పురుషులు తమ చూపులను క్రిందికి ఉంచాలనీ, వారు తమ మర్మ స్థానాలను కాపాడుకోవాలని, అది వారి కొరకు పవిత్రమైనదని వారితో చెప్పు." (అన్ నూర్:30). ఇక చూపులను కాపాడుకునే విషయమై స్త్రీలకు ఇవ్వబడిన ఆజ్ఞ ఇది: "(ఓ ప్రవక్తా!) ముస్లిం స్త్రీలు తమ చూపులను క్రిందికి ఉంచాలనీ, తమ మర్మ స్థానాలను రక్షించుకోవాలనీ వారికి చెప్పు." (అన్ నూర్:31)

ఇక్కడ గమనించవలసిన విషయం ఏమిటంటే, అకస్మాత్తుగా- అనుకోకుండా పడిన చూపు క్షంతవ్యమే: మరోసారి ఉద్దేశ్యపూర్వకంగా చూస్తే మాత్రం అది షరీయత్ దృష్టిలో క్షమార్హం కాదు. దైవప్రవక్త (స) హజ్రత్ అలీ (రజి)కి హితబోధ చేస్తూ ఇలా అన్నారు: "అలీ! స్త్రీపై తొలిచూపు (అనుకోకుండా పడిన చూపు) పడిన తరువాత మరోసారి చూడకూడదు. ఎందుకంటే తొలిసారి చూపు క్షంతవ్యమే, మలిసారి చూపు మాత్రం క్షంతవ్యం కాదు." (అబూదావూద్)

## 6) స్త్రీ పురుషులు సమ్మిళితం కారాదు

సమావేశాలలో, కార్యక్రమాలలో పురుషులు-స్త్రీలు కలిసిపోయే సమ్మిళిత వాతావరణం ఎన్నో అనర్థాలకు మూలం. దీనివల్ల వారిలో అందాలను ప్రదర్శించే, పర్సనాలిటీని ఎక్స్‌పోజ్ చేసుకునే అలవాటు పెరుగుతుంది. ముఖ్యంగా టీనేజీలో ఉన్న అబ్బాయిలు

---

చేసుకోలేము?"అని. షహ్‌నాజ్ ఇంకా ఇలా తెలిపారు: "వివిధ ముస్లిం దేశాల నుండి నాకు మంచి ఆఫర్లు వచ్చాయి. బురఖా వేసుకుని తమ దేశ విమానాలు నడపమని నన్ను కోరారు". (నవాయె వక్త్ : 27-11-1997). ఈ ఉదాహరణ ద్వారా పరదా ప్రగతికి ప్రతిబంధకం అన్న ఆక్షేపణ కూడా వీగిపోతుంది.

teluguislam.net



అమ్మాయిలు ఈ సమ్మిళిత సమావేశాల్లో ఒండొకరి పట్ల ఆకర్షితులై చాటుమాటుగా ప్రేమ సందేశాలు పంపుకుంటారు. ఊహలకు రెక్కలొస్తాయి., ఇంటి నుండి పారిపోతారు. కిడ్నాప్‌లు చేస్తారు. కోర్టులకెక్కుతారు. ఇరు కుటుంబాల మధ్య కక్షలు కార్పణ్యాలు రాజుకుంటాయి. హత్యలు జరుగుతాయి. ఈ ఉపద్రవానికంతటికీ మూలం విశృంఖలత్వమే. ఎవరి హద్దుల్లో వారుంటే సమాజంలో ఇంతటి నీతిబాహ్యత ఉండదు. అందుకే ఇస్లామీయ షరీయత్ స్త్రీ పురుషులు ఇష్టమొచ్చినట్లు కలగాపులగమవటాన్ని వారించింది.

స్త్రీ పురుషుల ఈ మిశ్రమ కలయికని అరికట్టడానికి ఇస్లామీయ షరీయత్ కొన్ని ఆదేశాలను సయితం సడలించింది. ఉదాహరణకు: సామూహికంగా నమాజ్ చేయటం పురుషులకు అనివార్యం. కాని ఈ అనివార్యత స్త్రీల కొరకు రద్దు పరచబడింది. పురుషులు మస్జిద్‌లో నమాజ్ చేయటం శ్రేష్ఠతరం. కాని స్త్రీలు ఇంట్లో నమాజ్ చేయటం శ్రేష్ఠం. జుమా నమాజు మగవారికి తప్పనిసరి. కాని ఇది ఆడవారికి తప్పనిసరి కాదు. ధర్మయుద్ధం (జిహాద్) చేయటం పురుషులకు అవశ్యం. కాని ఇది స్త్రీలకు అవశ్యం కాదు. నమాజె జనాజా చేయటం పురుషులకు ఫర్జ్ (ఫర్జె కిఫాయ). కాని స్త్రీలకు ఇది ఫర్జ్ కాదు. ఇస్లాంలోని ఈ ఆదేశాలలో ఉన్న వ్యత్యాసాలు, వినాయింపుల దృష్ట్యా లైంగిక విశృంఖలత్వం నుండి, సామాజిక విచ్ఛిన్నం నుండి ప్రజలను కాపాడటానికి షరీయతు ఆరాధనలలోని కలివిడితనాన్ని సయితం హర్షించలేదాయె. మరి అటువంటి సెన్సెటివ్ షరీయతు (ధర్మశాస్త్రం) సమావేశాల్లో కలిసి పోవటాన్ని, కలిసి తినటాన్ని, కలిసి ఆడటాన్ని, కలిసి నర్తించటాన్ని, కలిసి డ్రామాలు వేయటాన్ని, కలిసి జోకులు వేసుకోవటాన్ని, కలిసి ఉద్యోగాలు చేయటాన్ని, కలిసి రాజకీయం చేయటాన్ని ఎలా సమ్మతిస్తుంది? విచారకరమైన విషయమేమిటంటే మన దేశంలో (పాకిస్తాన్‌లో) ప్రజాజీవితపు అన్ని విభాగాలలోనూ- ప్రభుత్వ స్థాయిలో, ప్రభుత్వేతర స్థాయిలో- షరీయతు ఆదేశాల పట్ల తిరుగుబాటు ధోరణి కనబరచబడుతోంది. దైవాగ్రహం విరుచుకుపడి యావజ్జాతిని శిక్షకు గురి చేయటానికి ఈ ఒక్క కారణం చాలు. పరిస్థితి ఎంతగా దిగజారి పోయిందంటే రోగాన్ని నయం చేయవలసిన వారే ఖుద్దుగా రోగగ్రస్తులై ఉన్నారు. ఈ అధోగతి నుంచి జాతిని వెలికి తీసే మార్గం దూరతీరాల వరకూ కానరావటం లేదు.

## 7) మరి కొన్ని ద్వారాల మూసివేత

సమాజాన్ని సాధ్యమైనంతవరకు లైంగిక విశృంఖలత్వం నుండి పరిశుద్ధంగా ఉంచటమే ఇస్లాం లక్ష్యం గనక అది నీతి బాహ్యతను వ్యాపంపజేసే పెద్దపెద్ద కారకాలన్నింటినీ నిర్మూలించడంతోపాటు కొన్నిసార్లు ప్రమాదకరంగా పరిణమించే చిన్నచిన్న కారకాలకు కూడా ముక్కుతాడు బిగిస్తుంది. అలాంటి చిన్న కారకాలలో కొన్నింటిని యిక్కడ ప్రస్తావిస్తున్నాము-

### (అ) స్త్రీలు సువాసన పూసుకుని బయట తిరగకూడదు

" ఏ స్త్రీ అయితే నమాజు కోసం మస్జిద్‌కు వెళ్ళదలుస్తుందో ఆమె లైంగిక అశుద్ధతను తొలగించేందుకు స్నానం చేసిన విధంగా, సువాసన (ప్రభావం తొలగించేందుకు) స్నానం చేయవలసి ఉంటుంది" అని మహాప్రవక్త ముహమ్మద్ (స) ఉద్ఘాటించారు. (నసాయి)

### (ఆ) పరాయి పురుషులను కలుసుకోరాదు

దైవప్రవక్త (స) ఇలా ఉపదేశించారు: "ఏ పురుషుడు కూడా వేరొక స్త్రీని ఆమె తరఫు మహ్రమ్ వ్యక్తులు లేనప్పుడు కలుసుకోరాదు. స్త్రీ కూడా మహ్రమ్ పురుషుడు లేకుండా ప్రయాణం చేయరాదు." (ముస్లిం)

దైవప్రవక్త (స) వారి మరో హదీసు ఇది:

"ఏ స్త్రీల దగ్గరకు కూడా వారి భర్తలు లేని సమయంలో వెళ్ళకండి. ఎందుకంటే మీలోని ప్రతి ఒక్కరిలో రక్తం ప్రసరించినట్లే షైతాన్ ప్రసరిస్తున్నాడు." (తిర్మిజీ)

### (ఇ) పరాయి స్త్రీలను ముట్టుకోరాదు

"పరాయి స్త్రీని తాకటం కన్నా పురుషుడు తన తలలో ఇనుప కడ్డీని దిగ్గొట్టడం మిన్న" అని ప్రవక్త మహనీయులు (స) చెప్పారు.

### (ఈ) ఒండొకరి 'సతర్' భాగాన్ని చూడరాదు

"ఏ పురుషుడూ మరో పురుషుని సతర్‌ను, ఏ స్త్రీ మరో స్త్రీ యొక్క సతర్ భాగాన్ని చూడకూడదు" అని దైవప్రవక్త (స) ప్రవచించారు.

### (క) కలిసి పడుకోరాదు

"ఏ పురుషుడూ మరో పురుషుని ప్రక్కన, ఏ స్త్రీ మరో స్త్రీ ప్రక్కన ఒకే దుప్పటిలో కలిసి పడుకోరాదు" అని మహనీయ ముహమ్మద్(స) చెప్పారు. (ముస్లిం)

### (చ) పరాయి పురుషుల ముందు అలంకరణను ప్రదర్శించకూడదు

అల్లాహ్ ఇలా సెలవిచ్చాడు: "(ఓ ప్రవక్తా!) ముస్లిం స్త్రీలు తమ చూపులను క్రిందికి ఉంచాలనీ, తమ మర్మ స్థానాలను రక్షించుకోవాలనీ, బహిర్గతమై ఉండేది తప్ప - తమ అలంకరణను బహిర్గతం చేయరాదని వారితో చెప్పు." "దాగి ఉన్న తమ అలంకరణలను ఇతరులకు తెలిసిపోయేలా తమ కాళ్లను నేలపై కొడుతూ నడవరాదని వారితో చెప్పు." (అన్ నూర్:31). అరచేతులు, అరికాళ్లు మినహా స్త్రీ శరీరంలోని మిగతా భాగమంతా 'సతర్'

teluguislam.net



క్రిందికి వస్తుందన్న సంగతిని మరువరాదు. ఈ సతర్ భాగాన్ని ఆమె తన (భర్త తప్ప) ఇంటి వారల ముందు కూడా బహిర్గతం చెయ్యకూడదు. అలంకరణ అంటే ఏమిటి? దైనందిన జీవితంలో తైల సంస్కారం చేసుకోవటం, జడ వేసుకోవటం, సువాసన పూసుకోవటం, కాటుక పెట్టుకోవటం, గోరింటాకు పూసుకోవటం, మంచి దుస్తులు ధరించటం, నగానట్రా - ఇత్యాదివన్నీ అలంకరణలో భాగమే. వీటిని మహ్రమ్ వ్యక్తుల ముందే బహిర్గతం చేయాలి.[1] అదలా వుంచితే దుర్నడత గల స్త్రీల ముందు కూడా వారు తమ అలంకరణను ప్రదర్శించకూడదు.

## (ట) అనవసరంగా పరాయి పురుషులకు తమ కంఠస్వరం వినిపించకూడదు

దైవప్రవక్త (స) ఇలా ప్రవచించారు: "నమాజు చేస్తున్నప్పుడు మరీ అంతగా అవసరమైతే (అంటే ఇమామ్ వల్ల మరుపు జరిగితే) పురుషులు 'సుబ్‌హానల్లాహ్' అనాలి. కాని స్త్రీలు మాత్రం చప్పట్లు కొట్టాలి" (బుఖారీ, ముస్లిం). ఈ కారణంగానే స్త్రీలకు అజాన్ చెప్పే అనుమతి ఇవ్వబడలేదు.

## (త) గానా బజానాల వారింపు

స్త్రీ పురుషుల లైంగిక వాంఛలను రెచ్చగొట్టే అంశాలలో పాటలు, సంగీత వాయిద్యాలు మరింత ప్రమాదకరమైనవి. ఇక పాటకు ఆట (నర్తన) కూడా తోడైతే ఇంకేముందీ? అగ్గి బరాటే! అందుకే దైవప్రవక్త (స) అన్ని రకాల సంగీత వాయిద్యాలను, పాట కచేరీలను గట్టిగా వారించారు. వీటికి పాల్పడేవారికి అల్లాహ్ తరఫున తీవ్రమైన యాతన ఉంటుందని హెచ్చరించారు. ప్రవక్త మహనీయులు (స) ఇలా చెప్పారు: "ఈ అనుచర సమాజంలోని జనులపై భూమిలో కూరుకుపోయే, రూపాలు మార్చివేయబడే రాళ్ల వర్షం కురుస్తుంది." ఓ దైవప్రవక్తా (స)! ఈ ఆపద ఎప్పుడొస్తుందీ? అని ఒక సహచరుడు ప్రశ్నించగా, "ఆడే పాడే ఆడవాళ్లు పెచ్చరిల్లిపోయినప్పుడు, సంగీత పరికరాలు సర్వసామాన్యమై పోయినప్పుడు, మద్యపానం సర్వసాధారణమైనప్పుడు" అని మహాప్రవక్త (స) వివరించారు. (తిర్మిజీ)

## (ప) అశ్లీల సాహిత్యం

స్త్రీల అర్ధనగ్న, ముప్పాతిక నగ్న పోస్టర్లు, దినపత్రికలలో, మ్యాగజైన్లలో వస్తున్న సిగ్గుమాలిన పంచరంగుల చిత్రాలు, ఎల్లో జర్నలిజం, బూతు కథలు, సిగ్గువిడిచిన సరసమైన కథలు సమాజంలో నీతిబాహ్యతను వ్యాపింపజేయటంలో ప్రధాన పాత్ర పోషిస్తున్నాయి. ఇలాంటి చెడుగును వ్యాపింపజేసే వారికి వ్యధాభరితమైన శిక్ష ఉంటుందని దివ్యఖుర్‌ఆన్‌లో

---

1. ఇంతకీ ఆ మహ్రమ్ వ్యక్తులెవరంటే; తండ్రి, తాతయ్య, ముత్తాత, భర్త తండ్రి (మామగారు), అతని తండ్రి, ఆపై వారు. అలాగే కొడుకులు, మనవళ్ళు, మునిమనవళ్ళు. అక్కాచెల్లెళ్ళ కొడుకులు, మనవళ్లు, ముని మనవళ్ళు మొదలగువారు.

హెచ్చరించబడింది. అల్లాహ్ ఇలా సెలవిచ్చాడు: "ముస్లింలలో అశ్లీలత వ్యాపించాలని కోరుకునే వారికి ప్రపంచంలోనూ, పరలోకంలోనూ వ్యధాభరితమైన యాతన ఉంది." (అన్ నూర్:19)

## 8) నికాహ్ ఆదేశం

వ్యక్తి ఆత్మశుద్ధికి, సంస్కరణకు ఉద్దేశించిన ఉపాయాలన్నీ అవలంబించటంతోపాటు ఇస్లాం నికాహ్ (వివాహం) చేసుకోమని కూడా ఆజ్ఞాపిస్తుంది. దీనివల్ల కుటుంబ వ్యవస్థ బలోపేతం అవటంతోపాటు, మనిషిలో సౌశీల్యం, పారిశుద్ధ్యం, సిగ్గు బిడియం కూడా పెంపొందుతాయి. అందుకే ప్రవక్త (స) వారు ఇలా ప్రవచించారు: "నికాహ్ కంటి చూపులను క్రిందికి ఉంచుతుంది. మర్మస్థానాన్ని కాపాడుతుంది" (ముస్లిం). ఆయన (స) ఇంకా ఇలా అన్నారు: "నికాహ్ ధర్మం (దీన్)లో సగభాగం" (బైహఖీ). నికాహ్‌కు ఉన్న ప్రాధాన్యత దృష్ట్యా ఇస్లాం నికాహ్‌ను చాలా సులభతరం చేసింది. దీనికోసం మహర్ పరిమితిగానీ, కట్నకానుకల ఆంక్షగానీ లేవు. ఇంత మొత్తం పెళ్లి కోసం ఖర్చుపెట్టాలన్న నియమం కూడా లేదు. కుల గోత్రాల పట్టింపు లేదు. భాషాభేదాలు, బేషజాలు లేవు. వధూవరులు ముస్లిం అయి వుంటే చాలు. ప్రసిద్ధ సహాబి హజ్రత్ అబ్దుర్రహ్మాన్ బిన్ ఔఫ్ (రజి) మదీనాలో పెళ్లి చేసుకున్నారు. కనీసం దైవప్రవక్త (స)కు కూడా పెళ్లి సంగతి తెలియపరచలేదు. దైవప్రవక్త (స) అబ్దుర్రహ్మాన్ (రజి) దుస్తులపై ఉన్న కుంకుమ పువ్వు రంగును గమనించి, "ఏమిటిది?" అని అడిగారు. "నేను ఒక అన్సారీ మహిళను వివాహమాడాను" అని అబ్దుర్రహ్మాన్ బిన్ ఔఫ్ (రజి) చెప్పారు (బుఖారీ). హజ్రత్ జాబిర్ (రజి) ఒకసారి యుద్ధం నుండి తిరిగి వచ్చాక, "దైవప్రవక్తా (స)! నేను కొత్తగా పెళ్ళి చేసుకున్నాను" అని తెలిపారు. "కన్యను వివాహమాడావా? వితంతువును వివాహమాడావా?" అని ప్రవక్త (స) అడిగితే, "వితంతువును" అని హజ్రత్ జాబిర్ (రజి) చెప్పారు. అప్పుడు దైవప్రవక్త (స), "కన్యను చేసుకోక పోయావా? ఎంచక్కా ఆమె నీతో, నువ్వు ఆమెతో ఆడుకునేవారు కదా!" అని దైవప్రవక్త (స) చమత్కరించారు (ముస్లిం). ఈ సంఘటనల ద్వారా అవగతమయ్యేదేమిటంటే, ప్రవక్త ప్రియసహచరులు సయితం పెళ్ళి విషయం దైవప్రవక్త (స)కు తెలియపరచటం తప్పనిసరిగా భావించేవారు కాదు. తనకు తెలియపరచనందుకు దైవప్రవక్త (స) కూడా కినుక వహించటం జరిగేది కాదు. ఒక సహచరుడు పెళ్ళి చేసుకోదలిచారు. కాని మహర్‌గా చెల్లించటానికి ఆయన దగ్గర కనీసం లోహపు ఉంగరం కూడా లేదు. అప్పుడు దైవప్రవక్త (స), "నీకు వచ్చినంతమటుకు నీవు నీ వధువుకు ఖుర్‌ఆన్ నేర్పు. అదే మహర్" అని చెప్పి నికాహ్ జరిపించారు (బుఖారీ). ఇన్ని సౌలభ్యాలున్నప్పటికీ ఎవరయినా నికాహ్ (వివాహం) పట్ల విముఖతను, విరక్తిని కనబరిస్తే "అలాంటివానితో నాకెట్టి సంబంధం లేదు" అని ప్రవక్త (స) వారు చెప్పారు.

teluguislam.net


## 9) ఉపవాసం- నికాహ్‌కు ప్రత్యామ్నాయం

ఆర్థిక పరిస్థితులు వివాహానికి సానుకూలం కానంతవరకూ తరచూ ఉపవాసాలు పాటిస్తూ ఉండాలని మహాప్రవక్త (స) ఉపదేశించారు. దివ్యఖుర్‌ఆన్‌లో ఉపవాసం గురించి అల్లాహ్ ఇలా సెలవిచ్చాడు: "దీనివల్ల మీలో భయభక్తులు జనించే అవకాశం ఉంది." (2:183). దైవప్రవక్త (స) కూడా ఉపవాసాల ప్రధాన ఉద్దేశ్యమేమిటో చెప్పారు. 'అన్న పానీయాల సేవనం నుండి ఆపటం మాత్రమే రోజా (ఉపవాసం) ఉద్దేశం కాదు, పైగా నీతిబాహ్యమైన, వ్యర్థమైన పనుల నుండి ఆపటం ఉపవాసం అసలు ఉద్దేశం.' (ఇబ్నె ఖుజైమ). దీని భావమేమిటంటే ఉపవాసం మనిషిలో ఉన్న లైంగిక, పాశవిక భావాల తీవ్రతను అణచిపెడుతుంది. అందుకే మహనీయ ముహమ్మద్ (స) ఇలా చెప్పారు: "వివాహం చేసుకునే స్థోమత లేని వ్యక్తి ఉపవాసం పాటించాలి. ఉపవాసం అతని లైంగిక ఉద్రేకాన్ని అరికడుతుంది" (ముస్లిం). ఇక్కడ గమనార్హమైన మరో విషయమేమిటంటే, ఇస్లాం ప్రాజ్ఞతకు చేరకముందే బాలబాలికలకు నమాజ్ గురించి గట్టిగా తాకీదు చేస్తుంది. నమాజ్ గురించి అల్లాహ్ ఏమంటున్నాడో చూడండి: "నిశ్చయంగా నమాజ్ నీతిమాలిన తనం నుండి, చెడు నుండి ఆపుతుంది." (అన్ కబూత్-45). ఒకవైపు నమాజ్, మరో వైపు ఉపవాసం- ఇవి రెండూ కలిసి మనిషిలో పవిత్రమైన భావాలు పెంపొందిస్తాయి. ఆత్మ నిగ్రహం అలవడేలా చేస్తాయి.

## 10) ఆఖరి అస్త్రంగా

ఆత్మశుద్ధికి, వ్యక్తి సంస్కరణకు సంబంధించిన అంతర్బాహ్య పద్ధతులన్నీ అవలంబించిన మీదట కూడా ఎవరయినా తమ లైంగిక భావోద్రేకాలను నిగ్రహించుకోకుండా సభ్యసమాజం ఏవగించుకునే నీతిమాలిన పనికి ఒడిగట్టాడంటే- వ్యభిచారం చేశాడంటే- ఇక ఆ వ్యక్తి (స్త్రీ గానీ, పురుషుడు గానీ) ఇస్లామీయ సమాజంలో ఉండదగిన వాడు కాడు. అతనిలో మానవత్వం బదులు రాక్షసత్వం ఉంది. అటువంటి అపరాధ జనులను దారికి తేవటానికి ఇస్లాం ఆఖరి అస్త్రంగా జనులందరి సమక్షంలో నూరు కొరడా దెబ్బలను కొట్టాలని ఆజ్ఞాపించింది.

ప్రభువాజ్ఞ ఇలావుంది: "వ్యభిచారం చేసే స్త్రీ, వ్యభిచారం చేసే పురుషుడు - వారిద్దరిలో ఒక్కొక్కరికి నూరేసి కొరడా దెబ్బలు కొట్టండి. మీరు అల్లాహ్‌పై, అంతిమ దినంపై విశ్వాసం గలవారే అయితే వారిపై దైవాజ్ఞను (షరీయతు ప్రకారం శిక్షను) విధించేటప్పుడు మీకు ఎంతమాత్రం జాలి కలగకూడదు. పైగా వారిని శిక్షించే సమయంలో ముస్లింలలో కొంతమంది అక్కడ ఉండాలి." (అన్ నూర్-2)

అభం శుభం ఎరుగని అమాయక స్త్రీలపై అభాండం మోపే వారికి కూడా షరీయతు 80 కొరడా దెబ్బల శిక్షను నిర్ధారించింది. ఇలాంటి కల్లోల జనకులను పరాభవం పాల్జేయ టానికి మరో శిక్ష ఏమిటంటే, ఇక మీదట ఏ వ్యవహారంలోనూ వారి సాక్ష్యం ఆమోదించ

బడదు. అల్లాహ్ ఇలా సెలవిచ్చాడు: "శీలవతులైన స్త్రీలపై అపనిందను మోపి, దానికి సంబంధించిన నలుగురు సాక్షుల్ని తీసుకురాలేని వారికి ఎనభై కొరడా దెబ్బలు కొట్టండి. ఇక మీద ఎన్నడూ వారి సాక్ష్యాన్ని ఆమోదించకండి. వారు అవిధేయులు." (అన్ నూర్-4)

ఒకవేళ ఎవరయినా వివాహితులై ఉండి వ్యభిచారానికి పాల్పడితే రాళ్లు రువ్వి చంపే శిక్ష విధించబడుతుంది. ఈ వివరాలు మునుముందు రాబోతున్నాయి.

# నాల్గవ దశ :

## వివాహం నుండి చరమ ఘడియల వరకు

వివాహం అయ్యాక మనిషి లైంగిక భావోద్రేకాలలో నిలకడ, నిమ్మళం ఏర్పడాలి. అయితే ఈ విషయం ఆలుమగల పరస్పర వ్యవహారసరళిపై కూడా ఆధారపడి ఉంటుంది. అందుకే ఇస్లాం ఈ దాంపత్య దశలో వారిరువురి లైంగిక భావోద్రేకాలు పెడదారి పట్టకుండా ఉండేందుకు సంపూర్ణ మార్గదర్శకత్వం వహిస్తుంది. నికాహ్ తరువాత నవదంపతులకు ఇస్లాం ఇచ్చే శిక్షణ ఏమిటో చూద్దాం.

### i) భర్త భావోద్రేకాలను భార్య గౌరవించాలి

సాధ్యమైనంతవరకు భార్య తన భర్తలోని లైంగిక భావోద్రేకాలను దృష్టిలో పెట్టుకుని అతని యెడల తదనుగుణంగా మసలుకోవాలి. అతని మనోవాంఛను తీరుస్తూ ఉండాలి. ఈ నేపథ్యంలో దైవప్రవక్త (స) ఇలా ప్రవచించారు: "ఏ శక్తిమంతుని అధీనంలో నా ప్రాణ ముందో ఆయన సాక్షి! భర్త తన భార్యను పడకపైకి పిలిచినప్పుడు ఆమె (అకారణంగా, నిరాకరిస్తే ఆకాశాలలోనున్న వాడు కూడా అప్రసన్నుడవుతాడు. భర్త ఆమె పట్ల ప్రసన్నుడు కానంతవరకూ ఆయన కూడా ప్రసన్నుడవడు" (ముస్లిం). భర్త భావోద్రేకాలను గమనిస్తూ ఉండే విషయంలో ఇస్లాం భార్యకు ఎంతవరకు తాకీదు చేసిందంటే, ఒకవేళ ఆమె (నఫిల్) ఉపవాసం ఉండాలనుకున్నాసరే భర్త అనుమతి పొందవలసిందే.(బుఖారి)

**'శృంగారానికి ఒప్పుకోకుంటే విడాకులే'**

బెంగుళూరు, న్యూస్‌టుడే: పెళ్లి, సంసార జీవితంలో లైంగిక చర్య ప్రధాన అంశమని ఇక్కడి హైకోర్టు పేర్కొంది. భార్యాభర్తల్లో ఎవరైనా ఆ ప్రక్రియను నిరాకరిస్తూ వస్తే దానిని క్రూరత్వం కింద పరిగణించి విడాకులు మంజూరు చేయవచ్చని ధర్మాసనం తీర్పునిచ్చింది. చెన్నైకి చెందిన వ్యక్తికి, దావణగెరెకి చెందిన మహిళతో 2002లో వివాహమైంది. ఉద్యోగరీత్యా భర్త చెన్నైలో, భార్య దావణగెరెలో ఉంటున్నారు. సెలవురోజుల్లో ఆమె చెన్నైకి వచ్చినా శృంగారానికి అంగీకరించడం లేదని, తనకు విడాకులు మంజూరు చేయాలని

భర్త బెంగళూరులోని ఫ్యామిలీ కోర్టులో 2005లో కేసు వేశారు. తనకు లైంగిక చర్యలేకున్నా విడాకులకు అంగీకరించనని భార్య చెప్పటంతో మూడేళ్ల తరువాత (2008లో) ఫ్యామిలీ కోర్టు కేసు కొట్టివేసింది. ఈ తీర్పును ప్రశ్నిస్తూ భర్త, ఇక్కడి హైకోర్టులో అర్జీ వేశారు. కేసును జస్టిస్ ఎన్.కె.పాటిల్, జస్టిస్ బి.వి.పింటోల ధర్మాసనం విచారించింది. 'అవకాశం ఉండీ దంపతుల్లో ఎవరైనా లైంగిక ప్రక్రియకు అనుమతించకపోవటం క్రూరత్వం కిందకే వస్తుందని' ధర్మాసనం అభిప్రాయపడింది. విడాకుల్ని మంజూరు చేస్తున్నట్లు తీర్పు వెలువరించింది. (ఈనాడు: 17-4-2012) - అనువాదకుడు

## ii) నాలుగు వివాహాల వరకూ అనుమతి

ఇస్లాం ఎట్టి పరిస్థితిలోనూ సమాజంలో లైంగిక విశృంఖలత్వాన్ని, లైంగిక విచ్చిన్నాన్ని నిరోధించగోరుతుంది. అందుకే అది పురుషులకు వారి తాహతును బట్టి ఏకకాలంలో ఒకటికన్నా ఎక్కువ వివాహాలను చేసుకునేందుకు అనుమతించింది. విశ్వప్రభువు ఇలా సెలవిచ్చాడు: "(మీ సంరక్షణలో వున్న) తండ్రిలేని ఆడపిల్లలను వివాహమాడి న్యాయం చేయలేమన్న భయం మీకుంటే, మీకు నచ్చిన వేరితర స్త్రీలలో ఇద్దరిని గానీ, ముగ్గురినిగానీ, నలుగురిని గానీ వివాహమాడండి. అయితే వారి మధ్య న్యాయబద్ధంగా వ్యవహరించలేమన్న భయం మీకుంటే ఒక్కామెతోనే సరిపెట్టుకోండి" (అన్ నిసా-3). అంటే న్యాయానికి కట్టుబడి ఉంటూ ఇద్దరేసి, ముగ్గురేసి, ఆఖరికి నలుగురేసి భార్యల్ని కలిగి ఉండటాన్నయినా ఇస్లాం ధర్మం సహిస్తుందిగానీ మగవాడు పరాయి ఆడవారితో చాటుమాటుగా కులకటాన్ని, ఉంపుడుకత్తెగా ఉంచుకోవటాన్ని, పరాయి ఆడవాళ్ళతో సరసాలాడటాన్ని సుతరామూ సహించదు. అలాగే మగవాళ్ళు క్లబ్బులు, పబ్బులకు వెళ్ళి కాలక్షేపం చేయటాన్ని, మ్యూజికల్ నైట్స్‌లో మునిగి ఉండటాన్ని, కళాపోషణ చాటున కలకంఠి జీవితంతో ఆడుకోవటాన్ని కూడా సహించదు. వేశ్యా వృత్తికి ప్రత్యక్షంగా గానీ, పరోక్షంగా గానీ తోడ్పడటం, సమాజంలో ముక్కుపచ్చలారని ఆడపిల్లల జీవితాలు కామాంధులకు బలైపోవటం, వ్యభిచారం ప్రబలి పోయి అక్రమ సంతానం పుట్టుకు రావటం, పిల్లలకు తమ తల్లిదండ్రులెవరో కూడా తెలియని దుర్భర పరిస్థితి ఏర్పడటం- ఇవన్నీ నైతిక అధోగతికి నిదర్శనాలు.

బహుభార్యాత్వం విషయంలో మేము ఇక్కడ మరో విషయం చెప్పదలిచాము. ఉపఖండంలోని భారత - పాకిస్తాన్ దేశాలలో ఉన్న ఆచార సంప్రదాయాల దృష్ట్యా, రెండవ వివాహం చేసుకునే వారిని అసహ్యించుకోవటం పరిపాటి. కొన్ని సందర్భాలలో రెండవ వివాహానికి సహేతుకమైన కారణాలున్నప్పటికీ (ఉదాహరణకు: భార్య దీర్ఘకాలిక అనారోగ్యానికి గురై లైంగికంగా పనికి రాకుండా పోవటం, సంతానం కలగక పోవటం వంటివి) రెండో పెళ్ళి ఒక నింద్యార్హమైన చర్యగా భావించబడుతోంది. ఈ బలమైన సంప్రదాయానికి కట్టుబడి

పాకిస్తాన్ ప్రభుత్వం ఒక ఆర్డినెన్స్ జారీ చేసింది. దీని ప్రకారం పురుషుడు రెండో పెళ్ళికోసం మొదటి భార్య నుండి అనుమతి పొందటం అవసరం. ఇది పూర్తిగా ఇస్లామేతర పద్ధతి. ఇస్లాంలో రెండవ, మూడవ, నాల్గవ పెళ్ళికి న్యాయం అనే నిబంధన తప్ప వేరొక నిబంధన లేదు. ఇందలి పరమార్థం కూడా వెనుకటి పంక్తుల్లో చెప్పుకోవటం జరిగింది. ఇక్కడ మేము ఒకే ఒక విషయం చెప్పదలిచాము- అల్లాహ్ అవతరింపజేసిన ఆజ్ఞల పట్ల ఏవగింపును, అయిష్టతను పెంచుకుని జీవితాంతం పడిన ప్రయాసను, సంపాదించుకున్న సత్కర్మలను వృధా చేసుకోకండి. ఈ నేపథ్యంలో అల్లాహ్ ఏమంటున్నాడో చూడండి: "అల్లాహ్ అవతరింపజేసిన వస్తువును వారు ఇష్టపడకపోవటం చేత ఈ విధంగా జరిగింది. అందుకే అల్లాహ్ కూడా వారి కర్మలను నిష్ఫలం చేశాడు." (ముహమ్మద్ -9)

## iii) భర్త ముందు పరాయి స్త్రీలను గురించి ప్రస్తావించరాదు

దైవప్రవక్త (స) ఇలా ఉపదేశించారు: " ఏ స్త్రీ కూడా మరో స్త్రీతో మరీ చనువుగా ఉండి ఆమె (రహస్య) విషయాలు తన భర్తకు అతను ప్రత్యక్షంగా చూస్తున్నట్లే వివరించి చెప్పకూడదు." (బుఖారీ)

## iv) రతి రహస్యాలను బయటపెట్టకూడదు

మహనీయ ముహమ్మద్ (స) ఇలా ప్రవచించారు: "ఏ వ్యక్తి తన భార్య వద్దకుపోయి (భార్య అతని వద్దకు వచ్చి)న తరువాత తన భార్య రహస్య విషయాలను ఇతరులకు చెప్పుకుంటాడో అతను ప్రళయదినాన అల్లాహ్ దృష్టిలో అందరికన్నా చెడ్డవాడుగా ఉంటాడు." (ముస్లిం)

## v) భర్త బంధువులతో పరదా పాటించాలి

ఒకసారి దైవప్రవక్త (స) తన సహచరులకు హితబోధ చేస్తూ, "స్త్రీలు ఒంటరిగా ఉన్నప్పుడు వారి వద్దకు వెళ్ళకండి" అన్నారు. 'ఓ దైవప్రవక్తా (స)! భర్త తరపు బంధువుల గురించి ఆజ్ఞ ఏమిటి?' అని ఒక సహచరుడు ప్రశ్నించగా, "వాళ్ళు మృత్యువులాంటివారు (వాళ్ళ వల్ల మరింత ఎక్కువ ప్రమాదం ఉంది)" అని ఆయన (స) బదులిచ్చారు. (తిర్మిజీ)

భర్త తరపు బంధువుల్లో- భర్త స్వంత అన్నదమ్ములతోపాటు సమీప బంధువులు కూడా చేరివున్నారు. ఉదాహరణకు: అతని పినతండ్రి కుమారులు, మేనత్త కొడుకులు, మేనమామ కొడుకులు, పిన్నమ్మ కొడుకులు మొదలగువారు.

## vi) గత్యంతరం లేని పరిస్థితిలో...

ఒక వ్యక్తి వివాహం చేసుకున్న మీదట కూడా వ్యభిచారం లాంటి నీచ నేరానికి పాల్పడితే అతనికి కఠిన శిక్ష పడవలసిందే. అందుకే ఇస్లామీయ షరీయత్ ఈ విషయంలో సమాజంలోని ఇతర సభ్యులకు సయితం గుణపాఠం కలిగేలా శిలా శిక్ష విధించింది.

teluguislam.net


ఎందుకంటే ఒక అపరాధికి విధించబడే కఠిన శిక్ష ద్వారా సమాజంలోని దుర్గంధాన్ని, అశుద్ధతను పూర్తిగా తొలగించి పరిశుద్ధపరచటం అవసరం.

సామాజిక జీవన వ్యవస్థలో ఇస్లాం ఆమోదించిన ఈ ఆజ్ఞలను ఖచ్చితంగా అమలు పరచటం ద్వారా సమాజాన్ని లైంగిక విశృంఖలత్వం నుండి కాపాడటమేగాక స్త్రీపై జరిగే దౌర్జన్యాన్ని, అత్యాచారాలను కూడా అరికట్టి ఆమెకు అత్యంత గౌరవప్రదమైన స్థానాన్ని కల్పించవచ్చు. వ్యక్తిగత స్థాయిలోనూ, సామూహిక స్థాయిలోనూ సంకల్పశుద్ధితో ఖుర్‌ఆన్ హదీసుల్లోని ఈ ఆదేశాలను పాలించనంతవరకూ మన సమాజం అంతంలేని సమస్యల అగ్నిగుండంలో కాలుతూనే ఉంటుంది. ఈ అగ్నిని చల్లార్చే మార్గం ఒక్కటే- పూర్తి వినయ వినమ్రతలతో అల్లాహ్ మరియు ఆయన ప్రవక్త (స) ఆదేశాల ముందు తలవంచటం.

పాఠక మహాశయులారా! వెనుకటి పుటల్లో మనం పాశ్చాత్య సమాజాన్ని, ఇస్లామీయ సమాజాన్ని గురించి క్షుణ్ణంగా తెలుసుకున్నాం. ఇప్పుడు స్థూల దృష్టితో ఒక్క చూపులో ఈ రెండు సమాజాలను ( పట్టికలో ) వీక్షిద్దాం.

| క్ర.సంఖ్య | సామాజిక శైలి | పాశ్చాత్య సమాజం | ఇస్లామీయ సమాజం |
|---|---|---|---|
| 1. | నికాహ్ (వివాహం) | పురుషులకు బానిసలై ఉండటమే | ప్రవక్త సంప్రదాయం/కుటుంబ జీవనానికి పునాదిరాయి |
| 2. | భర్త విధేయత | స్త్రీ స్వాతంత్ర్యంలో ప్రతిబంధకం | తప్పనిసరి |
| 3. | కుటుంబంలో పురుష స్థాయి | స్త్రీతో సమానం | కుటుంబ పెద్ద |
| 4. | ఇంటి వ్యవహారాలు | పని మనిషి పరం | భార్య పర్యవేక్షణలో |
| 5. | ఆర్థిక బాధ్యత | పురుషుని మాదిరిగానే స్త్రీ కూడా బాధ్యురాలు | కేవలం పురుషుని బాధ్యత |
| 6. | స్త్రీ కార్యపరిధి | పురుషుని సరసన | ఇంటికే పరిమితం |
| 7. | బహుభార్యాత్వం | అదొక ప్రహసనం | నలుగురు భార్యల వరకు అనుమతి ఉంది. |
| 8. | గర్ల్‌ఫ్రెండ్/ బాయ్‌ఫ్రెండ్ | జీవితంలో అంతర్భాగం | అధర్మం |
| 9. | ఇంటి లోపల స్త్రీ 'సతర్' | అసలు ఆ ఆలోచనే భరించశక్యం కాదు | అరచేతులు, పాదాలు తప్ప మిగతా శరీర భాగంపై అచ్ఛాదన అవసరం |
| 10. | ఇంటి బయట పరదా | మూఢాలోచన | సౌశీల్యానికి తార్కాణం |
| 11. | నగ్నత్వం | అభ్యుదయ భావం | అజ్ఞాన కాలపు ఆచారం |
| 12. | స్త్రీ-పురుషుల కలయిక | సమాజంలో అంతర్భాగం | అధర్మం |
| 13. | వ్యభిచారం | ఒక వినోదం. మనసును ఆహ్లాదపరిచే వ్యాపకం | ముమ్మాటికీ హరామ్ |
| 14. | మద్యపానం | జీవితంలో ఒక భాగం | ముమ్మాటికీ హరామ్ |
| 15. | అక్రమ సంతానం | చట్టబద్ధ సంతానం కన్నా ఎక్కువ ఆదరించదగినది | జీవితాంతం చెరగని మచ్చ. తలవంపు |
| 16. | సంతాన పోషణ | జీవితాన్ని అనుభ వించటంలో ఒక అవరోధం | తల్లిదండ్రుల కర్తవ్యం |
| 17. | తల్లిదండ్రుల సేవ | మోయలేని బరువు | అదొక ఆరాధన, అదృష్టం |
| 18. | విడాకులు | భర్త మాదిరిగానే భార్య కూడా ఇవ్వగలదు | కేవలం భర్త మాత్రమే ఇవ్వగలడు |

teluguislam.net


ఈ పట్టికను పరిశీలించిన వారికి ఇట్టే అర్థమవుతుంది. రెండు సంస్కృతులు ఒండొక దానికి భిన్నంగా ఉన్నాయని! ఒక విషయం ఒక సంస్కృతిలో మంచిదిగా కనిపిస్తే, అదే విషయం రెండవ దానిలో చెడు విషయంగా కానవస్తుంది. ఒక అంశం ఒక సమాజంలో అభ్యుదయ భావంగా తోస్తే, అదే అంశం రెండవ సమాజంలో మూఢాచారంగా గోచరిస్తోంది.

# పాశ్చాత్య ప్రముఖుల సాక్ష్యం

ఇస్లాం సామాజిక జీవన వ్యవస్థ గురించి ముస్లింలు సకారాత్మకంగా స్పందించటం సహజ విషయమే. అది వారి విశ్వాసంలో అంతర్లీనమై ఉన్న విషయం. అయితే మేమిక్కడ పాశ్చాత్య దేశాలలోనే పుట్టి, పాశ్చాత్య సామాజిక వ్యవస్థలోనే పెరిగిన కొంతమంది ప్రముఖులు ఇస్లాం గురించి వెలిబుచ్చిన అభిప్రాయాలను పొందుపరుస్తున్నాము-

1) ప్రిన్స్‌ఛార్లెస్ ఈ మధ్య కాలంలో దివ్యఖుర్‌ఆన్‌తోపాటు, ఇస్లామీయ సాహిత్యాన్ని అధ్యయనం చేస్తున్నారు. ముస్లిం ధార్మిక సభలలో కూడా పాల్గొంటున్నారు. ఏ సభకు వెళ్ళినా, నిత్యనూతనమైన ఇస్లాం ప్రబోధనలను సర్వసామాన్యం చేయాలని, ఒకవేళ ఎవరి కయినా ఇస్లాంపట్ల అపోహలుంటే వాటిని యుద్ధప్రాతిపదికపై దూరం చేయాలని ఆయన ముస్లింలను సూచిస్తున్నారు. 1996 మార్చి 19వ తేదీన ఆయన లండన్‌లోని ముహమ్మదీ పార్క్ మస్జిద్‌లో జరిగిన ఒక కార్యక్రమానికి వచ్చి గంటన్నర సమయం అక్కడే గడిపారు. (ఖబ్రే:7-4-1996). ప్రిన్స్‌ఛార్లెస్ 1993 నుండీ ఆక్స్‌ఫర్డ్ యూనివర్శిటీలోని ఇస్లామిక్ స్టడీస్ సెంటర్‌కు అధిపతి కూడా.

2) ఆక్స్‌ఫర్డ్ యూనివర్శిటీ, ఇస్లామిక్ స్టడీస్ సెంటర్‌లో ఒకసారి దక్షిణాఫ్రికా అధ్యక్షుడు నెల్సన్ మండేలా ప్రసంగిస్తూ ఇలా అన్నారు: "ఇస్లాం సర్వవిధాలా మార్గదర్శనం చేసే జీవన విధానం. ఆఫ్రికా ఖండంలో ప్రజలు ఇస్లాంను అధ్యయనం చేసిన కొలదీ దానికి చేరువ అవుతున్నారు. పాశ్చాత్యులు కూడా ఈ విశ్వజనీన మత ధర్మాన్ని విశాల దృష్టితో అధ్యయనం చేసినట్లయితే, వారి మనో మస్తిష్కాలలో ఇస్లాం గురించి నెలకొని ఉన్న అపార్థాలు తొలగిపోతాయని నేను గట్టిగా భావిస్తున్నాను." (నవాయె వక్త్ : 13-7-1997)

3) మొరాకోలో జర్మన్ దౌత్యాధికారిగా ఉన్న వెల్‌ఫ్రెడ్ హెహాఫ్‌మెన్ ఇస్లాం స్వీకరించిన మీదట "ఇస్లాంలో శిక్షలు" అనే ఒక పుస్తకం వ్రాశాడు. ఆ పుస్తకంలో దొంగతనానికి చేతులు నరకటం, హత్యచేసిన వారికి మరణదండన విధించటం, వ్యభిచారం చేసిన వారిని రాళ్లతో కొట్టి చంపటంపై ఆయన ప్రత్యేకంగా దృష్టిని సారిస్తూ మానవాళికి శాంతిభద్రతలు కల్పించా లంటే ఈ రకమైన శిక్షలు విధించటం తప్ప మార్గాంతరం లేదని నొక్కిచెప్పాడు.

(జంగ్: 2-4-1992)

4) ఒకప్పటి అమెరికా అధ్యక్షుడు నిక్సన్ రాజకీయ సలహాదారు అయిన డెనిస్ క్లార్క్, ఒకసారి అధ్యక్షుడు నిక్సన్‌కు సలహా ఇస్తూ, "అమెరికా ఇస్లాం పట్ల తనకున్న

అభిప్రాయంలో ఆహ్లాదకరమైన మార్పు తీసుకురావాలి" అన్నాడు. ఈ ఆహ్లాదకరమైన మార్పు నిమిత్తం ఇస్లాంను అధ్యయనం చేయమని నిక్సన్ సూచించగా, డెనిస్ క్లార్క్ ఇస్లాంను లోతుగా అధ్యయనం చేసి ముస్లింగా మారిపోయాడు. (జంగ్: 28-5-1996)

5) అమెరికా మాజీ అధ్యక్షుడైన జార్జ్ వాషింగ్టన్ ముని మనవడు జార్జ్ ఇష్ఫోన్ మీడియా వ్యవహారాలను చూడటానికి బీరుట్, ఇరిటియా, అఫ్గానిస్తాన్, బోస్నియా దేశాలకు వెళ్ళవలసి వచ్చింది. అక్కడ అతను అనేకమంది ముస్లిం డాక్టర్లను, పాత్రికేయులను కలుసుకుని చర్చించాడు. ఇస్లాం గురించి అనేక విషయాలను అడిగి తెలుసుకున్నాడు. చివరికి అతను దివ్యఖుర్ఆన్ అధ్యయనం మొదలెట్టాడు. ఖుర్ఆన్ అధ్యయనం పూర్తయిన తరువాత అతను ఇలా అభిప్రాయపడ్డాడు: "దివ్యఖుర్ఆన్ చదివిన తరువాత ఎంతోకాలంగా నన్ను కలచి వేస్తున్న సందేహాలకు సంతృప్తికరమైన సమాధానం లభించింది. దీని గురించి నేను లోగడ బైబిల్ చదివాను. క్రైస్తవ పండితులను సంప్రదించాను. కాని వారు నన్ను నిరాశపరిచారు." ఇది జరిగిన కొన్నాళ్ళకు జార్జి ఇష్ఫోన్ అమెరికాలో చనిపోయిన ఒక ముస్లిం అంత్యక్రియలకు హాజరయ్యాడు. ముస్లిం మృతదేహానికి జరిపే అంత్యక్రియలను చూసి అతనెంతగానో ప్రభావితుడయ్యాడు. అంత్యక్రియల సమయంలోనే అతను సాక్ష్యవచనం (కలిమయె షహాదత్) పలికి తాను ఇస్లాం స్వీకరిస్తున్నట్లు ప్రకటించాడు.

(అద్దావ, రియాజ్: హిజ్రీ శకం: 1418 రబీవుల్ అవ్వల్)

6) అమెరికన్ కాంగ్రెస్ కమిటీ సభ్యుడైన జెమ్ మోరిన్ ఇలా అంటున్నాడు: "నేను నా పిల్లలకు ఇస్లాంను అధ్యయనం చేయమని చెబుతూ ఉంటాను. ఇస్లాం ధర్మసందేశ ప్రదాత హజ్రత్ ముహమ్మద్ (స) చాలా గొప్ప వ్యక్తి. ఆయన లాంటివారు చరిత్రలో కనిపించరు. కాని విచారకరమైన విషయమేమంటే, ఆయన ప్రబోధనలను చదవకపోవటానికి రెండే రెండు కారణాలున్నాయి. ఒకటి: ముస్లిమేతరుల మంకుతనం . రెండు: ముస్లింలలోని లోపం (దావా మ్యాగజైన్: 1996 జూన్).

7) అమెరికా మాజీ అటార్నీ జనరల్ రీమ్జే క్లార్క్ ఒకసారి తానిచ్చిన ఇంటర్వ్యూలో ఇలా అన్నాడు: "ఇస్లాం ప్రపంచంలోని అత్యంత ప్రభావవంతమైన ఆధ్యాత్మిక, నైతిక శక్తి. అమెరికా కారాగారాలలో మ్రగ్గుతున్న వేలాది మంది పిల్లలకు స్వంత ఇళ్ళు లేవు. వారికి చదువు సంధ్యలు లేవు. మాదక ద్రవ్యాలకు అలవాటుపడినవారు. ఆకతాయి చేష్టలు, నేరాలు వారి జీవితంలో నిత్యకృత్యాలు. కాని ఈ ఖైదీలే ఇస్లాంను అధ్యయనం చేసినప్పుడు వారి జీవితాలలో ఆశాజనకమైన పరివర్తన వచ్చింది. రోజూ ఐదుపూటలు నమాజ్ చేయ సాగారు. శారీరకంగానూ, మానసికంగానూ వారు స్వీయ క్రమశిక్షణకు అలవడ్డారు. జైళ్లలో ఎప్పుడు అవాంఛనీయ ఘటనలు జరిగినా ఈ యువకులే జోక్యం చేసుకుని ఖైదీల మధ్య సయోధ్యకు యత్నిస్తుంటారు. (తక్బీర్: 8-1-1998)

8) జపాన్ దేశస్థురాలైన 'ఖౌలా లుకాత' తన దేశంలో వేగంగా ప్రబలుతున్న ఇస్లామీయ భావాలను గురించి చెబుతూ, ప్రస్తుతం జపాన్‌లో మహిళలు వేగంగా ఇస్లాం వైపు

teluguislam.net



మొగ్గుతున్నారు. పరిస్థితులు సానుకూలంగా లేకపోయినప్పటికీ వారు తమ తల భాగాన్ని వస్త్రంతో కప్పుకుంటున్నారు. తాము హిజాబ్ (బురఖా)కు కట్టుబడి ఉన్నందుకు గర్వపడుతున్నారు. ఇది వారిలోని ఈమాన్ (విశ్వాసం)కు ప్రబల నిదర్శనం. "నేను జన్మతః ముస్లింను కాను. అయినప్పటికీ కథాకథిత మహిళా స్వాతంత్ర్యాన్ని, ఆధునిక జీవన వ్యవస్థలోని పైపై మెరుగులను వదులుకుని ఇస్లాంను ఎంపిక చేసుకున్నాను. ఇస్లాం స్త్రీల పట్ల అణచివేత విధానాలను అనుసరిస్తుందన్న వాదనలో నిజం ఉంటే నేడు ఐరోపా, అమెరికా, జపాన్ తదితర దేశాలలో మహిళలు ఇస్లాంను ఎందుకు ఆశ్రయిస్తున్నట్టు? ఈ విషయంపై ప్రజలు ఆలోచిస్తే ఎంత బావుండు!?" (తర్జుమానుల్ ఖుర్ఆన్: 1997 మార్చి)

పైన పేర్కొనబడిన ఉదాహరణల ద్వారా తేటతెల్లమయ్యే వాస్తవమేమంటే, ఇస్లాం లోని విశ్వజనీన ప్రబోధనలు మానవ నైజానికి, ప్రకృతికి అనుగుణంగా ఉన్నాయి. మానవ మనోమస్తిష్కాలను ఆకట్టుకునే శక్తి అందులో సంపూర్ణ స్థాయిలో వుంది. పాశ్చాత్య మేధావులు వెలిబుచ్చిన ఈ అభిప్రాయాలు ముస్లింలకు గుణపాఠం లాంటివి. మనం ప్రశాంత చిత్తంతో ఆలోచించాలి! ముస్లిమేతర జాతులు శతాబ్దాల తరబడి కుఫ్ర్ (దైవతిరస్కార) అంధకార లోయల్లో తచ్చాడినప్పటికీ ఎట్టకేలకు అవి మోక్షం కొరకు ఇస్లాం వైపు మరలుతుండగా మనం నిర్లిప్తంగా ఉండిపోవటం శోచనీయం కాదా!? ప్రస్తుతం మనం మనస్ఫూర్తిగా ఇస్లాం వైపునకు మరలవలసిన ఆవశ్యకత ఉంది. మన ఏలిన వారికి, మేధావులకు, అధికారులకు కూడా ఈ యదార్థాన్ని గ్రహించే సద్బుద్ధి లభిస్తే బావుండు!

# తల్లిదండ్రుల సేవ గురించి మనవి

"ప్రతి శిశువు ప్రకృతి ధర్మం (ఇస్లాం) పైనే జనిస్తుంది. కాని దాని తల్లిదండ్రులు దానిని యూదునిగానో, క్రైస్తవునిగానో, జోరాస్ట్రియన్‌గానో మారుస్తారు" అని మహనీయ ముహమ్మద్ (స) ప్రవచించారు (బుఖారీ). ఈ హదీసును బట్టి సంతాన శిక్షణ ప్రాముఖ్యం ఎంతటిదో ఊహించవచ్చు. సంతాన శిక్షణకు సంబంధించి తల్లిదండ్రులపై ఉన్న బాధ్యత కీలకమైనది. అయితే మేమిక్కడ దాంపత్య జీవిత శీర్షిక దృష్ట్యా కొన్ని ముఖ్యాంశాలు మాత్రమే ప్రస్తావిస్తున్నాము.

### (అ) పరువం ఉరకలు వేస్తున్నప్పుడు...

యుక్త వయస్సుకు చేరుకున్న అబ్బాయిలు, అమ్మాయిలకు ఆ వయస్సులోని సమస్యలను వారికి ఎరుకపరచటం అవసరం. ఈ విషయమై మన నాట రెండు విభిన్న విధానాలు గోచరిస్తాయి. ఒక వర్గం వారున్నారు. వారు తమ పిల్లల ముందు ఆ విషయాల ప్రస్తావనే రానివ్వరు. తమ పిల్లల నోట కూడా ఆ విషయాలు వినదలచరు. ఇది ఒక అతివాదం. మరో వర్గం వారిది మరో అతివాదం. వారు పాశ్చాత్య సంస్కృతీ ప్రియులు. కాబట్టి పాఠశాలల్లో తమ పిల్లలకు ఐరోపా మాదిరి సెక్స్ ఎడ్యుకేషన్ బోధించాలంటారు. ఇది కూడా తప్పే. ఈ రెండు అతివాదాలకు నడుమ మధ్యేమార్గం అవలంబించాలి. ఏమిటా

మధ్యేమార్గం అంటే; యుక్త వయస్సుకు చేరుకున్న పిల్లలకు స్వయంగా తల్లిదండ్రులే ఇస్లామీయ బోధనల వెలుగులో- ఆ వయస్సులో యువతకు ఎదురయ్యే సమస్యలను గురించి సమయోచితంగా వివరించాలి. ఇలా చెయ్యకపోతే ఆ టీనేజీ పిల్లలు అశ్లీల సాహిత్యాన్ని ఆశ్రయిస్తారు. బుల్లితెర (TV)కు అతుక్కుపోతారు. ఇంటర్‌నెట్ ద్వారా చేరకూడని దూరతీరాలకు చేరుకుంటారు. ఒక్కోసారి చిటికెలో పరిష్కరించవలసిన సమస్యను పెద్దలు పట్టించుకోకపోవటం వల్ల జీవితాంతం విలపిస్తూ ఉండవలసిన దురవస్థ దాపురిస్తుంది.

## (అ) వివాహ సమయంలో అమ్మాయిల అంగీకారం

ఇస్లాం పురుషుని మాదిరిగానే స్త్రీకి కూడా తన జీవిత భాగస్వామిని ఎంపిక చేసుకునే పూర్తి స్వేచ్ఛ ఇస్తుందన్న సంగతిని మనం ఇంతకుముందు కూడా స్పష్టం చేశాం. కాని మన నాట పెద్దలు అబ్బాయి ఇష్టాయిష్టాలకు ఇచ్చినంత ప్రాధాన్యత అమ్మాయి ఇష్టాయిష్టాలకు ఇవ్వరు. ఒక్కోసారి అబ్బాయిలు మంకుపట్టు పట్టి లేదా ఇతరత్రా పద్ధతుల్లో ప్రతిస్పందించి తమ పంతం నెగ్గించుకుంటూ ఉంటారు. కాని...అమ్మాయిల మనోభావాలకు అంతగా విలువ ఇవ్వరు. సాధారణంగా అమ్మాయిల్లో బెరుకు, బిడియం ఉంటాయి. వారు తమ ఇష్టాయిష్టాలను గురించి సూటిగా చెప్పలేరు. అదే సమయంలో తల్లిదండ్రుల ఆలోచనలు మరో విధంగా ఉంటాయి. తాము తెచ్చిన సంబంధాన్ని తమ కూతురు ఒప్పుకుని తీరాలి. తాము ఎవరికి కట్టబెట్టినా నోరు మెదపకుండా అతనితో సంసారానికి వెళ్ళాలి.... ఈ ధోరణి షరీయతు పరంగా కూడా సరైనది కాదు. అమ్మాయికి ఇష్టం లేకుండా చేసిన నికాహ్ గురించి దైవప్రవక్త (స) ఇచ్చిన తీర్పేమిటో ఇంతకు ముందు కూడా ప్రస్తావించాము. ఆమె కోరితే ఆ నికాహ్‌కు కట్టుబడి ఉండవచ్చు. లేదంటే నికాహ్‌ను రద్దు పరచవచ్చు (అబూ దావూద్). కాబట్టి వివాహానికి ముందు అబ్బాయిల మాదిరిగానే అమ్మాయిలకు కూడా చెప్పి ఒకటికి రెండుసార్లు ఆలోచించుకుని తమ ఉద్దేశం తెలిపే అవకాశం ఇవ్వాలి. ఒకవేళ అమ్మాయి ఎంపిక స్వేచ్ఛను ఉపయోగించుకోవటంలో పొరపడవచ్చని తల్లిదండ్రులకు భయముంటే, జీవితపు మెట్టపల్లాల గురించివారు తమ కూతురికి వివరించి ఆమెను ఒప్పించాలి. అంతేగాని ఇష్టంలేని సంబంధాన్ని బలవంతంగా రుద్దకూడదు. ఈ రకమైన నిర్బంధ విధానం షరీయతు దృష్ట్యా కూడా సమ్మతం కాదు. అదలావుంచితే ప్రాపంచికంగా కూడా ఆ కాపురంలో కలతలు వచ్చి, దుష్పరిణామాలు పొడసూపేందుకు ఆస్కారముంటుంది.

## (ఇ) సంబంధాల విషయంలో ఆచితూచి అడుగేయాలి

మహనీయ ముహమ్మద్ (స) వారి ప్రవచనం ఈ సందర్భంగా మన దృష్టిలో ఉండాలి. ఆయన (స) ఇలా అన్నారు: "నాలుగు ప్రాతిపదికలపై స్త్రీని వివాహమాడటం జరుగుతుంది. (1) ఆమె సిరిసంపదల మూలంగా, (2) ఆమె వంశపారంపర్యం మూలంగా, (3) ఆమె అందం మూలంగా, (4) ఆమె ధార్మికత మూలంగా. నీ చేతులకు మన్ను తగల! నీవు ధార్మికురాలైన స్త్రీని వివాహమాడి సాఫల్యం పొందు" (బుఖారీ). పెళ్ళి సంబంధాలు ఖాయం చేసేటప్పుడు ధార్మికతకు ప్రాధాన్యమివ్వాలని ఈ హదీసులో ఆదేశించబడింది.

teluguislam.net



అందాన్ని, ఐశ్వర్యాన్ని, మంచి కుటుంబాన్ని చూడటం షరీయతు ప్రకారం తప్పు కాదు. అవాంఛనీయం కూడా కాదు. అవన్నీ లేదా కొన్ని అయినా ప్రాప్తిస్తే సంతోషమే. అయితే వాటితోపాటు తప్పనిసరిగా చూడవలసిన అంశం ఏదంటే అది వధువులోని ధార్మికత, అణకువ, మంచిగుణం. దురదృష్టవశాత్తు మన పెద్దల్లో చాలామంది ఇక్కడే పప్పులో కాలేస్తూ ఉంటారు. వారు తమ ఆడపిల్లలకు మంచి చదువులు చదివిస్తారు. సంస్కారం నేర్పిస్తారు. ధార్మికంగా మంచి శిక్షణ యిస్తారు. కాని పెళ్ళి సంబంధాల దగ్గరికొచ్చేసరికి పై మెరుగుల్ని చూసి బోల్తా కొడతారు. తమ కూతురు కలవారి కోడలు కావాలన్న కాంక్షకొద్దీ ధార్మికతకు ఆమడ దూరాన ఉన్న కుటుంబంలో సంబంధం ఖాయం చేస్తారు. వారి అఖీదా ఎలాంటిదో చూడరు. వారు బిద్అతీలు అయినా ఫరవాలేదనుకుంటారు. అదేమంటే మా అమ్మాయి వాళ్ళను నెమ్మదిగా దారికి తెచ్చుకుంటుంది లెండి అంటారు. అత్తవారింటికి వెళ్ళిన అమ్మాయి అక్కడి జీవన ప్రవాహంలో కలసి పోవటమే జరుగుతుందిగాని ప్రవాహానికి ఎదురీత సాగించటం జరగదు. జరిగినా నూటికి కోటికి ఒకటీ అరా ఉపమానాలుంటాయి. సాధారణంగా స్త్రీలో అడ్జస్ట్ అయిపోయే గుణమే అధికంగా ఉంటుంది. అందుకే గ్రంథంకల ప్రజల కూతుర్ని తెచ్చుకోవటానికి అనుమతి ఇవ్వబడింది గాని, కూతుర్ని వారికివ్వటానికి అనుమతి ఇవ్వబడలేదు. కనీసం ధార్మికులుగా భావించబడేవారైనా ఈ విషయంలో షరీయత్ సూచించే 'కుఫ్వ' (ధార్మికంగా సరిజోడీ)ని విస్మరించరాదు. సజ్జన దంపతుల బంధం ప్రళయదినాన స్వర్గంలో శాశ్విత దాంపత్య బంధానికి దోహదకారి అవుతుందన్న విషయాన్ని కూడా ఈ సందర్భంగా గుర్తుంచుకోవాలి. ప్రపంచంలో ఆలుమగలిరువురిలో ఒకరు సజ్జనులై ఉండి మరొకరు తద్భిన్నంగా ఉంటే పరలోకంలో వారి బంధం విడిపోతుంది. స్వర్గానికి పోయే భర్త లేక భార్య యొక్క వివాహం వేరొక స్వర్గవాసితో జరిపించబడుతుంది. అందుకే నికాహ్ సందర్భంగా దివ్యఖుర్‌ఆన్‌లోని ఈ సూక్తిని మరువరాదు- "అపవిత్ర స్త్రీలు అపవిత్ర పురుషులకు తగినవారు. అపవిత్ర పురుషులు అపవిత్ర స్త్రీలకు తగినవారు. (అలాగే) పవిత్ర స్త్రీలు పవిత్ర పురుషులకు తగినవారు. పవిత్ర పురుషులు పవిత్ర స్త్రీలకు తగినవారు."
(అన్ నూర్-26)

## (ఈ) జహేజ్ (వరకట్నం)

జహేజ్ అనేది 'జహ్జ' అనే ధాతువు నుండి వచ్చింది. దీనికి అసలు అర్థం సామగ్రిని సమకూర్చుకోవటం. దీని నుండే 'తజ్‌హీజ్' అనే పదం రూపొందింది. దానికి 'తక్ఫీన్' అనే మరో పదం కూడా చేర్చబడింది. అంటే చనిపోయిన వ్యక్తిని (మృతుణ్ణి) సమాధిలోనికి చేర్చడానికి కావలసిన సామగ్రిని సమకూర్చుకోవటం అని భావం. ఇక 'జహేజ్' అంటే వధువు కొత్త కాపురం కోసం అవసరమయ్యే వస్తుసామగ్రిని సమకూర్చటం అన్నమాట. మన నాట ఇది వరకట్నంలో ఒక భాగం అయిపోయింది. వధువు తల్లిదండ్రులు దీనిని సమకూరుస్తున్నారు.

కుటుంబ వ్యవస్థలో అల్లాహ్ పురుషులను ఖవ్వామ్‌గా లేదా సంరక్షకులుగా చేయటానికి ప్రధాన కారణం పురుషుడు తన డబ్బును కుటుంబం (భార్యాబిడ్డల)పై ఖర్చు

పెట్టడమే అన్న విషయాన్ని వెనుకటి పంక్తుల్లో చెప్పుకున్నాం. (చూడండి: సూరె నిసా, ఆయత్ నెం. 34). దీని భావం ఏమిటంటే వధువు కాపురానికి వచ్చిన రోజు నుంచే ఆ కాపురాన్ని నడిపే బాధ్యత భర్తపై ఉంటుంది. దైవప్రవక్త (సఅసం) భార్యాభర్తల హక్కులను నిర్ధారిస్తూ, ఎట్టి పరిస్థితిలోనూ భార్య పోషణకయ్యే ఖర్చుల్ని భర్త భరించాలని తేల్చి చెప్పారు. ఒకవేళ భార్య శ్రీమంతురాలైనప్పటికీ పోషణాభారం భర్తపైనే ఉంటుంది (ఈ పుస్తకంలోని 'భార్యాభర్తల హక్కులు' అధ్యాయం చూడండి). వివాహ సమయంలో కూడా భర్త తన స్థోమతకు తగ్గట్టుగా భార్యకు 'మహర్' చెల్లించాలని షరీయత్ ఆదేశించటాన్ని బట్టి కూడా భర్త సర్వదా భార్యకు స్పాన్సర్‌గా ఉండాలన్న సూచన లభిస్తోంది.

జకాత్ చెల్లింపు విషయంలో కూడా షరీయత్ ఇదే నిబంధనను అనుసరించింది. భర్త సర్వకాల సర్వావస్థల్లో భార్య పోషణా బాధ్యత వహించాలి కాబట్టి శ్రీమంతుడైన భర్త తన భార్యకు జకాత్ సొమ్ము ఇవ్వలేడు. కాగా; శ్రీమంతురాలైన భార్య తన భర్తకు జకాత్ ఇవ్వగలదు. ఎందుకంటే చట్టప్రకారం భర్త పోషణాభారం ఆమెపై లేదు గనక. (చూడండి: సహీహ్ బుఖారీ, బాబుజ్జకాత్ అలజ్జౌజ్)

దైవప్రవక్త (స) తన నలుగురు కుమార్తెల వివాహం చేశారు. వారిలో హజ్రత్ ఉమ్మె కుల్సుమ్, హజ్రత్ రుఖయ్యా (ర.అన్‌హుమా)లకు కట్నకానుకలుగా అసలేమీ యివ్వలేదు. అయితే హజ్రత్ జైనబ్ (ర.అన్‌హా)కు మాత్రం ఆమె తల్లి హజ్రత్ ఖదీజా (ర.అన్‌హా) తన తరపున ఒక హారం కానుకగా ఇచ్చారు. బద్ర్ యుద్ధ సందర్భంగా యుద్ధ ఖైదీగా పట్టుబడిన హజ్రత్ అబుల్ ఆస్(రజి)ని విడిపించుకోవటానికి హజ్రత్ జైనబ్ (ర.అ)ఆ కంఠ హారాన్ని నష్టపరిహారంగా పంపిస్తే దైవప్రవక్త (స) తన సహచరులను సంప్రదించిన మీదట ఆ హారాన్ని వాపసు చేశారు. హజ్రత్ ఫాతిమా (ర.అన్‌హా)కు హజ్రత్ అలీ (రజి) మహర్ రూపంలో ఒక 'డాలు'ఇస్తే, దైవప్రవక్త(స) ఆ డాలును అమ్మి, తద్వారా వచ్చిన డబ్బుతో తన కూతురికి కావలసిన కొంత గృహ సామగ్రిని కొని యిచ్చారు. ఆ సామగ్రిలో నీళ్ల తిత్తి, ఒక దిండు, ఒక దుప్పటి కూడా ఉన్నాయి. ప్రవక్త (స)గారి ఈ సద్వ్యవహారం ద్వారా మనకు లభించే సందేశం ఏమిటంటే, కాబోయే అల్లుడికి ఆర్థిక స్థోమత లేకుంటే వధువు తల్లిదండ్రులు తమ తాహతుకు తగ్గట్టుగా తమ అల్లుడికి అత్యవసర వస్తువుల్ని కొని యివ్వవచ్చు.

కాని ఈనాడు వివాహానికి ముందు వరుని తల్లిదండ్రులు అడిగే విలాస వస్తువుల జాబితా, నికాహ్ సమయంలో అడిగే కట్నకానుకల డిమాండ్లు షరీయత్ పరంగా ముమ్మాటికీ హరామ్ (అధర్మం).

అల్లాహ్ ఇలా సెలవిచ్చాడు: "అల్లాహ్ ఎట్టి పరిస్థితిలోనూ డాబులు చెప్పుకునే గర్విష్టిని ఇష్టపడడు" (లుఖ్మాన్:18). హదీసులో మహనీయ ముహమ్మద్ (స) చెప్పిన ఒక సంఘటనను ఇమామ్ ముస్లిం (రహ్మాలై) పొందుపరిచారు. ఆ సంఘటన మనందరికీ గుణపాఠం కాగలగాలి. ప్రవక్త (స) ఇలా చెప్పారు: "ఒక వ్యక్తి రెండు అంగీలను ధరించి నడుస్తూ, తన దుస్తులపై (లోలోపలే) గర్వాతిశయంతో మిడిసి పడసాగాడు. అంతే, అల్లాహ్

teluguislam.net



అతన్ని భూమిలో దిగదొక్కేశాడు. అతను ప్రళయదినం వరకూ భూమిలో కూరుకుపోతూనే ఉంటాడు" (సహీహ్ బుఖారీ, కితాబుల్లిబాస్). తల్లిదండ్రులు సంతోషంగా ఏదన్నా కానుకగా ఇస్తే పుచ్చుకోవచ్చు. కాని వారిపై ఒత్తిడి తెచ్చి, కట్నకానుకలు సాధించుకోవటం అధర్మ సొమ్ము తినటం క్రిందికే వస్తుంది. ఈ విషయమై అల్లాహ్ ఇలా ఆజ్ఞాపించాడు: "ఓ విశ్వసించిన వారలారా! ఒండొకరి సొమ్మును అధర్మంగా తినకండి." (అన్ నిసా:29). కాబట్టి ఎవరయినా బలవంతంగా కట్నకానుకలను పుచ్చుకుని ఉంటే, అది దీని ప్రకారం అధర్మం (హరామ్). దానిని వాపసు చేయాలి. లేదంటే మాఫీ చేయించుకోవాలి. ఒక హదీసులో దైవప్రవక్త (స) చాలా స్పష్టంగా ఇలా ప్రవచించారు: "ఒక ముస్లిం రక్తం, అతని సంపద, అతని మానమర్యాద రెండవ ముస్లిం కొరకు హరామ్ (అధర్మం) గావించబడింది (ముస్లిం). ఒక ఉల్లేఖనంలో ఈ విధంగా కూడా వుంది: "జుల్మ్ (అన్యాయం) ప్రళయదినాన దట్టమైన చీకటిగా ముందుకు వస్తుంది" (బుఖారీ, ముస్లిం). అమ్మాయి తల్లిదండ్రుల నుంచి జబర్దస్తీగా కట్నకానుకలు గుంజటం ముమ్మాటికీ అన్యాయం. ఇలాంటి అన్యాయానికి పాల్పడేవారు ప్రపంచంలో తాము పాల్పడే ఈ కక్కుర్తికి గాను పరలోకంలో ఘోర నష్టాన్ని చవిచూడవలసి వస్తుందన్న విషయానికి భయపడాలి. అక్కడ హక్కుల చెల్లింపుకు సంపదకు బదులు మనిషి కర్మలు మారకంగా ఉంటాయి. ఖుర్ఆన్ హదీసుల్లోని ఈ ఆదేశాలే గాకుండా కట్నకానుకలకు సంబంధించిన మరిన్ని అసంఖ్యాకమైన ఆజ్ఞలున్నాయి. ఒక్క కూతురి వివాహానికి కావలసిన కట్నకానుకలను సమకూర్చటమే గగనమయ్యే పేద తల్లిదండ్రులు ఇద్దరు ముగ్గురు అమ్మాయిల వివాహాలు ఎలా చేయగలుగుతారు? తత్కారణంగా వారికి నిద్రపట్టదు. గత్యంతరంలేక అప్పులు చేస్తారు. తలదాచుకున్న ఇంటిని తాకట్టు పెడతారు. కాస్తోకూస్తో పొలం ఉంటే అది కూడా అమ్మకానికి పెడతారు. ఈ విధంగా రెండు కుటుంబాల మధ్య ప్రేమానురాగాలకు వారిధి కావలసిన వివాహం పరస్పర వైషమ్యాలకు, శత్రుత్వాలకు కారణంగా నిలుస్తుంది. ఏ ఆడపిల్లల్ని పెంచి పోషించి, వివాహం చేసి యిస్తే స్వర్గమార్గం సుగమం అవుతుందని శుభవార్త యివ్వబడిందో ఆ ఆడపిల్లలే అభాగ్యానికి ఆనవాలుగా నిలుస్తున్నారు. మరో వైపు పెళ్ళయిన కూతుళ్ళు కూడా మనస్తాపానికి, ఆత్మన్యూనతకు గురై బ్రతుకు బండిని ఈడుస్తున్నారు. ఒక ప్రపంచ సంస్థ సర్వే ప్రకారం పాకిస్తాన్‌లో ఒక కోటికన్నా ఎక్కువమంది అమ్మాయిలే వివాహం కాకుండా ఉన్నారు. వారిలో 40లక్షల మంది అమ్మాయిల వయస్సు పైబడుతున్నది. మరోవైపు తల్లిదండ్రులు, ఇంతవరకు తమ అమ్మాయిల పెళ్ళి కాలేదే అన్న బాధతో కృంగిపోతున్నారు. (ఉర్దూ న్యూస్: 17-4-1996).

ఇక కట్నకానుకలు ఎక్కువగా ఇచ్చే వారు దానికి బదులుగా అబ్బాయి నుంచి భారీ మొత్తంలో 'మహర్' రాబట్టాలని చూస్తున్నారు. నగదుగా కాకపోయినా అప్పుగానయినా వ్రాయిస్తారు. ఈ భారం వరునిపై తడిసి మోపెడవుతుంది. అలా భారీ మొత్తం 'మహర్'గా వ్రాయిస్తే తమ కూతురి దాంపత్య బంధం బలోపేతం అవుతుందని వారనుకుంటున్నారు. దాంపత్య బంధం బలపడేది ప్రేమానురాగాల వల్లనేగాని పైసలవల్ల కాదు. కోట్లు ఖర్చు పెట్టి కూడా ఆ ప్రేమానురాగాలను ఎవరూ కొనలేరు. పేదరికంలో మ్రగ్గుతూ పస్తులుండ టానికైనా సిద్ధమవుతారుగాని, ఆ ప్రేమబంధం తెగకుండా జాగ్రత్తపడే అసంఖ్యాక దంపతు

లను మనం సమాజంలో చూస్తున్నాము. ఎక్కువ వరకట్నమివ్వటం వల్ల లేక ఎక్కువ 'మహర్'ని వ్రాయించటం వల్ల సంసార జీవితం పటిష్టమయ్యే సంగతి ఏమోగాని దానివల్ల ఎక్కడో ఏదో అనిర్వచనీయమైన అగాధం ఏర్పడుతుంది. ఒక్కోసారి ఆ దంపతులు భారీగా నష్టపోవలసిన పరిస్థితి కూడా ఉత్పన్నమవుతుంది.

ఈ సందర్భంగా మేము నవ యువకులకు ప్రత్యేకంగా విజ్ఞప్తి చేస్తున్నాము- మన సమాజానికి చీడ పురుగులా మారిన ఈ దురాచారాన్ని రూపుమాపటానికి వారు దృఢ సంకల్పంతో ముందుకు రావాలి. కట్నం కొరకు డిమాండు చేయకుండా తమ తల్లిదండ్రులను మానసికంగా సిద్ధం చేయాలి. ఈ మహమ్మారికి వ్యతిరేకంగా పోరాడేవారికి దేవుని తోడ్పాటు తప్పకుండా లభిస్తుంది. అల్లాహ్ అపారమైన నిధి నిక్షేపాలకు అధిపతి. కట్నం లేకుండా పెళ్ళి చేసుకునే అబ్బాయిలు ఈనాడు పేదవారై ఉంటే రేపు అల్లాహ్ వారిని అనూహ్యంగా కటాక్షించవచ్చు. దీనికి భిన్నంగా ఈనాడు కట్నకానుకల కోసం తమ అత్తవారిని వేధించే ప్రబుద్ధులు రేపటి రోజున తమ కూతుళ్ళ వివాహ సమయంలో సరిగ్గా అలాంటి వేధింపులకే గురికావచ్చు. "ఇవి కాలచక్రపు ఎగుళ్ళు దిగుళ్ళు. వీటిని మేము మనుషుల మధ్య త్రిప్పుతుంటాము." (ఆలి ఇమ్రాన్:140)

నికాహ్ నియమ నిబంధనలకు మన క్రియాత్మక జీవితంలో ఎంతో ప్రాధాన్యత ఉంది. ప్రామాణిక హదీసుల వెలుగులో ఈ నియమ నిబంధనలను సేకరించేందుకు మేము పలువురు విద్వాంసుల సలహాలను, నిర్దేశాలను పొందాము. ఆరంభంలో ఈ పుస్తకానికి నోట్స్ వ్రాస్తున్నప్పుడు 'నికాహ్'తోపాటు, 'తలాఖ్' నియమాలను కూడా ఒకేచోట పొందుపరచాలని భావించాము. కాని పుస్తకం పేజీలు పెరగటంచేత 'నికాహ్ నిబంధనల' వరకే దీనిని పరిమితం చేశాం. అంతమాత్రాన పుస్తక ప్రయోజనంలో ఎలాంటి తేడా రాదు. ఇన్షా అల్లాహ్ తలాఖ్ (విడాకులు) నియమ నిబంధనలు వేరుగా చర్చించుకుందాం.

ఆదరణీయులైన విద్వాంసులు, శ్రేయోభిలాషులు మనస్ఫూర్తిగా ఈ పుస్తక సంకలనంలో నాతో సహకరించారు. అందరికీ నిండు హృదయంతో కృతజ్ఞతలు తెలుపు కుంటున్నాను. అల్లాహ్ వారందరినీ ఇహపరాలలో కటాక్షించాలని దుఆ - ఆమీన్!

> **రబ్బనా తఖబ్బల్ మిన్నా ఇన్నక అంతస్సమీవుల్ అలీమ్. వతుబ్ అలైనా ఇన్నక అంతత్తవ్వాబుర్రహీమ్.**
>
> "ఓ మా ప్రభూ! మా సేవను ఆమోదించు. నిశ్చయంగా నీవు సర్వం వినేవాడవు. సర్వం ఎరిగినవాడవు. మాపై దయ జూపు. నిశ్చయంగా నీవు అమితంగా పశ్చాత్తాపాన్ని స్వీకరించేవాడవు, అపారంగా కరుణించేవాడవు."

**- ముహమ్మద్ ఇఖ్బాల్ కైలానీ**

*(జామియ మలిక్ సవూద్- రియాద్,*
*కింగ్డమ్ ఆఫ్ సవూదీ అరేబియా)*